అనుదినం... జనస్వరం


www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 23-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 235 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50





ఇది ఆరంభమే..

ఆంక్షలు లేని రుణమాఫీ అమలయ్యేదాక వెంటబడతాం

- రేవంత్‌రెడ్డి సొంత ఊర్లో మాఫీ పూర్తయితే రాజీనామాకు సిద్ధం
- రుణమాఫీ కోసం కాంగ్రెస్ నాయకులను నిలదీయండి : చేవెళ్ల ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సీఎం రైతులను మోసం చేసిండు : జనగామలో మాజీమంత్రి హరీశ్
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో బీఆర్ఎస్ ఆందోళనలు

నవతెలంగాణ-విలేకరులు

ఆంక్షలు లేకుండా ప్రతి రైతుకూ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని.. రుణమాఫీ, ఆరు గ్యారంటీలు, డిక్లరేషన్లు, 420 హామీలు అమలు అయ్యే వరకూ వెంటబడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఊరు కొండారెడ్డిపల్లిలోనే పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదని, అయి ఉంటే తన రాజీనామాకు సిద్ధమని సీఎంకు కేటీఆర్ సవాల్ విసిరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ.. గురువారం బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణంలో నిర్వహించిన ధర్నాలో కేటీఆర్ ...13లో

బీజేపీతో దేశానికి ముప్పు

అదానీ వ్యవహారంపై విచారణకు ఈడీకి జంకెందుకు?

- అక్రమాలపై సమాధానం చెప్పకుండా మోడీ పారిపోయారు
- కేసీఆర్ ఎందుకు స్పందించరు..? ట్విట్టర్ టిల్లు కేటీఆర్ ఎందుకు మాట్లాడరు..?
- 16 మంది ప్రధానులు చేసిన అప్పు కంటే మోడీ చేసింది రెండింతలు ఎక్కువే..

సెబీ చైర్‌పర్సన్ తక్షణమే రాజీనామా చేయాలి
లేదంటే కేంద్రం తక్షణమే ఆమెను తొలగించాలి : ఈడీ ఆఫీస్ వద్ద ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


దేశానికి బీజేపీ పెను ముప్పుగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్రమాదం నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. దేశాన్ని దోచుకుతింటున్న బీజేపీని కేసీఆర్ ఎందుకు ప్రశ్నించడం లేదనీ, ట్విట్టర్ టిల్లు కేటీఆర్ ఈ దోపిడీపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీజేపీకి, బీఆర్ఎస్ అనుకూలంగా ఉందనడానికి ఇదే నిదర్శనమన్నారు. అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటు కమిటీ (జేపీసీ) నియామకంపై బీఆర్ఎస్ విధానమేంటో స్పష్టం చేయాలని సీఎం డిమాండ్ చేశారు. సెబీ కుంభకోణంపై బీఆర్ఎస్ నేతలు బీజేపీని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఆ పార్టీ విలీనమైతదో, మలినమైతదో తమకు సంబంధం లేదని ఎద్దేవా చేశారు. సెబీ చైర్మన్ ...5లో

కేసు నీరుగార్చే యత్నం

- విచారణలో నిబంధనలు పాటించలేదు
- 30 ఏండ్లలో ఇలాంటి కేసు చూడలేదు

సీబీఐ, పోలీసుల నివేదికలకు మధ్య వ్యత్యాసం ఎందుకుంది?

- కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులో బెంగాల్ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం
- క్రైం సీన్‌ను మార్చేశారు : సీబీఐ రిపోర్టు
- వైద్యుల భద్రతపై సుప్రీం కీలక ఆదేశాలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కోల్‌కతా హత్యాచారం (లైంగికదాడి, హత్యకు గురైన ట్రైనీ డాక్టర్) కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారంటూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణ విషయంలో నిబంధనలు పాటించలేదని, ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారంటూ అభిప్రాయపడింది. కోల్‌కతా ఆర్‌జి కర్ ఆస్పత్రిలో లైంగికదాడి, హత్యకు గురైన ట్రైనీ డాక్టర్ హత్య కేసును అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ కేసును గురువారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెపి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఘటన ...13లో

విధుల్లో చేరండి

వైద్యులకు సీజేఐ విజ్ఞప్తి

ఆందోళన చేస్తున్న వైద్యులను విధులకు హాజరు కావాలని మరోసారి సీజేఐ కోరారు. డ్యూటీ చేస్తూనే ఆందోళన చేస్తున్నామని వైద్యుల సంఘాలు తెలిపాయి. విధులకు హాజరైనప్పటికీ క్యాజువల్ లీవ్ కట్ చేసి వేధిస్తున్నారని ట్రైనీ డాక్టర్లు సుప్రీంకోర్టుకు వెల్లడించారు. మొదట విధులకు హాజరుకా వాలని సీజేఐ సూచిం చారు. విధుల్లో చేరిన డాక్టర్లకు ఉద్యోగ రక్షణ కల్పించేందుకు కోర్టు హామీ ఇస్తుందని తెలిపారు. ఒకవేళ డాక్టర్లు విధుల్లో చేరకుంటే ప్రజా ఆరోగ్య వ్యవస్థ ఎలా పని చేస్తుందని చంద్రచూడ్ ప్రశ్నించారు. నేషనల్ టాస్క్ ఫోర్స్‌లో రెసిడెంట్ డాక్టర్లను కూడా చేర్చాలని ట్రైనీ డాక్టర్లు కోరారు. రెసిడెంట్ డాక్టర్ల సమస్యలను నేషనల్ టాస్క్‌ఫోర్స్ కమిటీ వింటుందని సీజేఐ భరోసా ఇచ్చారు. దీంతో 11 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమిస్తున్నట్టు డాక్టర్లు ప్రకటించారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఇక్రిశాట్ డైరెక్టర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఇంటర్నేషనల్ క్రాస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సెమి అండ్ ట్రాఫిక్ (ఇక్రిశాట్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాక్వెలిన్ హ్యూ గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో భేటీ అయ్యారు. వివిధ రకాల పంటలకు సంబంధించి అధిక దిగుబడిని అందించే కొత్త వంగడాలపై పరిశోధనలు చేయాలని జాక్వెలిన్ కు ఈ సందర్భంగా సీఎం సూచించారు. తెలంగాణలో వ్యవసాయ రంగం అభివృద్ధికి ఉపయోగపడేలా పరిశోధనలు ఉండాలని ఆమెను కోరారు. ఇక్రిశాట్‌ను సందర్శించాలని కోరిన జాక్వెలిన్ విజ్ఞప్తి పట్ల సీఎం సానుకూలంగా స్పందించారు.

గ్రామీణులకు 'దూరవిద్య' దూరమవ్వనుందా..?

యూజీసీ నూతన సంస్కరణలు

యూజీసీ : డెబ్ ద్వారా ప్రవేశాల్లో సమూల మార్పులు



నకిలీ దూరవిద్య సంస్థల ఏరివేతకా ?
సంప్రదింపులు లేకుండా అమలులో తొందరేలా ?

నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) శాఖ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డీఈబీ) ప్రవేశ ప్రక్రియలో సమూల మార్పులు తీసుకొచ్చింది. దీనికి సంబంధించి 2024 -2025 అకాడమిక్‌కు కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. వీటి ప్రకారం దేశంలోని అన్ని దూర విద్యాకేంద్రాలు, ఓపెన్ యూనివర్సిటీ ద్వారా జరిగే ప్రవేశ ప్రక్రియ, ప్రవేశ విధానంలో సమూలంగా మార్పులు చేర్పులు తీసుకొచ్చారు. ఈ నూతన మార్గదర్శకాల ప్రకారం దూరవిద్యను అభ్యసించే ప్రతి విద్యార్థీ ముందుగా ఒక "ఏబీసీ - ఐడి"(అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ ఐడెంటిఫికేషన్)ను క్రియేట్ చేసుకోవాలి. ఆధార్ నెంబర్, రిజిస్టర్ మొబైల్ నెంబర్‌ను ఉపయోగించి ఈ ఐడీని క్రియేట్ చేయాలి. తర్వాత ఈ ఏబీసీ-ఐడీ నెంబర్‌ను ఉపయోగించి యూజీసీ డెబ్ ఐడీని క్రియేట్ చేసుకోవాలి. దీని తర్వాత మాత్రమే సంబంధిత విద్యార్థికి ఏ దూర విద్యా కేంద్రంలో లేదా సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఏ కోర్సు అందుబాటులో ఉంది, అదేవిధంగా ఏ కోర్సుకు అనుమతి ఉంది అనే విషయాలు ఒక అడ్మిషన్ పోర్టల్ ద్వారా తెలుస్తాయి. అప్పుడు సంబంధిత విద్యార్థి తనకు ఇష్టమైన కోర్స్‌ను ఇష్టమైన దూరవిద్య సంస్థ ద్వారా అభ్యసించొచ్చు.

నకిలీ విద్యా సంస్థలకు అడ్డుకట్ట కోసమేనా ?

యూజీసీ చైర్మెన్ ప్రకటన ప్రకారం.. ఈ నూతన మార్గదర్శకాలు నకిలీ విద్యాసంస్థలు, నకిలీ కోర్సులు లాంటి వాటిని అధిగమించడానికి ఉపయోగపడతాయి. కానీ ఈ ప్రక్రియలో విద్యార్థికి, దూరవిద్యా కేంద్రానికి ఉండాల్సిన ప్రత్యక్ష సంబంధం ఈ రెండు స్టెప్పుల తర్వాత మాత్రమే ఏర్పాటు అవుతుంది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ఇంటర్నెట్ సరిగ్గా ఉపయోగించుకోలేని విద్యార్థులు దూరవిద్య అభ్యసించడానికి ఈ విధానం ద్వారా ఇబ్బంది కలుగుతుంది. తమ సంస్థల్లో ప్రవేశాలు చేసుకునే స్వయం ప్రతిపత్తి దూరవిద్యా కేంద్రాలకు, సార్వత్రిక విశ్వవిద్యాలయాలకు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే ఈ ప్రవేశ ప్రక్రియకు తేదీలను నిర్దేశించడం ద్వారా ఈ స్వయం ప్రతిపత్తిని యూజీసీ వారు చాలావరకు హరించి వేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు ప్రవేశ విధానాన్ని మార్చడం ద్వారా ఈ స్వయం ప్రతిపత్తికి ఇంకొంత విఘాతం కలిగే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

స్వయం ప్రతిపత్తిని హరించడమేనా ?

విద్య అన్నది రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్లో ఒక ఉమ్మడి జాబితాలో పేర్కొన్న అంశం. ఇది 1976 నుంచి ఉన్న పరిస్థితి. అప్పుడు రాష్ట్రాలకు కూడా సరైన స్వయం ప్రతిపత్తి, స్వయం నిర్ణయాధికారం ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది. కానీ నీట్ పరీక్ష, నేషనల్ ఎడ్యుకేషన్ టెస్టింగ్ లాంటి చర్యల ద్వారా ఇప్పటికే రాష్ట్రాల అధికారాలను కేంద్రం హరించింది. ఇప్పుడు ఈ లిస్టులో దూరవిద్య కూడా చేరింది. అందువల్ల యూజీసీ ఇలాంటి ప్రధాన నిర్ణయాలు తీసుకునే ముందు సంబంధిత రాష్ట్రాలను, విశ్వవిద్యాలయాలను, దూరవిద్య కేంద్రాలను సంప్రదించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పుడే నిర్ణయం.. అమల్లో తొందరెందుకు

ఈ విద్యా సంవత్సరం పాత ప్రక్రియ ద్వారానే ప్రవేశాలు చేసుకునే వెసులుబాటును కల్పిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. కావాల్సిన మార్పులు చేర్పులను, రానున్న విద్యా సంవత్సరం నుంచి సంప్రదింపుల ప్రక్రియ ద్వారా చేస్తే విద్యార్థులకు, సంస్థలకు లాభదాయకంగా ఉంటుందని మేధావులు, విద్యార్థులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దీనికి ఆయా దూరవిద్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు, సిబ్బందికి నూతన డెబ్ విధానంపై శిక్షణ ఇవ్వడంతో పాటుగా అవగాహన కల్పించాల్సి ఉంటుందని సంస్థల ప్రతినిధులు సూచనలు చేస్తున్నారు.

బీసీ, ఈబీసీ, కళ్యాణ లక్ష్మి పథకం కోసం రూ. 1225.43 కోట్లు విడుదల

- మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ, ఈబీసీ, కళ్యాణ లక్ష్మి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ. 1225.43 కోట్లు విడుదల చేసినట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ తెలిపారు. 2024-25 బడ్జెట్‌లో కళ్యాణలక్ష్మి పథకానికి రూ.2175.00 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. పెండింగ్ దరఖాస్తులతో పాటు తాజాగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలిపారు. కళ్యాణలక్ష్మి కోసం మొత్తం 65,026 మంది దరఖాస్తులు చేసుకోగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 33,558 అర్జీలు వచ్చాయని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం 31 మార్చ్ 2024 వరకు 31,468 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎమ్మార్వోల వద్ద 28,225, ఆర్డీవోల వద్ద 12,555 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 208 అర్జీలు వివిధ కారణాలతో రిజెక్ట్ అయ్యాయన్నారు. పెండింగ్ దరఖాస్తులు పోగా మిగిలిన 24,038 దరఖాస్తులకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. మొదటి దశలో విడుదలయిన రూ.1225.43 కోట్లలో మొత్తం దరఖాస్తులు కోసం రూ .649 .86 కోట్లు డిమాండ్ ఉండగా మంజూరైన దరఖా స్తుల కోసం రూ 240. 73 కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు వారి ఆడ బిడ్డల పెళ్లిళ్ల సహాయం కోసం కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రూ.1,00,116 సహాయం చేస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో కూడా ప్రభుత్వం రూ.1225.43 కోట్లు మంజూరు చేయడం పట్ల పొన్నం హర్షం వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు.

ఢిల్లీలో రేవంత్, భట్టి

- రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ, కృతజ్ఞత సభపై చర్చ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ, వరంగల్‌లో రైతు కృతజ్ఞత సభకు అధిష్టానం పెద్దలను ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఢిల్లీకి వెళ్లారు. వారితోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా హస్తినకు బయలుదేరారు. శుక్రవారం ఢిల్లీలోని ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియగాంధీ, రాహుల్‌గాంధీతో సమావేశం కానున్నారు. సమావేశంలో పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీ తదితర అంశాలపై జరగనున్నట్టు తెలిసింది. ఆ తర్వాత రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు సోనియా, రాహుల్, ప్రియాంకలను ఆహ్వానిస్తారు. రూ.2లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన కృతజ్ఞత సభకు రాహుల్‌గాంధీని ఆహ్వానించనున్నారు.

అదానీతో ఢిల్లీలో కుస్తీ.. తెలంగాణలో దోస్తీ : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అదానీతో ఢిల్లీలో కుస్తీ, తెలంగాణలో దోస్తీ అన్నట్టు కాంగ్రెస్ తీరు ఉందనీ, ఆ పార్టీ వైఖరిని చూస్తే ద్వంద్వ నీతి కూడా ఆత్మహత్య చేసుకుంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అదానీకి వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి బృందం నిరసన తెలపటం అతిపెద్ద జోక్ అని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం అదానీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే అదానీకి వ్యతిరేకంగా ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. అదానీకి సంస్థలకు ప్రోత్సాహకాలు ఇచ్చి ఇప్పుడు అదే అదానీ మోసగాడని ఆరోపిస్తున్నారంటే కాంగ్రెస్‌ను ఏమనాలని ప్రశ్నించారు.



కోల్‌కతా ఘటనలో
దోషులను కఠినంగా శిక్షించాలి
సీఐటీయూ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కోల్‌కతాలో లైంగికదాడి చేసి డాక్టర్‌ను చంపేసిన ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలనీ, దేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామూహిక లైంగిక దాడి చేసి క్రూరంగా చంపేశారని పోస్ట్‌మార్టం రిపోర్టులో వెల్లడైనా ప్రభుత్వం నిందితులను కఠినంగా శిక్షించకుండా చోద్యంగా చూస్తున్నదని విమర్శించారు. దేశంలోని పీజీ డాక్టర్లు, వైద్యవిద్యార్థులు, జూనియర్ డాక్టర్లు అనుభవిస్తున్న పరిస్థితులను ఎత్తిచూపుతున్నదని తెలిపారు. పెద్దాస్పత్రుల్లో కూడా డాక్టర్లకు విశ్రాంతి గదులు లేకపోవడం దారుణమన్నారు. రోగులకు తగ్గట్టుగా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందిని ప్రభుత్వం నియమించకపోవడంతో జూనియర్ డాక్టర్లు రోజు 24 గంటలు పనిచేయాల్సి వస్తున్నదని వాపోయారు. ప్రభుత్వం మహిళా డాక్టర్లు, మహిళా ఉద్యోగుల రక్షణ కోసం ప్రత్యేకమైన చర్యలేవీ తీసుకోడం లేదని విమర్శించారు. ఆస్పత్రుల్లో పలు విభాగాల నిర్వహణతోపాటు సెక్యూరిటీ విభాగం కూడా ప్రయివేటు సంస్థలకు అప్పగించడం దారుణ మన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా డాక్టర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ బెంగాల్ ఆర్‌జికార్ హాస్పిటల్ సంఘటనను నిరసిస్తూ ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని మండల, పట్టణ, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలనీ, ఈ నిరసన కార్యక్రమాల్లో వేలాదిగా కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంఘటన జరిగిన రెండు గంటల్లోనే ప్రిన్సిపల్ రాజీనామా చేసి వెళ్ళిపోవడం, సంఘటన జరిగిన ప్రాంతాల్లో ఆధారాలు దొరకకుండా మరమ్మత్తులు చేయడం అనేక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిందితులను రక్షించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. రమ మాట్లాడుతూ మహిళా ముఖ్యమంత్రి ఉండి ఒక మహిళకు న్యాయం చేయడంలో బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఘటనా ప్రాంతానికి మృతురాలి తల్లిదండ్రులు వెళ్లకుండా మూడు గంటలు ఆపటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు జె. వెంకటేష్, భూపాల్, వంగూరు రాములు, కె. ఈశ్వర్‌రావు, ఎం. వెంకటేష్, పద్మశ్రీ, కాసు మాధవి, గోపాలస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి. సుధాకర్, ఆర్. కోటంరాజు, పి. శ్రీకాంత్, జె. కుమార్, జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జనవరి నుంచి రేషన్‌షాపుల్లో సన్న బియ్యం

- దారి తప్పితే కఠిన చర్యలు.. పట్టుబడితే డీలర్ షిప్ రద్దు
- రేషన్ డీలర్ల ఆదాయం పెంపునకు ప్రణాళికలు :మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని చౌక ధరల దుకాణాల్లో వచ్చే జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్టు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పీడీఎస్ బియ్యం దారి తప్పితే కఠిన చర్యలు తీసుకుంటా మనీ, పట్టుబడితే డీలర్‌షిప్ రద్దు చేస్తామని హెచ్చరిం చారు. రేషన్ డీలర్ల ఆదాయం పెంపునకు ప్రణాళికలు రూపొంది స్తున్నట్టు తెలిపారు. గురువారం హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి విజిలెన్స్ సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని ఈ సందర్భంగా ఉత్తమ్ హామీనిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 1,629 చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వసతి గృహాలతో పాటు అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరచు తనిఖీలు నిర్వహిస్తుంటే మార్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళా వైద్యుల్లో ఆత్మహత్యలు అధికమే

సంక్షోభంలో మానసిక ఆరోగ్యం

- ఉసురు తీస్తున్న వివక్ష, లైంగిక వేధింపులు
- తక్షణ చర్యలు, మద్దతు అవసరమంటున్న నిపుణులు



న్యూఢిల్లీ : సాధారణ ప్రజలతో పోలిస్తే వైద్య వృత్తిలో ఉన్న మహిళలే ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఓ అధ్యయనం తెలిపింది. వియన్నా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు 20 దేశాలకు సంబంధించిన సమాచారాన్ని అధ్యయనం చేశారు. దీనిని బీఎంకే జర్నల్‌లో ప్రచురించారు. మహిళా వైద్యులు ఆత్మహత్యలకు పాల్పడకుండా తోటి వైద్య సమాజం తక్షణ చర్యలు చేపట్టాలని అధ్యయనం సూచించింది.

1960 నుండి ఈ సంవత్సరం వరకూ ఆత్మహత్య చేసుకున్న మహిళా వైద్యుల సమాచారాన్ని అది విశ్లేషించింది. మొత్తంగా చూస్తే వైద్యుల్లో ఆత్మహత్యల రేటు తగ్గుతున్నప్పటికీ మహిళా వైద్య సిబ్బందిలో ఈ ముప్పు అధికంగా ఉన్నదని, సాధారణ ప్రజలతో పోలిస్తే 76 శాతం ఎక్కువగా మహిళా వైద్యులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పరిశోధకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్థలు జరిపిన 39 అధ్యయనాలను వారు విశ్లేషించారు.

సాధారణ ప్రజలతో పోలిస్తే పురుష వైద్యుల్లో ఆత్మహత్యలు పెరగనప్పటికీ అదే విధమైన సామాజిక ఆర్థిక హోదా కలిగిన ఇతర నిపుణులతో పోలిస్తే మాత్రం ఎక్కువగానే ఉన్నాయి. వైద్య సిబ్బందిలో మానసిక ఆరోగ్య సంక్షోభం కొనసాగుతోందని అధ్యయనం తెలిపింది. ముఖ్యంగా ఇటీవలి కోవిడ్ మహమ్మారి విసిరిన సవాళ్లు వారి మానసిక ఆరోగ్యంపై బాగా ప్రభావం చూపాయి. కోవిడ్ కారణంగా వైద్య సిబ్బంది నిరాశలో కూరుకు పోయారు. అనేక అవమానాలు చవిచూశారు. చివరికి పలువురు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

> విధి నిర్వహణలో మహిళా వైద్య సిబ్బందికి ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను పలు సంస్థలు వేలెత్తి చూపుతున్నాయి. మహిళా వైద్యులు మానసిక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని, వివక్ష, లైంగిక వేధింపులకు కూడా గురవుతున్నారని తెలిపాయి. తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేక చివరికి బలవన్మరణానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాయి. సాధారణ ప్రజలతో పోలిస్తే మహిళా వైద్యుల్లో ఆత్మహత్యలు 76 శాతం అధికంగా ఉన్నాయని గుర్తు చేశాయి. ఆత్మహత్యల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని, మహిళా వైద్యులకు అండగా నిలిచి వారికి మద్దతు ఇవ్వాలని సూచించాయి.

'డాక్టర్స్ ఇన్ డిస్ట్రెస్' ఏమంది?

'డాక్టర్స్ ఇన్ డిస్ట్రెస్' అనే బ్రిటన్ కు చెందిన ధార్మిక సంస్థ కూడా మహిళా వైద్యుల్లో ఆత్మహత్యల రేటు అధికంగా ఉండడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఆరోగ్య సిబ్బంది మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించి, ఆత్మహత్యలను నివారిం చేందుకు ఈ సంస్థ కృషి చేస్తోంది. మహిళా వైద్యులు ఆత్మహత్యలకు పాల్పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిం చింది. వివక్ష, లైంగిక వేధింపుల కారణంగా మహిళా వైద్యులు ఎక్కువగా ఆత్మహత్యలకు పూనుకుంటు న్నారని అంటూ దీనిపై మరింత పరిశోధన జరపాలని, మహిళా వైద్యుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టాలని కోరింది.

ఎన్‌హెచ్‌ఎస్ ప్రణాళికలు

బ్రిటన్‌లో నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్) తన సిబ్బంది ప్రణాళికలో భాగంగా వారి బాగోగులను చూడాల్సిన అవసరాన్ని గుర్తించింది. సిబ్బందికి మానసిక ఆరోగ్యాన్ని కలిగించేందుకు అనేక సేవలను అందుబాటులోకి తెచ్చింది. సాయం కోరే సిబ్బంది సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు. రాత్రింబవళ్లు అందుబాటులో ఉంటారు. వారికి అవసరమైన శిక్షణ ఇస్తారు. పని గంటల విషయంలో వెసులుబాటు కల్పిస్తారు. అయినప్పటికీ మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని ఎన్‌హెచ్‌ఎస్ గుర్తించింది. సాయం కోరడంలో సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, వారికి అవసరమైన మద్దతు లభించేలా చర్యలు చేపట్టాలని భావిస్తోంది.

ఆత్మహత్యల నివారణకు హెల్ప్‌లైన్

ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై 'సామారిటన్స్'లో పనిచేస్తున్న కతీ హార్డ్‌క్యాజిల్ ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సిబ్బందికి అవసరమైన మద్దతు అందజేయాలని, వారిని ప్రోత్సహించాలని ఆమె సూచించారు. ఆత్మహత్యల నివారణ కోసం ఏర్పాటు చేసిన సామారిటన్స్ అనే హెల్ప్‌లైన్‌లో ఆమె సీనియర్ రిసెర్చ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

కాశ్మీర్‌లో కూటమిపై కసరత్తు

- నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ నేతల భేటీ
- అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీకి అంగీకారం

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్‌లు సూత్రప్రాయంగా నిర్ణయించాయి. ఈ దిశగా నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి ఏర్పాటుపై ఇరు పార్టీల మధ్య చర్చలు జరుగుతున్నాయని సంకేతాలు వస్తున్నాయి. ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారు, భావసారూప్యత కలిగిన పార్టీలను కలుపుకుని వెళ్లడం వంటి అంశాలపైనా కసరత్తు సాగుతున్నది. ఇక జమ్మూ కాశ్మీర్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో జోష్ నెలకొంది. జమ్మూకాశ్మీర్ మాజీ మంత్రి, డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) నేత తాజ్ మొహియుద్దీన్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. తాను గత 45 ఏండ్లుగా కాంగ్రెస్‌లో ఉన్నానని, కానీ కొన్ని కారణాల వల్ల బయటకు వెళ్లినా ఇప్పుడు తిరిగి పార్టీలోకి వస్తున్నానని ఆయన వెల్లడించారు. గులాం నబీ ఆజాద్‌తో తనకు ఎలాంటి శత్రుత్వం లేదని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీగా తాము విజయం సాధించలేమని కుండబద్దలు కొట్టారు. ఆజాద్ సాబ్‌ను కూడా తిరిగి సొంతగూటికి (కాంగ్రెస్) తీసుకొస్తానని తెలిపారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని పార్టీ తనను ఎంతగానో గౌరవించిందని తాజ్ మొహియుద్దీన్ పేర్కొన్నారు. కాగా, జమ్మూకాశ్మీర్‌లో సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న, హర్యానాలో అక్టోబర్ 1న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని, రెండు రాష్ట్రాల్లో అక్టోబర్ 4న ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని ఈసీ వెల్లడించిన సంగతి తెలిసిందే. జమ్మూకాశ్మీర్‌లో మొదటి దశలో 24 సీట్లకు, రెండో దశలో 26 సీట్లకు, మూడో దశలో 40 సీట్లకు ఎన్నికలు జరుగుతాయి. ఇక్కడ చివరిసారిగా 2014 నవంబర్-డిసెంబర్‌లో ఐదు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

శాంతి స్థాపనకు మద్దతిస్తాం

వార్సా: ఉక్రెయిన్‌తో పాటు పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభాలు తీవ్ర ఆందోళన కరమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. యుద్ధ క్షేత్రంలో సమస్యకు పరిష్కారం లభించదన్న ఆయన.. చర్చలు, సంప్రదింపుల ద్వారా ఈ ప్రాంతాల్లో సాధ్యమైనంత త్వరగా శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు తాము మద్దతు తెలుపుతామన్నారు. పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో భేటీ అయిన తర్వాత మీడియాకు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

"ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొన సాగుతున్న యుద్ధాలు మనందరికీ తీవ్ర ఆందోళన కరం. యుద్ధక్షేత్రంలో ఏ సమస్యకు పరిష్కారం దొరకదని భారత్ బలంగా విశ్వసిస్తుంది. ఏ సంక్షోభంలోనైనా సామాన్యులు ప్రాణాలు కోల్పోవడం యావత్ మానవాళికే అతిపెద్ద సవాల్. చర్చలు, దౌత్యంతోనే శాంతి, స్థిరత్వానికి మేం మద్దతిస్తాం. ఇందుకోసం మిత్రదేశాలతో కలిసి అన్నిరకాల మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉంది" అని ప్రధాని పేర్కొన్నారు.

పోలండ్‌లో ప్రధాని మోడీ

- డొనాల్డ్ టస్క్‌తో ద్వైపాక్షికాంశాలపై చర్చ

పోలండ్ పీఎంతో భేటీ..

రెండు రోజుల పర్యటనలో భాగంగా పోలండ్ వెళ్లిన మోడీ ఆ దేశ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై చర్చించామని.. ఇరుదేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నామన్నారు. రష్యా దండయాత్ర సమయంలో భారత విద్యార్థుల తరలింపునకు పోలండ్ ఎంతో సహకరించిందని, అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. అంతకుముందు అక్కడి ప్రధానమంత్రి కార్యాలయం 'ఛాన్స్‌లరీ'లో ప్రధాని మోడీకి ఘనస్వాగతం లభించింది.



మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న హింస

- ఐద్వా జాతీయ నాయకురాలు సుధా సుందరరామన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో, రాష్ట్రంలో మహిళలపై రోజురోజుకు లౌంగిక దాడులు పెరుగుతున్నాయని ఐద్వా జాతీయ నాయకులు సుధాసుందరరామన్ అన్నారు. ఐద్వా రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఎస్ పుణ్యవతితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింసను కట్టడి చేయటంలో మోడీ ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. మరో పక్క కార్పొరేట్ అనుకూల విధానాలతో ముందుకు పోతున్నదని చెప్పారు. ఉపాధిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే బడ్జెట్ కేటాయింపుల్లో కోత పెడుతున్నారని చెప్పారు. కలకత్తాలో మెడికో విద్యార్థినిపై జరిగిన దుర్మార్గాన్ని చూస్తుంటే.. దేశంలో మహిళల భద్రత ఎంత దుస్థితిలో ఉందో తెలుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పుణ్యవతి మాట్లడుతూ దేశ వ్యాప్తంగా మహిళల భద్రతకు వారి హక్కుల రక్షణకు, ఉపాధికి విస్తృత పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. మద్యం, మత్తుపదార్థాల నిర్మూలనకు దేశ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లులక్ష్మి, ఉపాధ్యక్షులు కెఎన్‌ఆశాలత, ఎస్. రత్నమాల, ఏఎమ్. భారతి, పి ప్రభావతి, ఎస్.వినోద. పి. కలిత ఎమ్ .లక్ష్మమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

కండీషన్స్ లేని 'మాఫీ' కావాలి..

- రైతులకు ఎవరి రాజీనామాలతో పనిలేదు
- 27న రైతుసంఘాల ధర్నాకు సీపీఐ(ఎం) మద్దతు : నున్నా



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రైతులకు ఎవరి రాజీనామాలతో అవసరం లేదని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు కండీషన్స్ లేకుండా రుణమాఫీ చేస్తే చాలన్నారు. తెల్లరేషన్‌కార్డు నిబంధన ఎత్తివేయాలని, రూ.2 లక్షల పైనున్న మొత్తాన్ని చెల్లించకుండానే మాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై ఈనెల 27న రైతుసంఘాలు కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే ధర్నాకు సీపీఐ(ఎం) మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. పొలిటికల్ మైలేజ్ కోసం అధికార, ప్రధాన ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ అయినట్టు ప్రకటించి సీఎం, మంత్రులు అబద్ధాలు ఆడారన్నారు. ఆగస్టు 15 నాటికి మాఫీ పూర్తి చేస్తామని ప్రకటించిన మాట నిలబెట్టుకున్నట్టు చూపేందుకు మూడు విడతలుగా కొద్దిమందికే రూ.2లక్షల రుణమాఫీ చేశారని తెలిపారు. ఇప్పటి వరకు రూ.22వేల కోట్లు మాఫీ అయినట్టు సీఎం అబద్ధపు ప్రకటన చేశారని ఆరోపించారు. ఎస్‌ఎల్‌బీసీ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి ఇప్పటి వరకు రూ.7,500 కోట్లు మాత్రమే జమైనట్టు ప్రకటన చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఎస్ఎల్బీసీ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 45 లక్షల మంది రైతులున్నారని, వీరికి రూ.49వేల కోట్లు మాఫీ చేయాలన్నారు. అయితే, ప్రభుత్వం రూ.31వేల కోట్లు మాత్రమే తేల్చిందన్నారు. అది కూడా పూర్తి చేయలేదన్నారు. రాష్ట్రంలోని 40 బ్యాంకుల్లో 5,742 బ్రాంచీల్లో 41,78,892 మంది రైతులు అప్పులు తీసుకున్నారని తెలిపారు. మాఫీ పూర్తిస్థాయిలో కాకపోవడానికి ప్రభుత్వం 31 రకాల సమస్యలు అడ్డువచ్చినట్లు సాకు చెబుతోందన్నారు. వీటిలో ప్రధాన సమస్య తెల్ల రేషన్‌కార్డని అన్నారు. ఈ నిబంధనను ఎత్తివేయాలన్నారు. రూ.2 లక్షల పైనున్న నగదును చెల్లించమనే కండీషన్ కూడా ఎత్తివేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 40% మందికే రుణమాఫీ చేశారన్నారు.

గత ప్రభుత్వ మాఫీలు వడ్డీకే సరి..

గత ప్రభుత్వం రెండు విడతలుగా రూ.35,240 కోట్ల రుణమాఫీ చేసినా దానిలో రూ.21,800 కోట్లు వడ్డీల కిందనే జమ చేసినట్టు నున్నా వివరించారు. ప్రభుత్వం ఆలస్యంగా నిధులు జమ చేయడం వల్ల రైతులు లబ్ధి పొందలేకపోతున్నారన్నారు.

అర్హులైన వారు రుణమాఫీ కోసం మండల, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేయండి

తెలంగాణ రైతు సంఘం పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అర్హులైన రైతులందరికీ రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. అందుకు నిరసనగా ఈ నెల 23న మండల కేంద్రాల్లో, 27 నుంచి జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. దానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి టి సాగర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, నాయకులు బి. వెంకటచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ రైతు రుణమాఫీ పథకం అమలు కాక రైతులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు జరిపిన మాఫీ వల్ల నేటికి 50 శాతం మంది రైతులకే వర్తించిందన్నారు. రుణమాఫీ కోసం బ్యాంకులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. అనేక జిల్లాల్లో ఆధార్, రేషన్ కార్డును గమనంలోకి తీసుకుని రుణమాఫీ చేసినట్టు మంత్రులు ప్రకటించారన్నారు. అయితే అర్హతలున్న వారికి కూడా వర్తింపజేయలేదని చెప్పారు. అనేక ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వం రుణమాఫీని ప్రకటించిందని చెప్పారు. రైతులలో పెరుగుతున్న అశాంతిని నివారించేందుకు తక్షణమే రుణమాఫీ పథకాన్ని అర్హులైన రైతులకు అమలు చేయాలని కోరారు. అర్హులకు రుణమాఫీని వర్తించే వరకు రైతులు సంఘటితంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అదే సందర్భంలో ప్రభుత్వానికి దరఖాస్తులు, రుణగ్రస్తుల జాబితా కూడా ఇవ్వాలని సూచించారు. రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులను పరిగణనలోకి తీసుకోరాదనీ, రుణమాఫీ జరిగిన వారికి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీజేపీకి గుణపాఠం తప్పదు

సెబీ, అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలి

- వైద్య సంస్థల్లో వైద్యులు, సిబ్బంది భద్రత, రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలి : సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి. రాజా
- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి : ఎమ్మెల్యే కూనంనేని
- హన్మకొండలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు



నవతెలంగాణ-హన్మకొండ చౌరస్తా

లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా సీట్లు సాధించి అధికారంలోకి వస్తామని డాంభికాలు పలికిన బీజేపీని ప్రజలు సగం సీట్లకు తగ్గించి తగిన గుణపాఠం చెప్పారని, త్వరలో జరగనున్న హర్యానా, జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి. రాజా అన్నారు. హన్మకొండ జిల్లాలో మూడు రోజుల పాటు జరగనున్న సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొనేందుకు గురువారం ఆయన హన్మకొండకు వచ్చారు. ఈ సందర్భంగా హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజా మాట్లాడారు.

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ ఈ ప్రభుత్వం ఎంత కాలం ఉంటుందనేది ప్రశ్నార్థకమేనని అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన చంద్రబాబు నాయుడు, నితీష్‌కుమార్ వారి వెంట ఎంత కాలం ఉంటారో కూడా తెలియదని అన్నారు. దేశంలో తీవ్రమైన సంక్షోభ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని, రాజ్యాంగాన్ని విస్మరిస్తూ ఉద్యోగ నియామకాల్లో లేటరల్ ఎంట్రీ పేరుతో బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులను బ్యూరోక్రసీలో చొప్పించేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఇందుకు వ్యతిరేకంగా రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య శక్తులన్నీ కలిసి ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాజ్యాంగం స్థానంలో కొత్త మతతత్వ రాజ్యాంగం తేవాలని బీజేపీ ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానం పెద్ద వైఫల్యమని, అక్కడ ఎన్‌కౌంటర్లు, దాడులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పట్ల విధేయత చాటుకున్నదని, ప్రజల తక్షణ సమస్యల గురించి పట్టించుకోలేదని ఆరోపించారు.

అదానీ సంస్థలో భాగస్వామ్యం కలిగిన సెబీ చైర్‌పర్సన్‌ను ఆ పదవి నుంచి తప్పుకోవాలని ప్రధాని మోడీ ఎందుకు కోరడం లేదని, ఈ మొత్తం వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేసేందుకు ప్రధాని ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటన అత్యంత దారుణమైన నేరమని, దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికైనా మోడీ మౌనం వీడి.. ఆస్పత్రులు, వైద్య సంస్థల్లో వైద్యులు, సిబ్బంది భద్రత, రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రజా సమస్యలపై, రాజకీయ అంశాలపై కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్య పార్టీలతో చర్చించి ముందుకు వెళ్ళాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేసిన సీపీఐ ఒక ఎమ్మెల్యే స్థానం గెలుచుకుందని, రెండు ఎమ్మెల్సీలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇంకా అధికారికంగా ప్రకటించలేదన్నారు. ప్రభుత్వ ఏర్పాటు సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన అనేక హామీలు అమలు చేయాలని కోరారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నదని, నేటికీ గత ప్రభుత్వం సృష్టించిన సంక్షోభాల నుంచి బయట పడలేకపోతున్నదని అన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, బీజేపీ రాకూడదని, కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండాలని తాము కోరుకుంటున్నామని అన్నారు.

సీపీఐని ఒక పోరాట పార్టీగా నిలబెట్టేందుకు హన్మకొండలో రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సెప్టెంబర్ 11 నుంచి 19 వరకు తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె నారాయణ, మాజీ ఎంపీ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, పశ్య పద్మ, బాగం హేమంత రావు, బాలమల్లేష్, కలవేణ శంకర్, బాల నర్సింహ, ఈటీ నర్సింహ, వీఎస్ బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. విజయ సారథి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పాల్గొన్నారు.

'తమిళగ వెట్రి కళగం' కొత్త జెండా

- ఆవిష్కరించిన తమిళనటుడు విజయ్



చెన్నై: ప్రముఖ తమిళ కథానాయకుడు విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. 'తమిళగ వెట్రి కళగం ' పేరుతో ఈ ఏడాది ఆయన కొత్తపార్టీ ఏర్పాటుచేశారు. తాజాగా ఆ పార్టీకి సంబంధించి జెండాను కూడా ఆవిష్కరించారు. చెన్నైలో తన పార్టీ కార్యాలయంలో విజయ్ ఈ జెండాను ఎగురవేశారు. ఎరుపు, పసుపు రంగుల్లో ఉన్న ఈ జెండాపై మధ్యలో వాగాయి పువ్వుకు రెండు ఏనుగులు అటూ, ఇటూ ఉన్నాయి. తమిళ సంప్రదాయం ప్రకారం ఈ పువ్వును విజయానికి గుర్తుగా అభివర్ణిస్తారు. జెండాతో పాటు పార్టీ గీతాన్ని కూడా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తల్లిదండ్రులతో పాటు మద్దతుదారులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి విజయ్ ప్రతిజ్ఞ చేశారు. "మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన యోధులను, తమిళ నేల నుంచి వెళ్లి మన హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన అసంఖ్యాక సైనికులను ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. కులం, మతం, లింగం, ప్రాంతం పేరుతో జరుగుతున్న వివక్షను మేం తొలగిస్తాం. ప్రజలకు అవగాహన కల్పించి అందరికీ సమానహక్కులు, అవకాశాల కోసం కృషి చేస్తాం. సమానత్వం అనే సూత్రాన్ని బలంగా సమర్థిస్తాం" అని విజయ్ ప్రతినబూనారు. మరో రెండేండ్లలో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ పరిణామాలు కీలకంగా మారాయి.

ఈ ఏడాది ఫిబ్రవరిలో విజయ్ రాజకీయ పార్టీని ప్రారంభించారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోనని ముందే స్పష్టం చేసిన ఆయన.. ఇతర పార్టీలకు కూడా మద్దతు ఇవ్వలేదు. 2026లో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బరిలోకి దిగుతామన్న విజయ్.. తాజాగా పార్టీ జెండా, ఎజెండాను ఆవిష్కరించారు. అయితే, వచ్చే ఎన్నికల్లో ఆయన ఒంటరిగా పోటీ చేస్తారా? లేదా పొత్తులకు ముందుకొస్తారా? అనేది ఇంకా స్పష్టత రాలేదు.

సంపాదకీయం

చైనా-ఐరోపా వాణిజ్య పోరు!



డోనాల్డ్ ట్రంప్ గత ఏలుబడిలో చైనా మీద ప్రారంభించిన వాణిజ్య యుద్ధం కొనసాగుతుండగానే మరోసారి ఎన్నికలు వచ్చాయి. ఒక వేళ ట్రంప్ గెలిస్తే అనే భయం అమెరికాలో మొదలైంది.దానికి ఇంకా వ్యవధి ఉంది. ఈ లోగా ఐరోపా యూనియన్ మరోవాణిజ్య పోరుకు తెరలేపింది. చైనా నుంచి దిగుమతి అవుతున్న విద్యుత్ వాహనాలపై దిగుమతి పన్ను మొత్తాన్ని పదిశాతంగా ప్రస్తుతం ఉన్నదాన్ని గరిష్టంగా 36శాతానికి పెంచి త్వరలో అమలు చేయనుంది. 'మీ పని ఇట్లా ఉందా మా తడాఖా చూడండి' అంటూ ఐరోపా నుంచి దిగుమతి చేసుకుంటున్న జున్ను, ఇతర పాల ఉత్పత్తులు, మద్యంపై ప్రతికూల చర్యలు తీసుకొనేందుకు చైనా కూడా సమరశంఖం పూరించింది. తెగేదాకా లాగితే వాణిజ్యపోరు మరిన్ని వస్తువులకు విస్తరించటం ఖాయం. 2018 నుంచి 2023వరకు వివరాలను చూస్తే జర్మనీ, అమెరికా, జపాన్, ఫ్రాన్స్, దక్షిణ కొరియాలు అన్నీ కలసి చేసిన విద్యుత్ వాహనాల ఉత్పత్తి కంటే చైనా (పదమూడు మిలియన్లు) ఎక్కువగా చేసింది. దిగుమతులతో ఈ దేశాల్లో ఉన్న వినియోగదారులు ఎంతో లబ్దిపొందుతున్న ప్పటికీ స్థానిక కంపెనీలు పోటీలో నిలవలేకపోవటంతో వాటి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వాలు రంగంలోకి దిగాయి. పెట్రోలు, డీజిల్‌తో నడిచే వాహనాలను విద్యుత్ వాహనాలను కనుమరుగుచేసే విధంగా మార్కెట్ పెరుగుతున్నది.చైనా ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీల కారణంగా తమ సంస్థలు దెబ్బతినటమేగాక కార్మికులకు ఉపాధి కూడా పోతున్నదని అమెరికా, ఐరోపా దేశాలు గగ్గోలు పెడుతున్నాయి.

దిగుమతి పన్ను, సబ్సిడీల గురించి చైనా-ఐరోపా యూనియన్ మధ్య జరిగిన సంప్రదింపులు విఫలం కావటంతో ఎవరికి వారు రక్షణాత్మక చర్యలు చేపడుతున్నారు. గతంలో విధించిన దిగుమతి పన్నుల కారణంగా చైనాకంటే ఎక్కువగా అమెరికా వినియోగదారుల మీదనే భారం ఎక్కువగా పడినట్లు తేలింది. అందువలన పక్కనే ఉన్న మెక్సికోలో చైనా కంపెనీలు ఉత్పత్తులను ప్రారంభించి ఎగుమతులు చేస్తూ దిగుమతి పన్ను తప్పించుకుంటున్నాయి. దీంతో మెక్సికోతో ఉన్న ఒప్పందం గురించి అమెరికా పునరాలోచనలో పడింది. స్థానికంగా ఉత్పత్తి గురించి కేంద్రీకరిస్తున్నప్పటికీ కార్పొరేట్ సంస్థలు ఎక్కడ చౌకగా శ్రామికశక్తి దొరికితే అక్కడికే వెళుతున్నాయి తప్ప అమెరికాలో ఏర్పాటు చేయటం లేదు. ఐరోపాలో కూడా అదే స్థితి. కాలుష్య నిబంధనలు కఠినతరంగా ఉండటం మరొక కారణం. ఐరోపా ఎగుమతి చేస్తున్న జున్ను, ఇతర పాల ఉత్పత్తుల్లో చైనా వాటా పన్నెండుశాతం ఉంది. విద్యుత్ వాహనాలకు ప్రతిగా అది ప్రతికూల చర్యలకు దిగితే తమ పరిస్థితి ఏమిటని ఆ కంపెనీలు, దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ కారణంగానే ఐరోపా సమాఖ్యలో చైనాతో వాణిజ్య పోరుకు ఏకీభావం కూడా లేదు. కొద్ది నెలల క్రితం జరిగిన ఓటింగ్‌లో దిగుమతి పన్నుల పెంపుదలను పన్నెండు దేశాలు సమర్థించగా నాలుగు వ్యతిరేకించాయి, పదకొండు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఈ పూర్వరంగంలో ఇప్పుడు పన్నుల పెంపుదల గురించి ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ దాని అమలు అనేక ప్రశ్నలను ముందుకు తెస్తున్నది.ప్రాథమికంగా ఒక కారుధర 30వేల యూరోలుంటే ఇప్పుడు పదిశాతం(మూడువేల యూరోలు)గా ఉన్న దిగుమతి పన్ను సగటున 30శాతానికి పెరిగితే పదివేల యూరోలు భారం పడుతుంది.

ఐరోపాలో ఇప్పుడిది ఒక చర్చగా మారితే అమెరికాలో మరొకటి మొదలైంది. ఒకవేళ అధ్యక్షుడిగా ట్రంప్ గెలిస్తే మరింతగా వాణిజ్యపోరు విస్తరిస్తుందనే భయం నెలకొన్నది.వస్తున్న వార్తల ప్రకారం పరిస్థితి ఎటుబోయి ఎలా ఉంటుందో తెలియదు గనుక ఎన్నికలకు ముందే భారీ ఎత్తున చైనా నుంచి విడిభాగాలు, వస్తువుల దిగుమతికి పూనుకున్నారు. వాటి మీద ఆధారపడిన పరిశ్రమల విస్తరణ నిర్ణయాలను వాయిదా వేస్తున్నారు.

గాల్వన్ లోయ ఉదంతాల తరువాత మన దేశం ప్రత్యేకంగా పేరు పెట్టకుండానే భూ సరిహద్దు ఉన్న దేశాల నుంచి వచ్చే పెట్టుబడుల మీద అనేక ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే.తాజాగా వెలువడిన వార్తలను బట్టి ఎలక్ట్రానిక్, విద్యుత్ వాహనాల రంగంలో నేరుగా లేదా పరోక్షంగా చైనా కంపెనీల పెట్టుబడులను అనుమతించాలని, వాటితో ఒప్పందాలకు ఆమోద ముద్ర వేయాలని మనదేశంలోని కార్పొరేట్లు ప్రధాని నరేంద్రమోడీ మీద తెస్తున్నట్లు, దానికి అంగీకరించినట్లు చెబుతున్నారు. అదే జరిగితే మనదేశాన్ని చైనా వాహనాలు ముంచెత్తటం ఖాయంగా కనిపిస్తోంది.ఐరోపా, అమెరికాలో ఇప్పటికే ఆ పరిస్థితి ఏర్పడిన కారణంగా అక్కడి ప్రభుత్వాలు చైనాతో వాణిజ్యపోరుకు దిగాయి.

తాజాగా వెలువడిన వార్తలను బట్టి ఎలక్ట్రానిక్, విద్యుత్ వాహనాల రంగంలో నేరుగా లేదా పరోక్షంగా చైనా కంపెనీల పెట్టుబడులను అనుమతించాలని, వాటితో ఒప్పందాలకు ఆమోద ముద్ర వేయాలని మనదేశంలోని కార్పొరేట్లు ప్రధాని నరేంద్రమోడీ మీద తెస్తున్నట్లు, దానికి అంగీకరించినట్లు చెబుతున్నారు. అదే జరిగితే మనదేశాన్ని చైనా వాహనాలు ముంచెత్తటం ఖాయంగా కనిపిస్తోంది.ఐరోపా, అమెరికాలో ఇప్పటికే ఆ పరిస్థితి ఏర్పడిన కారణంగా అక్కడి ప్రభుత్వాలు చైనాతో వాణిజ్యపోరుకు దిగాయి.

త్రిపురలో ఎన్నికల తీరిదీ!

దేశంలో ప్రజాస్వామ్యానికి ఎంత దుర్గతి పట్టిందో.. త్రిపురలో జరిగిన మూడెంచల స్థానిక సంస్థల ఎన్నికలు విదితం చేస్తున్నాయి. 2019 నాటి మూడంచెల స్థానిక సంస్థల ఎన్నికలకూ, ఐదేండ్ల తరువాత జరిగిన ప్రస్తుత ఎన్నికలు ఏమాత్రం తీసిపోలేదు. అప్పుడూ ఇప్పుడూ అవే దుర్మార్గాలూ, దౌర్జన్యాలూ, కిడ్నాప్‌లూ, హత్యలూ బీజేపీ ఏలు బడిలో నిత్యకృత్యమయ్యాయి. పోటీలో గెలుపోట ముల సంగతి అలా ఉంచుదాం. ప్రత్యర్థి పార్టీల వారిని నామినేషన్లనే వెయ్యనివ్వని ప్రజాస్వామ్య వ్యతిరేక దుష్ట సంస్కృతి త్రిపురలో 2019 ఎన్నికల నుంచి రాజ్యమేలుతోంది. ఈ ఆగస్టు 8న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఇప్పుడు వెల్లడవు తున్నాయి. త్రిపురలో 606 గ్రామ పంచాయతీలకు (మొదటి అంచెకు) సంబంధించి 6,370 సీట్లుండగా, నామినేషన్ల పరిశీలనానంతరం మూడో వంతు సీట్లలోనే ప్రత్యర్థి పార్టీలు పోటీ పడుతున్నా యని సుస్పష్టమైంది. అంటే నామినేషన్ల పరిశీలన పూర్తయ్యేటప్పటికి 6,370 స్థానాలకుగాను 4,349 స్థానాల్లో బీజేపీ మినహా ఏ పార్టీ కూడా నామినేషన్ వేయలేక పోయింది. కాషాయమూకలు బరితెగించి ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకు న్నాయి. వెనక్కి తిరిగివెళ్లని వారిని గాయపరిచారు. పొడిచి చంపారు. ఈ ఎన్నికల్లో జిల్లా పరిషత్ స్థానానికి అభ్యర్థిగా పోటీ చేసిన సీపీఐ(ఎం) నాయకుణ్ణి పోలీసుల ఎదుటే హత్య చేశారు.

పోలీసుల ఎదుట నామినేషన్లు వేయాల్సిన దుస్థితి నెలకొంది. దాడులు, దౌర్జనాలు, నరమేధం సాగిస్తున్న బీజేపీపై వామపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు



చేయగా..నామినేషన్లను ఆ యా పంచాయతీల్లో కాకుండా పోలీసుల సమక్షంలో వేయాలని ప్రకటించింది. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తున్న పోలీసుల సమక్షంలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ మరింత హాస్యాస్పద మైంది. వేలాది స్థానాల్లో నామినేషన్లు వేయడానికి వెళ్లిన వామపక్షాల నాయకుల్ని అధికార పార్టీ మూకలు వెంటాడి దాడులు చేస్తుంటే పోలీసులు ఎక్కడా నిలువరించలేక పోయారు. పైగా నామి నేషన్లు వేయడానికి వస్తున్న వారిని తరిమి కొట్టారు. అందువల్లనే నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మూడింట రెండొంతుల సీట్లు బీజేపీ ఖాతాలోకి చేరిపోయాయి. ప్రతిపక్ష పార్టీలైన సీపీఐ(ఎం), సీపీఐ తదితర వామపక్ష పార్టీల, కాంగ్రెస్ అభ్యర్థులను పోలీసుల ఎదుట నామినేషన్లు వెయ్యనివ్వని కారణంగానే బీజేపీ మూడింట రెండొంతుల సీట్లు ఏకగ్రీవమయ్యాయి. ఇక మిగిలిన 2,021 (మూడోవంతు) స్థానాలకే ఎన్నికలు జరిగాయి. ఈ అననుకూల పరిస్థితుల్లో సీపీఐ(ఎం), తదితర వామపక్షాల వారు దాడులు భరిస్తూనే, నెత్తురోడు తూనే వెళ్లి కొన్నిచోట్ల నామినేషన్లు వేయగలిగారు. ఆ ఎన్నికల ఫలితాలు మొన్న ప్రకటించారు. వాటిలో బీజేపీకి 1,598, సీపీఐ(ఎం)కు 150, కాంగ్రెస్‌కు 146, తిప్ర మోతా పార్టీకి 102 స్థానాలు వచ్చాయి. ఏకగ్రీవాలతో కలిపి బీజేపీకి 5,945 సీట్లు వచ్చాయి.

రెండో అంచె అయిన 35 పంచాయతీ సమితులకు సంబంధించి 423 స్థానాలకు బీజేపీ ఒక్క పార్టీయే అన్నింటికీ నామినేషన్లు వేసింది. ఇందులో సగం సీట్లలో ప్రతిపక్షాలను నామినేషన్లు వేయనివ్వలేదు. నామినేషన్ల ఉపసంహరణల అనంతరం 190 స్థానాలు బీజేపీ ఖాతాలో పడిపోయాయి (ఏకగ్రీవాలయ్యాయి). మిగతా 233 స్థానాలకు ఎన్నికల జరిగాయి. ఈ ఎన్నికల్లో బీజేపీకి 205, కాంగ్రెస్‌కు 8, సీపీఐ(ఎం) 7 స్థానాలు లభించాయి. ఏకగ్రీవాలతో కలిపి బీజేపీకి 405 స్థానాలు వచ్చాయి. మూడో అంచె అయిన 8 జిల్లా పరిషత్తులకు సంబంధించిన 116 స్థానాల్లో 114 స్థానాలకే ఎన్నికలు జరిగాయి. రెండు స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలిచారు. మిగతా 114 స్థానాల్లో నామినేషన్లు వేయకుండా బీజేపీ చేసిన ప్రయత్నం విఫలం కావడానికి కారణం సీపీఐ(ఎం) అభ్యర్థి హత్యకు గురవ్వడమే. తమ మూకలు చేసిన ఈ హత్యతో బీజేపీ వెనుకంజ వేసింది. దానివల్ల ఈ అంచె ఎన్నికలకు ప్రతిపక్షాలు పోటీ చేయడానికి పెద్దగా అడ్డంకులు ఏర్పడలేదు. అయినా ఎన్నికల ప్రచారాలు చేసుకోనివ్వ లేదు. వామపక్షాల కార్యకర్తలను పోలీసులు చెల్లాచెదురు చేశారు. ఎన్నికలను బూటకం చేశారు. ఎన్నికలు జరిగిన 114 స్థానాలకు గాను బీజేపీకి 101, కాంగ్రెస్‌కు 2, సీపీఐ(ఎం)కు 1 వచ్చాయి. ఏకగ్రీవాలతో కలిపి బీజేపీకి మొత్తం 113 స్థానాలు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అత్తెసరు మెజారిటీతో (రెండుసీట్ల ఆధిక్యంతో) విజయం సాధించిన బీజేపీ... తన అడుగుజారిందని గుర్తించింది. దీంతో 2019 నాటి పంచాయతీ ఎన్నికల అక్రమాల ఆయు ధాన్ని భుజాన వేసుకుంది. అప్పుడు మూడంచెల స్థానిక ఎన్నికల్లో 95 శాతం స్థానాలను బీజేపీ ఏకగ్రీవం చేసుకుంది. మిగతా 5 శాతం ఇండిపెం డెంట్లకు, చిన్నా చితకా పార్టీలకు వచ్చాయి. ఎన్నికల అక్రమాలకు నిరసనగా ప్రతిపక్షాలు ఎన్నికల బరి నుంచి తప్పుకున్నా యి. అధికార పార్టీ మూకలు, గూండాలకు వత్తాసుగా ప్రభుత్వ అధికార యంత్రాం గం, పోలీసులు కూడా ఉండటంతో అధికార పార్టీకి ఆయాచితంగా సీట్లు వచ్చి పడిపోతున్నాయి. ఇలాంటి వ్యవహారంలో ఆరితేరి న పార్టీ బీజేపీ.. దీన్ని మనం ప్రజాస్వామ్యమని ఎలా అనగలం?

-ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

జీవిత సమస్యల్లోంచి బయటపడటం ఎలా?



డాక్టర్ దేవరాజు మహారాజు

"జ్ఞానాన్ని అందించే మాటలు ఆభరణాలకంటే గొప్పవి" బేగం హజరత్ మహల్ (బ్రిటీష్ ఇండియా కంపనీపై తిరుగుబాటు చేసిన అవధ్ రాణి)

జీవితం గురించి సహజంగా అందరికీ కొన్ని ప్రశ్నలుంటాయి. వాటికి సమాధానాలు మనకు మనమే వెతుక్కోవాలి. బుద్ధుడి దగ్గరి నుండి తర్వాత వచ్చిన తాత్త్వికులు, ఆలోచనాపరులు, మేధావులు చెప్పిన విషయాల్లోంచి మనం కొన్ని కొన్ని విషయాలు సంగ్రహించుకోవాలి. మనకు మనం స్పష్టంగా అర్థం కావాలంటే ఈ పనిచేయక తప్పదు. కొన్ని ప్రశ్నలు వాటి సమాధానాలు ఇలా ఉంటాయి. వాటిని మనకు మనమే విశ్లేషించుకుని జీర్ణించుకోవాలి!

ప్రశ్న: దేనికీ అస్సలు సమయం దొరకడం లేదు. రోజులు ఎందుకింత తీరిక లేకుండా గడుస్తున్నాయ్?

జవాబు: ఒక ధ్యేయమంటూ లేని కార్యక్రమాలతో తీరిక దొరకదు. నువ్వు సాధించాల్సిన ధ్యేయం మీద మనసు పెడితే సమయం దొరుకుతుంది!

ప్రశ్న: జీవితం ఎందుకింత సంక్లిష్టమైపోతోంది?

జవాబు: జీవితంలోని ప్రతి విషయాన్ని మనసు మీదికి తీసుకుని అతిగా ఆలోచించి, కంగారు పడకు హాయిగా, సాఫీగా జీవించడం నేర్చుకో!

ప్రశ్న: జీవితం ఎందుకింత బాధతో దు:ఖంతో సంతోషమనేది లేకుండా గడిచిపోతూ ఉంది?

జవాబు: మదనపడడం, ఆందోళన పడడం, అతిగా స్పందించడం అలవాటైపోయినప్పుడు-సంతోషం సహజంగా దూరమై, బాధ మాత్రమే మిగులుతుంది.

ప్రశ్న: మంచి వాళ్లకే ఎందుకు ఎక్కువ బాధలు ఉంటాయ్?

జవాబు: సాన పెట్టనిదే వజ్రం మెరవదు. నిప్పులో కరిగించనిదే బంగారానికి వన్నె పెరగదు-కావల్సిన ఆకారం రాదు! మంచివాళ్ళకు బాధలూ, అనుభవాలూ తప్పవు. వాటిని ఎదుర్కుని నిలబడినప్పుడే వారి జీవితం సుఖమయమవుతుంది. వారి జీవితం విలువైనదవుతుంది. అయితే అది, మనం అర్థం చేసుకోవడంలో ఉంటుంది.

ప్రశ్న: అంటే-అలాంటి అనుభవాల వల్ల, బాధల వల్ల ఉపయోగం ఉంటుందా?

జవాబు: అనుభవం ఒక క్రమశిక్షణ గల ఉపాధ్యాయుడి వంటిది. అయితే ఇక్కడ పాఠం చెప్పి, పరీక్ష పెట్ట డం ఉండదు. ఈ అనుభవం ముందు పరీక్ష పెట్టి ఆ తర్వాతే పాఠం చెబుతుంది. దానికి మనం సిద్ధపడి ఉండాలి!

ప్రశ్న: సమస్యలన్నీ చుట్టుముట్టినపుడు, అసలు మన జీవితం ఎటుపోతోందన్న ప్రశ్న మొదలవుతుంది. అప్పుడు ఏం చేయాలీ?

జవాబు: చాలామంది బాహ్య ప్రపంచంలోకి చూసి బెంబేలు పడుతుంటారు. కండ్లకు బాహ్య ప్రపంచాన్ని చూడగలిగే దృష్టి ఉంటుంది. కాని, హృదయానికి లేదా మనసుకు-అంతర్లోకాలను దర్శించగలిగే జ్ఞానం ఉంటుంది. ఎటుపోవాలి? ఏం చేయాలి? అనే దానికి, అది దారి చూపుతుంది. కండ్లచూపు పరిమితం. మనసు చూపు అపరిమితం.

ప్రశ్న: అపజయం మనిషి విచక్షణా జ్ఞానాన్ని దెబ్బతీసి, సరైన దారిలో పోకుండా అడ్డుకుంటుందా?

జవాబు: నీ విజయం-అనేది ఇతరులు నిర్ణయిస్తారు. నీకు సంతృప్తి కలిగిందా? లేదా అనేది మాత్రం నీకు నువ్వే నిర్ణయించుకునేది. ఇతరుల నిర్ణయానికి విలువనిచ్చి నీలో నువ్వే అహంకారం పెంచుకుంటే, నువ్వు దారి తప్పి పోయే ప్రమాదం ఉంది. అదే నీ సంతృప్తికి ప్రాధాన్యత ఇచ్చినపుడు అది నిన్ను సరైన మార్గంలో నడిపిస్తుంది. నీకు సంతృప్తినిచ్చే విజయం కోసం తపిస్తూ ఉండు. అంతే! అప్పుడు అపజయమైనా నీ విచక్షణా జ్ఞానాన్ని దెబ్బతీయదు.

ప్రశ్న: గడ్డుకాలంలో సైతం చైతన్యవంతంగా ముందుకుపోవడం, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా ఉండడం సాధ్యమా?

జవాబు: సాధ్యమే! సాధించింది చూసుకుని సంతృప్తిగా ధైర్యంగా నిలబడడం అవసరం. అంతేగాని, ఇతరులతో పోల్చుకుని, ఇంకా ఇంకా ఏమో చేయలేకపోయామనే అసంతృప్తిని పెంచుకుంటే సాధించిన దానికి కూడా విలువలేకుండా పోతుంది. ముందుకు పోవాలన్న ఆశ ఉండాలి! సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తూనే ఉండాలి!! అంతేగాని, అత్యాశతో, అసహనంతో శక్తికి మించిన ప్రణాళికలు వేసుకుని, అభాసుపాలు కాకూడదు. ప్రతి ఒక్కరికి కొన్ని సాధ్యాసాధ్యాలుంటాయి. అలాగే, మన ప్రమేయం లేకుండానే రాజకీయం, ఆర్థిక, సామాజికపరమైన అడ్డంకులు ఎదురౌతూ ఉంటాయి. వాటన్నింటికీ ఎదుర్కొంటూ సాధించింది ఏదైనా ఉంటే దాన్ని తక్కువచేసి తీసిపారేసుకో గూడదు. మనం జీవిస్తున్న సమాజ ప్రభావం మన జీవితాలపై తప్పకుండా ఉంటుందన్న వాస్తవాన్ని జీర్ణించు కోవడం మంచిది.

ప్రశ్న: ఈ సమస్యలన్నీ, ఈతి బాధలన్నీ తమకే ఎందుకూ? అని కొందరు బాధపడుతుంటారు కదా? అలా ఎందుకూ?

జవాబు: నిజమే! ఈ సమస్యలన్నీ తమకే ఎందుకూ! అని అనుకునే వారు ఒక విషయం ఆలోచించరు.వారు సఖసంతోషాలతో సంతోషకరమైన జీవితం గడుపుతున్నప్పుడు మాత్రం ఇంత మంచి జీవితం తమకే ఎందుకు లభించిందీ-అని ఏ మాత్రం ఆలోచించడం తమను తాము ప్రశ్నించుకోరు.అదే మానవ ప్రవృత్తి! ప్రతి దానికీ కారణ ముంది. ఆ కారణాన్ని అర్థం చేసుకుంటే వేదనలు సంవేదనలు ఉండవు.

ప్రశ్న: జీవితాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దుకోవడం ఎలా?

జవాబు: గడిచిన జీవితం పట్ల విచారించవద్దు. సమకాలీన జీవితాన్ని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి, భవిష్యత్ జీవితం గడపడానికి, భయపడకుండా సిద్ధపడాలి అంతే!! జీవించడం ఎలాగో తెలుపుకుంటే చాలు. జీవితం అత్యంత అద్భుతంగా ఉంటుంది. అది తెలుసుకోవడానికే ఈ ప్రపంచంలో ఎంతోమంది మహానుభావులు ప్రయ త్నిస్తూ వచ్చారు. ప్రయత్నిస్తూ ఉన్నారు కూడా, ఆత్మల మీద ధ్యాసపెట్టకుండా ఆత్మ విశ్వాసంతో నిర్భయంగా సంతృ ప్తిగా జీవించగలిగితే - ఆ జీవితమే ఉత్తమమైనది!

ప్రశ్న: జీవితంలో బంధాలు తెగిపోతే ఎలా? ఏం చేయాలీ?

జవాబు: తప్పు-బంధాలు ఎప్పుడూ తెగిపోవు! అవి కుటుంబ సంబంధాలైనా, సామాజిక సంబంధాలైనా -బంధాలు ఎప్పుడూ తెగిపోవు. మాటల్లో తెగిపోతే, కండ్లల్లో ఉండిపోతాయ్. కండ్లల్లో తెగిపోతే జ్ఞాపకాల్లో ఉండిపోతాయి. అయితే, వాటిని ఎక్కడిదాకా ఎలా నిలుపుకోవాలన్నది ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిందే - 'జిన్హే హం భూల్‌నా చాహే-ఓ అక్సర్ యాద్ ఆతేహై' - మరిచి పోవాలనుకునేవారు మళ్లీ మళ్లీ గుర్తుకొస్తుంటారు.



ప్రశ్న: జీవితం ఒక్కోసారి ఒక్కోరకంగా అర్థమవుతూ ఉంటుంది. మన జీవితం ఒక్కటే అయినప్పుడు, అది ఎప్పుడూ ఒకేలా ఉండొచ్చు కదా? వ్యత్యాసాలెందుకూ?

జవాబు: ఉండదు, ఉండదనే విషయం తెలుసుకునే మసలుకోవాలి! మానవ ప్రవృత్తి ఒక్కరకంగా ఉండదు. చుట్టూ ఉన్న పరిస్థితులూ ఒకే రకంగా ఉండవు. అందుకే మన జీవితంలో ఒక్కోసారి ఒక్కోరకంగా అనిపిస్తుంది! ఉదాహరణకు కొన్ని కొన్ని సందర్భాలు చూద్దాం.

మనం ఓ పావుగంట ఒక తాగుబోతును గమనిస్తే-,జీవితం చాలా సింపుల్ కదా? అని అనిపిస్తుంది. బాధ్యతలూ, పరిసరాలూ అన్నీ మరిచిపోయి తన లోకంలో తను ఉంటాడు. అన్నీ వదిలేస్తే ఏముంది జీవితం సులభమైపోతుంది.

- అదే మన ఉపాధ్యాయుల ముందు, గురుతుల్యుల ముందు కూర్చుంటే -మళ్లీ మనం విద్యార్థులమై పోయినట్టు అనిపిస్తుంది!
- ఒకవేళ ఎప్పుడైనా మహా శాస్త్రవేత్తల దగ్గర కూర్చుని వారి కృషిని వారి మాటల్లో వింటే - మనం ఎంత అజ్ఞానంగా బతుకుతున్నామో అర్థమౌతుంది.
- సైనికుల ముందు కూర్చుంటే - వారి త్యాగం ముందు వారు దేశానికి అందిస్తున్న సేవల ముందు మనం ఎందుకూ పనికిరామని అనిపిస్తుంది!
- రైతుల ముందు, కార్మికుల ముందు కూర్చుంటే - వారు పడుతున్న కష్టం మనం పడటం లేదే- మన కెంత సుఖవంతమైన జీవితం లభిస్తోందీ అని అనిపిస్తుంది. వారు తిండి పెట్టకపోతే, వస్తువులు తయారు చేసి ఇవ్వకపోతే, అసలు మనం ఎలా జీవించే వాళ్లం? ప్రాణం ఉంటేనే కదా జీవితముండేదీ?
- వ్యాపారుల మధ్య కూర్చుని వారి మాటలు వింటుంటే - మనం మన సంపాదన ఎంత తక్కువో అర్థమవుతుంది. మన సంపాదన దేనికీ ఎందుకు సరిపోవడం లేదో తెలిసొస్తుంది! సంపాదించడానికి ఎన్నెన్ని అవకాశాలుండి కూడా మనమేదీ చేయడం లేదేమన్న న్యూనతా భావం కలుగుతుంది.
- రాజకీయ నాయకుడి హోదా, ఆర్భాటం చూస్తే చాలు-అనవసరంగా మనం ఉన్నత విద్యనార్జించి జీవిత కాలం వృథా చేసుకున్నామే-అని అనిపిస్తుంది. ఆరో తరగతిలో చదువు మానేసినవారు రాష్ట్రాన్నీ, దేశాన్నీ పాలిస్తున్నప్పుడు అసలు చదువుకేమైనా విలువ ఉందా? అన్న అనుమానం వస్తుంది.
- జీవిత బీమా చేసే ఏజెంటు ఇంటి కొచ్చి ఆసక్తి కరమైన పాలసీలు, వాటి ద్వారా పొందబోయే పెద్ద మొత్తం డబ్బు వివరాలూ చెప్తుంటే - ఏమయితే అది అయ్యింది. తక్షణం చస్తేనే మంచిదేమో అని అనిపిస్తుంది. చస్తూ, చస్తూ బతికే కన్న కుటుంబసభ్యుల్ని బతికించడం మేలుకదా? అనిపిస్తుంది!
- ఓ పది నిముషాలు భార్య ముందు కూచుంటే- జీవితంలో దొరికిన ప్రేమ, అనురాగం గుర్తొచ్చి, కన్న పిల్లల మీద ఇంకింత బాధ్యతగా ఉండాలో కూడా పథకం వేసుకోవాలని పిస్తుంది! జీవితాన్ని స్వర్గం చేసుకోవాలని పిస్తుంది!!
- ఓ మంచి ప్రాణ స్నేహితుని ముందు కూర్చుంటే జీవితంలోని తీపి, మధురిమ ప్రశాంతంగా నవ్వుకోవడం లోని ఆనందం దొరికాయనిపిస్తుంది. అతనితో కలిసి ప్రగతి పథంలోకి దారులెలా వేయాలో ఆలోచించాలని పిస్తుంది!


జీవితమంటేనే వైవిధ్యభరితమైందని అర్థం!!

- సుప్రసిద్ధ సాహితీవేత్త,
విశ్రాంత జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

సాధించింది చూసుకుని సంతృప్తిగా ధైర్యంగా నిలబడడం అవసరం. అంతేగాని, ఇతరులతో పోల్చుకుని, ఇంకా ఇంకా ఏమో చేయలేకపోయామనే అసంతృప్తిని పెంచుకుంటే సాధించిన దానికి కూడా విలువలేకుండా పోతుంది. ముందుకు పోవాలన్న ఆశ ఉండాలి! సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తూనే ఉండాలి!! అంతేగాని, అత్యాశతో, అసహనంతో శక్తికి మించిన ప్రణాళికలు వేసుకుని, అభాసుపాలు కాకూడదు. ప్రతి ఒక్కరికి కొన్ని సాధ్యాసాధ్యాలుంటాయి. అలాగే, మన ప్రమేయం లేకుండానే రాజకీయం, ఆర్థిక, సామాజికపరమైన అడ్డంకులు ఎదురౌతూ ఉంటాయి. వాటన్నింటికీ ఎదుర్కొంటూ సాధించింది ఏదైనా ఉంటే దాన్ని తక్కువచేసి తీసిపారేసుకో గూడదు. మనం జీవిస్తున్న సమాజ ప్రభావం మన జీవితాలపై తప్పకుండా ఉంటుందన్న వాస్తవాన్ని జీర్ణించు కోవడం మంచిది.

గడిచిన జీవితం పట్ల విచారించవద్దు. సమకాలీన జీవితాన్ని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి, భవిష్యత్ జీవితం గడపడానికి, భయపడకుండా సిద్ధపడాలి అంతే!! జీవించడం ఎలాగో తెలుపుకుంటే చాలు. జీవితం అత్యంత అద్భుతంగా ఉంటుంది. అది తెలుసుకోవడానికే ఈ ప్రపంచంలో ఎంతోమంది మహానుభావులు ప్రయ త్నిస్తూ వచ్చారు. ప్రయత్నిస్తూ ఉన్నారు కూడా, ఆత్మల మీద ధ్యాసపెట్టకుండా ఆత్మ విశ్వాసంతో నిర్భయంగా సంతృ ప్తిగా జీవించగలిగితే - ఆ జీవితమే ఉత్తమమైనది!

ప్రజాస్వామ్య పథంలో జమ్మూకాశ్మీర్



కె. శాంతారావు
9959745723

జమ్మూకాశ్మీర్‌లో ప్రజాస్వామ్యం విరబూయాలని ఎవరికుండదు? మనదేశానికి మకుటాయ మానం. అతి సుందర నందన వనం. హిమోన్నత రాష్ట్రం. దశాబ్దాల తరబడి తుపాకుల హింసకు తలొగ్గుతూ రక్తమోడుతున్న ప్రాంతం. కనుకనే ఈసారి ఎన్నికలకు ఎప్పుడూ లేనంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జరుగుతున్న తొలి ఎన్నికలివి. కనుకనే ఈ ఉత్సుకత.90 స్థానాలు ఉన్న జమ్మూకాశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీకి మూడు విడతలుగా ఎన్నికలు జరగను న్నాయి. సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1 తేదీల్లో పోలింగ్ జరుగనుంది. అక్టోబరు 4 ఫలితాలు విడుదల. ఇప్పుడిక ఆ రాష్ట్ర ఓటరు ఎవరికి పట్టం కట్టనున్నాడనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఈ నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తమ పార్టీ ఎన్నికల ప్రణాళికను విడుదల చేశారు.ఆర్టికల్ 370తో పాటు, 35-ఏను కూడా పునరుద్ధరిస్తామని అందులో స్పష్టం చేశారు. నిరంకుశంగా రూపొందించిన 'ప్రజాభద్రత చట్టాన్ని' రద్దు చేస్తామని, అలాగే రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేస్తామని తెలిపారు. అంతేకాకుండా జమ్మూ-కాశ్మీర్ విషయంలో భారత్-పాకిస్థాన్ మధ్య నిలిచిపోయిన చర్చల పునరుద్ధరణకు సహకరిస్తామని కూడా చెప్పారు. ఇక ఏడాదికి 12 గ్యాస్ సిలిండర్‌లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ చర్యలు సరేసరి. వీటన్నిటితో పాటు కాశ్మీర్ పండిట్లకు పూర్వవైభవం, పాస్‌పోర్ట్ సౌకర్యం సులభతరం. యువతకు పెద్దఎత్తున ఉద్యోగ కల్పన అంశాలు ప్రకటించడం అందరినీ ఆకర్షిస్తున్నాయి.

కాగా మరోవైపు పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ తొలిసారిగా ఈ ఎన్నికల బరిలో దిగుతున్నది. అనంతనాగ్‌లోని బిజ్‌బెహారా నియోజక వర్గం నుంచి ఆమె పోటీకి సిద్ధమవుతున్నది. ఇప్పటివరకు ఆమె తన తల్లి మెహబూబా ముఫ్తీకి మీడియా ప్రధాన సలహాదారు. 2019 ఆగస్టు 5వ తేదీ ఆర్టికల్ 370 రద్దు తర్వాత ముఫ్తీని నిర్బంధించడంతో ఇల్తీజా రాజకీయరంగ ప్రవేశం చేసింది. యువతకు, మహిళా లోకానికి ఆమె ఓ పెద్ద ఆకర్షణ. జమ్మూ కాశ్మీర్ లోని చాలామంది ముఖ్య నాయకులు నిర్బంధంలో ఉన్న విషయం తెలిసిందే. టెలివిజన్ చర్చల్లో ఆమె పాల్గొనే తీరు, విన్పించే గొంతుకకు గొప్ప ప్రజాదరణ ఉన్నది.

అయితే ప్రస్తుత బీజేపీకి మాత్రం పరిస్థితి ఎదురీతగానే ఉంటున్నది. ఎందుకంటే జమ్మూ కాశ్మీర్, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టి, లడక్‌ను ప్రత్యేక ప్రాంతంగా చీల్చి పక్కన పెట్టడం అక్కడ స్థానికులకు ఎవరికీ రుచించడం లేదు. ఉగ్రవాదులు హింసాకాండను సమూలంగా అరికట్టేందుకే ఆర్టికల్స్‌ను రద్దుచేసి ఇలా విభజన చేసామన్న బీజేపీ వాదనను వారు మొదటినుంచీ అంగీకరించడం లేదు. ఫలితాలు కూడా అలాగే ఉన్నాయి. గత ఐదేండ్లలో ఉగ్రవాదుల ప్రభావం ఏమీ తగ్గలేదు సరికదా పాక్ ఐ.ఎస్.ఐ నాయకత్వంలోని ఉగ్రవాదానికి- భారతసైన్యానికి మధ్య నిత్యం కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. మత విభజన లక్ష్యంతో బీజేపీ పైకి చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయి పరిస్థితులకు అస్సలు పొంతన కుదరడం లేదు.

ఉదాహరణకు ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఉదంపూర్, జమ్మూ నియోజక వర్గాల్లో గెలిస్తే, నేషనల్ కాన్ఫరెన్స్ శ్రీనగర్, అనంతనాగ్- రాజేరి నియోజకవర్గాల్లో గెలుపొందింది. కానీ కాశ్మీర్ విషయంలో తాముచేసింది చారిత్రక నిర్ణయంగా గొప్పలు చెప్పుకుంటున్నది బీజేపీ! కాగా, బారాముల్లాలో ఇండిపెండెంట్ అభ్యర్థి రషీద్ గెలుపొందారు. ఒమర్ అబ్దుల్లాపై రెండు లక్షల పైచిలుకు ఓట్ల ఆధిక్యతతో గెలుపొందడం అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేయడమే కాదు, ఆందోళనకూ గురి చేస్తున్నది. కారణం రషీద్ కాశ్మీర్‌కు ప్రత్యేకంగా స్వయం ప్రతిపత్తి కావాలని డిమాండ్ చేయడం. ఉగ్రవాదులకు రహస్య నిధులు అందజేస్తున్నారనే ఆరోపణ ఉన్నది. అసలు ఆ ఆరోపణపై అతన్ని జైలులో నిర్బంధించారు కూడా.ఈ తీవ్రధోరణి ఇలానే కొనసాగితే బారాముల్లా లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పద్దెనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్న ఉత్పన్నంకాక మానదు.

2014 అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి పదిహేను సీట్లు మాత్రమే వచ్చాయి. కానీ ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి 36 అసెంబ్లీ స్థానాల్లో ఆధిక్యత లభించింది. లోక్‌సభ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉంది. ఫలితంగా కాంగ్రెస్ ఏడు స్థానాల్లో, ముఫ్తీ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ ఐదు స్థానాల్లో ఆధిక్యత పొందాయి. అంటే మొత్తం 48 స్థానాల్లో ఇండియా కూటమి ఆధిక్యతతో ఉన్నట్టు తెలుస్తోంది.బీజేపీ 29 అసెంబ్లీ స్థానాల్లో మాత్రమే ఆధిక్యత లభించింది. ఆ పార్టీ గెలుచుకున్న రెండు లోక్‌సభ స్థానాల పరిధిలో 36 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. పరిస్థితిని ముందుగా ఊహించింది కనుకనే బీజేపీ పార్లమెంటు ఎన్నికల్లో కాశ్మీరులో తమ పార్టీ అభ్యర్థిని నిలబెట్టలేదనే వాదన లేకపోలేదు.

ఇదిలా ఉండగా లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్.జీ) మనోజ్‌సిన్హా పాలనపట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రగులుకుంటున్నది. మిలటరీ సాయంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించే ఎల్.జీ పాలనకన్నా ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామ్య ప్రభుత్వ పాలనే మిన్న అన్న సత్యం ప్రతి ఒక్కరికీ తెలుసు.'జమ్మూ- శ్రీనగర్‌లు ప్రభుత్వ ప్రకటనల్లో పేరుకు మాత్రమే స్మార్ట్ నగరాలుగా, పర్యాటక కేంద్రాలుగా విలసిల్లుతాయి. కానీ, మాకు మాత్రం మౌలిక వసతులు లేని దెబ్బ తిన్న వ్యాపార కేంద్రాలుగా కన్పిస్తాయని' స్థానికులు వాపోతున్నారు. బయటనుండి వచ్చే కార్పోరేట్ దిగ్గజాలు అక్రమమైనింగ్, మద్యం, డ్రగ్స్ వ్యాపారం చేస్తూ తమ పత్రిష్ట దిగజారుస్తున్నారని అంటు న్నారు. ప్రభుత్వం వీటిపట్ల చాలా ఉదాసీనంగా వ్యవహరించడం తమకు అన్యాయం చేయడం కాదా? అని ప్రశ్నిస్తున్నారు. 'మాకు ఉద్యోగాలు లేవు. పెద్దఎత్తున మా ప్రాంతాలకు పెట్టుబడులు, ఉపాధి కల్పనా కేంద్రాలు రావలసి ఉంది,కానీ మేం ప్రశ్నిస్తే దేశద్రోహులమై పోతున్నాం'. అని తెలిపే యువత ఆక్రోశంలో ఎంతో నిజం ఉంది.

అందరూ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే గత 35 ఏండ్లలో ఎన్నడూ లేని విధంగా మొన్న లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూ కాశ్మీర్‌లో 58:58 శాతం ఓటింగ్ నమోదైంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఓటింగ్ శాతం కచ్చితంగా పెరుగు తుందనే ఆశాభావంతో ప్రజలున్నారు. గతంలో ఎన్నికల బహిష్కరణవరకు వెళ్లిన ఈ రాష్ట్రం ఇప్పుడిలా ప్రజాస్వామ్య పథంలో అడుగిడటం, శాంతి సామరస్యాలు చిగురించడానికి సంకేతమే కదా!



'జమ్మూ- శ్రీనగర్‌లు ప్రభుత్వ ప్రకటనల్లో పేరుకు మాత్రమే స్మార్ట్ నగరాలుగా, పర్యాటక కేంద్రాలుగా విలసిల్లుతాయి. కానీ, మాకు మాత్రం మౌలిక వసతులు లేని దెబ్బతిన్న వ్యాపార కేంద్రాలుగా కన్పిస్తాయని' స్థానికులు వాపోతు న్నారు. బయటనుండి వచ్చే కార్పోరేట్ దిగ్గజాలు అక్రమమైనింగ్, మద్యం, డ్రగ్స్ వ్యాపారం చేస్తూ తమ పత్రిష్ట దిగజారుస్తున్నారని అంటున్నారు.ప్రభుత్వం వీటిపట్ల చాలా ఉదాసీనంగా వ్యవహరించడం తమకు అన్యాయం చేయడం కాదా?అని ప్రశ్నిస్తున్నారు. 'మాకు ఉద్యోగాలు లేవు. పెద్దఎత్తున మా ప్రాంతాలకు పెట్టుబడులు,ఉపాధి కల్పనా కేంద్రాలు రావలసి ఉంది,కానీ మేం ప్రశ్నిస్తే మేం దేశద్రోహులమై పోతున్నాం'. అని తెలిపే యువత ఆక్రోశంలో ఎంతో నిజం ఉంది.

మాదకద్రవ్యాలకు యువత బానిస

- డ్రగ్స్ నిర్మూలనపై కళా యాత్రతో అవగాహన : మంత్రి జూపల్లి కృష్ణారావు
- ప్రజా నాట్యమండలి కళాయాత్రను ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ-కల్చరల్

డ్రగ్స్ వాడకం పెనుభూతంలా వ్యాపిస్తోందని, ముఖ్యంగా చదువుకునే యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సమాజంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన.. ప్రజల్లో చైతన్యం కలిగించే లక్ష్యంతో ప్రజానాట్యమండలి చేపట్టిన కళాయాత్ర బృందానికి అభినందనలు తెలిపారు. వారి సామాజిక బాధ్యతకు ప్రభుత్వ సహకారం ఉంటుందని తెలిపారు. ప్రజానాట్యమండలి 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం-సమాజాన్ని మేలు కోలుపుదాం' అనే నినాదంతో చేపట్టిన కళాయాత్ర వాహనాన్ని హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రాంగణంలో గురువారం మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుని చట్టాలు కఠినతరం చేసిందని తెలిపారు. మాదక ద్రవ్యాల సమూల నిర్మూలనకు సీఎం రేవంత్ రెడ్డి దృఢ సంకల్పంతో ఉన్నారని, ఎవరినీ ఉపేక్షించేది లేదని అన్నారు. డ్రగ్స్ వ్యాపారం చేసి ముఖ్యంగా యువతకు, విద్యార్థులకు వాటిని అలవాటు చేసే వారిని గుర్తించి జైళ్లకు పంపుతామని హెచ్చరించారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కూడా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కళా ప్రదర్శనలు త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి మారన్న.. కళాయాత్రలో పాల్గొనే కళాకారులు, ప్రదర్శన వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం గౌరవ సలహాదారు డిజి.నర్సింహారావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కళ్యాణ్, రాము, సమన్వయకర్త మహారాజ్, కళాకారులు రఘు, నాగరాజు, విజయ్, సునీత, భరత్, వసీమ్, వెన్నెల, అర్చన, మంజునాథ్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి, నాయకులు రాజు, లోకేష్ రెడ్డి పాల్గొన్నారు.

సెప్టెంబర్ 18 నుంచి డీఈఐఈడీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

- టైం టేబుల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న (2022-2024 బ్యాచ్) విద్యార్థులకు వచ్చేనెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. అదేనెల 24 వరకు ఆ పరీక్షలు జరుగుతాయని వివరించారు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. వచ్చేనెల 18న పేపర్-1, 19న పేపర్-2, 20న పేపర్-3, 21న పేపర్-4, 23న పేపర్-5, 24న పేపర్-6 పరీక్షలుంటాయని పేర్కొన్నారు. పాత బ్యాచుల్లో ఫెయిలైన విద్యార్థులు కూడా ఈ పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

ఏప్రిల్‌లోగా నెల్లికల్లు భూసేకరణ పూర్తిచేయాలి

- త్వరితగతిన రైతులతో సంప్రదింపులు చేపట్టాలి : మంత్రి ఉత్తమ్ ఆదేశం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నెల్లికల్లు ఎత్తిపోతల పథకానికి భూసేకరణ ఎట్టి పరిస్థితుల్లో అడ్డు కాకూడదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఏప్రిల్ నెలాఖరుకు భూసేకరణ పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పురోగతిపై మంత్రి అధ్యక్షతన సమీక్ష జరిగింది. నల్లగొండ లోక్‌సభ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి ,మాజీ మంత్రి కుందూరు జానారెడ్డితో పాటు ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్, నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, చీఫ్ ఇంజినీర్లు అజయ్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భూసేకరణ విషయమై రైతులతో త్వరితగతిన సంప్రదింపులు చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే అటవీశాఖ భూములకు అదనపు చెల్లింపుల విషయమై ఆయన ప్రస్తావిస్తూ అందుకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే పూర్తి చేయాలన్నారు.పెండింగ్‌లో ఉన్న రూ. 23 కోట్ల విద్యుత్ బకాయిలతో పాటు పెరిగిన విద్యుత్ బకాయిల ప్రతిపాదనలు తక్షణమే సర్కారుకు పంపాలని చెప్పారు. అలాగే నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో కొత్తగా నిర్మించ తలపెట్టిన చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు తీసుకోవడంతోపాటు మొత్తం ఐదు చెక్‌డ్యామ్‌లకు తక్షణమే టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఏయంఆర్‌పీ పరిధిలోని లోలెవల్ కెనాల్‌లో జంగిల్ కటింగ్ వెంటనే ప్రారంభించాలని చెప్పారు. దాంతో పాటుగానే ఎన్ఎస్‌పీ కెనాల్ పరిధిలో ఉన్న మరమ్మతులను గుర్తించి వెంటనే ఆ పనులకు శ్రీకారం చుట్టాలని ఆదేశించారు.

డిజిటల్ చెల్లింపులతో జాగ్రత్త

భారత్‌లో డిజిటల్ స్కాంలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా, డిజిటల్ చెల్లింపుల విషయంలో ఇవి మరీ ఎక్కువవుతున్నాయి. యూపీఐ చెల్లింపులు వచ్చిన తర్వాత ప్రజలు వీటి మీద అధికంగా ఆధారపడుతున్నారు. ఏ ఒక్క చిన్న చెల్లింపుకైనా ప్రజలు యూపీఐ నే ఆశ్రయిస్తున్నారు. సాధారణంగా, డిజిటల్ చెల్లింపుల కోసం అందుబాటులో ఉన్న థర్డ్‌పార్టీ అప్లికేషన్లను వినియోగదారులు ఉపయోగిస్తుంటారు. అయితే, ఈ అప్లికేషన్ల ద్వారా జరిపే యూపీఐ చెల్లింపులు వాటిని వినియోగించేవారి భద్రతను ప్రమాదంలో పడేస్తున్నాయి. వీటి ద్వారా వినియోగదారుల ఫోన్ నెంబర్లు బహిర్గతమయ్యే ప్రమాదమున్నదనీ, మరీ ముఖ్యంగా, మహిళలు, యువతులు వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని టెక్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ఇటీవల ఒక బెంగళూరు యువతికి ఎదురైన అనుభవమే ప్రత్యక్ష ఉదాహరణ.



యూపీఐ లావాదేవీల భద్రతకు ప్రమాదం

- థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా మహిళల ఫోన్ నెంబర్లకు వల
- అసభ్య సందేశాలు పంపుతూ వేధింపులకు గురి చేస్తున్న వైనం
- సోషల్ మీడియాలో బాధను వెళ్లగక్కుతున్న బాధిత మహిళలు
- జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరిస్తున్న టెక్ నిపుణులు

న్యూఢిల్లీ : దేశంలో 2016 నుంచి అందుబాటులోకి వచ్చిన యూపీఐ చెల్లింపులు.. క్రమక్రమంగా వేగం పుంజుకున్నాయి. ప్రజలు వీటి మీద ఆధారపడటం ఎక్కువైంది. దీంతో ప్రత్యక్ష నగదు చెల్లింపులకు దూరమైన ప్రజలు.. డిజిటల్ సౌకర్యానికి అలవాటు పడిపోయారు. అయితే, ఇదే ఇప్పుడు వారిని ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఐటీ నగరమైన బెంగళూరుకు చెందిన యువతి యూపీఐ ఐడీ ద్వారా తనకు ఒక వ్యక్తి నుంచి ఎదురైన వేధింపుల ఘటనను సామాజిక మాధ్యమంలో పంచుకున్నది. ఈ పోస్టును దాదాపు 27 లక్షల మందికి పైగా వీక్షించారు. ఒక ఏడాది క్రితం తన యూపీఐ ఐడీతో పాటు గూగుల్‌పే స్కానర్‌తో ఒక ట్వీట్‌ను అప్‌లోడ్ చేసింది. సదరు యువతి అందరిలాగే ఇది ఒక సాధారణ విషయంగానే భావించింది. అయితే, ఆ యూపీఐ ఐడీ ద్వారా ఒక 44 ఏండ్ల వ్యక్తి ఆమె నెంబర్‌ను పొందాడు. ఇక అప్పటి నుంచి సదరు యువతికి డబ్బు, సందేశాలతో పాటు అతని నగ్న చిత్రాలనూ పంపటం ప్రారంభించాడు. ఈ విషయాన్ని బాధిత యువతి ట్వీట్‌లో వెల్లడించింది. తన బాధను పంచుకున్నది. తనను వేధిస్తున్న వ్యక్తిని ఎన్ని సార్లు బ్లాక్ చేస్తున్నా.. కొత్త ఖాతాను తెరచి మరీ తనకు సందేశాలను పంపుతున్నాడని వాపోయింది. ఆ వ్యక్తి ఫోటో, పేరు, ఫోన్ నెంబర్, ఆయన నివాసం ఉండే ప్రాంతం వంటి వివరాలను సైతం షేర్ చేసింది. అయితే, ఇది ఒక్క ఘటనే కాదనీ, దేశవ్యాప్తంగా డిజిటల్ మార్కెట్ ద్వారా ఎందరో యువతులు, మహిళలు ఇలాంటి వేధింపులనే ఎదుర్కొంటున్నారని సామాజిక వేత్తలు చెప్తున్నారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి నిమిషమూ విలువైనదే. దీంతో ప్రజలు తమ గమ్య స్థానాలను చేరుకోవటానికి వివిధ మార్గాలను అన్వేషిస్తుంటారు. ఇందులో ఒకటి.. థర్డ్ పార్టీ రైడ్ యాప్‌లు. ప్రస్తుతం కొన్ని యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఇలాంటి యాప్‌ల ద్వారా కూడా కొందరు వ్యక్తులు మహిళలు, యువతుల ఫోన్‌నెంబర్లను సంపాదిస్తూ, వారిని వేధింపులకు గురి చేస్తున్న ఘటనలు కొన్ని చోటు చేసుకున్నాయని టెక్ నిపుణులు, విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. పలువురు మహిళలు, యువతులు ఇలాంటి యాప్‌ల ద్వారా తమ ఫోన్ నెంబర్లు కొందరి చేతుల్లోకి వెళ్లాయనీ, వారి నుంచి అసభ్య సందేశాలు రావటం మొదలయ్యాయని సామాజిక మాధ్యమాల్లో తమ బాధను వెళ్లగక్కారు కూడా. రైడ్ యాప్‌లకు చెందిన డ్రైవర్ల నుంచి వచ్చిన వేధింపుల ఫిర్యాదులు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లువెత్తాయి.

కొన్ని అధికారిక గణాంకాల ప్రకారం.. భారత్‌లో ఒక గంటకు 1.84 కోట్లకు పైగా, ఒక రోజులో దాదాపు 44.3 కోట్ల యూపీఐ లావాదేవీలు సాగుతున్నాయి. ఇది గతేడాది కంటే 50 శాతం అధికం కావటం గమనార్హం. ఈ ఏడాది మార్చి నాటికి భారత్‌లో డిజిటల్ చెల్లింపులకు సంబంధించిన మోసాల విలువ రూ.14.57 వందల కోట్లకు పైగానే కావటం గమనార్హం.

అన్‌మెన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలి

- సర్కార్ పట్టించుకోకుంటే విద్యుత్ సౌధ ముట్టడిస్తాం : టీజీయూఈఈయూ నిరాహారదీక్షలో రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్‌మెన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థలైన ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్లో పని చేస్తున్న 16 వందల మంది కార్మికులను 2017లోనే ఆర్టిజన్లుగా గుర్తించాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ఇంకా కొనసాగిస్తున్నారని విమర్శించారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న సెమి స్కిల్డ్ వేతనంలోంచి కూడా కాంట్రాక్టర్లు రూ.500 కమిషన్ తీసుకుంటూ కార్మికులను మోసం చేస్తున్నారని మండి పడ్డారు. కొంత మంది కాంట్రాక్టర్లు కార్మికుల ఏటీఎం కార్డులను తీసుకొని జీతం డబ్బులను తామే డ్రా చేసి తమ కమిషన్ తీసుకుని మిగతా మొత్తాన్ని తిరిగి చెల్లిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే అలాంటి కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

గత ఐదేండ్ల కాలంలో 64 మంది కార్మికులు ప్రమాదంలో మరణించారనీ, వారిందరికి రూ.10 లక్షల పరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఈ, ఏడీ, కాంట్రాక్టర్లు చీటికి మాటికి వేదింపులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకరమైన వృత్తిలో కొనసాగుతున్న అన్‌మెన్డ్ కార్మికులకు రక్షణ పరికరాలు అందించాలన్నారు. ఆర్టిజన్లుగా గుర్తించే వరకు స్కిల్డ్ వేతనం రూ. 17,598 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్య మంత్రి భట్టి ఆర్టిజన్ కార్మికుల సమస్యలపై విధానపరమైన నిర్ణయం తీసుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. సర్కార్ సానుకూలంగా స్పందించకుంటే బిల్‌కలెక్టర్లు, ఎస్పీఎమ్‌లు, మీటర్ రీడింగ్ కార్మికులతో కలిసి విద్యుత్‌సౌధ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.గోవర్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.స్వామి, సీఐటీయూ నాయకులు కే.ప్రభాకర్‌రెడ్డి, పూర్ణాచారి, బానోత్‌రవి, జే.బస్వరాజ్, జే.ప్రసాదరాజు, సధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావు ఒత్తిడితోనే సంతకం పెట్టా

కాళేశ్వరం నిర్మాణ సంబంధ చర్చల్లో పాల్గొనలేదు

- అంతా హడావిడిగా జరిగింది
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట సీడీవో మాజీ ఈఎన్సీ నరేందర్‌రెడ్డి వివరణ
- కొనసాగుతున్న విచారణ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం న్యాయకమిషన్ విచారణ కొనసాగుతోంది. గురు వారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో జరిగిన విచారణకు పలువురు ఉన్నతాధికారులు హాజర య్యారు. ఇందులో ఇప్పటికే ఉదో ్యగాలకు రాజీనామా చేసినవారు, ఉద్యోగవిరమణ చేసిన వారున్నారు. కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ గత రెండు రోజులుగా గతంలో విచారించిన అధికారులనే మళ్లీ పిలిచారు. అలాంటి వారిలో నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి. మురళీధర్, సీడీవో మాజీ ఈఎన్సీ నరేందర్‌రెడ్డి సైతం కమిషన్ ముందుకు వచ్చి జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. పలు కీలక అంశాలను విచారణలో కమిషన్‌కు చెప్పారు. డిజైన్లు, డ్రాయింగ్‌ల ఖరారుకు తొలుత తాను సంతకం చేయలేదని స్పష్టం చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటపారుదల శాఖ మంత్రి టి హరీశ్‌రావు పలుమార్లు చేసిన ఒత్తిడి మూలంగానే సంతకాలు చేసినట్టు తెలిపారు. త్వరగా పని చేయాలన్న ఒత్తిడి మూలంగా అన్నింటినీ ఖరారు చేసినట్టు కమిషన్‌కు వివరించారు. మేడిగడ్డ ప్రతిడిజైన్‌లో సీడీవోతోపాటు ఎల్అండ్‌టీ సంస్థ పాల్గొన్నదని పేర్కొన్నారు. ఆ సంస్థ కూడా లోపాలను పసిగట్టలేకపోయిందని గుర్తుచేశారు. నిర్మాణ సంబంధ చర్చల్లో తాను పాల్గొనలేదనీ, ప్రాజెక్టు నిర్మాణం జరిగేటప్పుడే తప్పిదాలు జరిగాయని ఘోష్ కమిషన్‌కు చెప్పారు. ప్రభుత్వ ఒత్తిడి, అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమనీ, పైనుంచి ఒత్తిడి వల్లే పనులు నాణ్యంగా జరగలేదని నరేందర్‌రెడ్డి కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. బ్యారేజీల నిర్వహణ, గేట్ల ఆపరేషన్ సైతం ప్రోటోకాల్ ప్రకారం చేపట్టలేదని కమిషన్ దృష్టికి తెచ్చారు. డిజైన్లు, డ్రాయింగ్‌లకు సంబంధించి నరేందర్‌రెడ్డిని పూర్తిస్థాయిలో ప్రశ్నించి తన సందేహాలకు సమాధానాలు రాబట్టారు. మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావును మరోసారి ప్రశ్నించారు. నిర్మాణ, సాంకేతిక అంశాల్లో కమిషన్‌కు ఉన్న సందేహాలను నివృత్తిచేసుకున్నది. ఇదిలావుండగా ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ సీవీ ఆనంద్ సైతం ఇటీవల మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయం విదితమే. మేడిగడ్డ వైఫల్యానికి దాదాపు 21 మంది ఇంజినీర్లదే బాధ్యతని నివేదికలో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అన్నారం, సుందిళ్లకు సంబంధించిన రిపోర్టులు సైతం వెంటనే ఇవ్వాలని చైర్మెన్ పీసీ ఘోష్ విజిలెన్స్‌కు ఆదేశాలు ఇచ్చారు. గతంలో కమిషన్ దగ్గరకు వాంగ్మూలమిచ్చి అఫిడవిట్లు సమర్పించని వారిని తిరిగి విచారణకు మళ్లీ పిలిచే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

ఆగస్టు 23 సీపీఎస్ ఉద్యోగులకు బ్లాక్‌డే

- ప్రజాపాలనలో పాత పెన్షన్ పునరుద్ధరణ జరగాలి
- నేడు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు : టీఎస్‌సీపీఎస్‌ఈయూ అధ్యక్షులు స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానం అమల్లోకి వచ్చిన రోజు ఉద్యోగులకు చీకటి రోజు అని టీఎస్‌సీపీఎస్‌ఈయూ విమర్శించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని కోరింది. ఈ మేరకు టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాత పెన్షన్ పునరుద్దరణ కోసం శుక్రవారం నిర్వహించే బ్లాక్ డేలో భాగంగా అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. భోజన విరామ సమయంలో 28 జీవో ప్రతులని దహనం చేయాలని పిలుపునిచ్చారు.

అన్ని శాఖల ఉద్యోగ, ఉపాధ్యాయులు జిల్లా కేంద్రాల్లో 28 జీవో ప్రతులను దహనం చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 2014, ఆగస్టు 23న 28 జీవో ద్వారా సీపీఎస్ విధానాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. దానికి నిరసనగా ఆగస్టు 23ని ఉద్యోగుల పాలిట చీకటి రోజుగా భావించి బ్లాక్ డే జరుపుకోవాలని కోరారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతిస్పందనను రేకెత్తించేవి చిత్రాలే

- టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చరిత్రలో, జీవితంలో ముఖ్యమైన క్షణాలను మనం వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు, చాలా తరచుగా ప్రతిస్పందనను రేకెత్తించేవి చిత్రాలే అని టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన 2024ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఛాయాచిత్ర ప్రదర్శన ద్వారా ప్రపంచానికి బలమైన సందేశాన్ని పంపడానికి వీలుగా ఫోటో జర్నలిస్టులు చేసిన సృజనాత్మక పనిని ఆయన అభినందించారు. ఫోటో జర్నలిస్టులు తమ చుట్టూ ఉన్న ప్రకృతి మానవీయ ఘటనలు, వివిధ సంఘటనలు, సమాజం, సంస్కృతి సంప్రదాయాలు, ప్రపంచం గురించి తీసిన ఈ ప్రదర్శనలోని చిత్రాలు బలమైన అనుభూతిని కలిగించే విదంగా ఉన్నాయని కొనియాడారు. విలువ-ఆధారిత జర్నలిజం కోసం యువ ఫోటో జర్నలిస్టుల కృషి చేయాలని సజ్జనార్ సూచించారు. టీజీఎస్‌ఆర్టీసీకి చెందిన "త్రూ ది లెన్స్" అనే థీమ్ మీద ఫోటోగ్రఫీ పోటీలు, ప్రదర్శన, ఉత్తమ చిత్రాలకు పురస్కారాల కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం నిర్వహించాలని కోరారు. దీనికి అవసరమైన సహకారాన్ని అందిస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్, ఉపాధ్యక్షులు టి. కిషోర్ సింగ్, పి.రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, కోశాధికారి అనిల్ కుమార్ కర్ణకోటి, కార్యవర్గ సభ్యులు ఎండి అలీముద్దీన్, నగర గోపాల్, ప్రదర్శన నిర్వహణ కమిటీ కన్వీనర్ ఏ. మహేష్ కుమార్, సభ్యులు పి.సురేంద్ర, ఎల్లేశా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ అవార్డుల కమిటీ చైర్మెన్‌గా బి.నర్సింగరావు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గద్దర్ అవార్డుల కమిటీని ప్రముఖ దర్శకులు బి.నర్సింగరావు చైర్మెన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఎం.హన్మంతరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మెన్‌గా వి.వెంకటరమణారెడ్డి(దిల్‌రాజు)ని నియమించింది. సలహాదారులుగా కె.రాఘవేందర్ రావు, అందెశ్రీ, తమ్మారెడ్డి భరద్వాజ, అల్లు అరవింద్, గుమ్మడి వెన్నెల, తనికెళ్ల భరణి, డి.సురేష్ బాబు, చంద్రబోస్, నారాయణమూర్తి, వందేమాతరం శ్రీనివాస్, అల్లాణి శ్రీధర్, సానా యాదిరెడ్డి, హరీశ్ శంకర్, బలగం వేణులను నియమించింది. గద్దర్ అవార్డుల కోసం లోగో, విధి విధానాలు, నియమ నిబంధనలను ఈ కమిటీ రూపొందించనుంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం రామేశ్వర పల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంతోష్ రెడ్డి (39) మంగళవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అక్కడి వెళ్లిన తర్వాత.. అప్పులు ఎక్కువైన కారణంగా వాటిని తీర్చే మార్గంలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్టు కుటుంబీకులకు ఫోన్ చేశాడు. కుటుంబీకులు హుటాహుటిన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా గుర్తుతెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న సంతోష్ పడిఉన్నారు. వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. కాగా, బుధవారం రాత్రి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. పోలీసులుమృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సాయి కుమార్ తెలిపారు. మృతుడు సంతోష్ రెడ్డి జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాలో కొన్నేండ్లుగా సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా సంతోష్ రెడ్డికి భార్య, పిల్లలు ఉన్నారు.

బీజేపీతో దేశానికి ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

రాజీనామా చేయాలనీ, అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం హైదరాబాద్ ఈడీ కార్యాలయం వద్ద టీపీసీసీ పెద్ద ఎత్తున నిరసన చేపట్టింది. గన్‌పార్క్ నుంచి ఈడీ కార్యాలయానికి ప్రదర్శన నిర్వహించింది.

ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ అదానీకి లబ్ది చేకూర్చేందుకు అడ్డదారులు తొక్కిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) చైర్‌పర్సన్ మహాకుంభకోణంలో ఇర్కుకుందని చెప్పారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు కేంద్ర బీజేపీ సర్కారుకు జంకెందుకని ప్రశ్నించారు. ఆ కుంభకోణంపై మోడీ లోక్‌సభలో ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. తక్షణమే సెబీ చైర్ పర్సన్ రాజీనామా చేయాలనీ, లేదంటే కేంద్ర ప్రభుత్వమే ఆమెను తొలగించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకు 16 మంది ప్రధానులు చేసిన అప్పు రూ.55 వేల కోట్లు అయితే, పదేండ్లలో ప్రధాని మోడీ చేసిన అప్పు లక్షా 15వేల కోట్లు అని , దీన్ని బట్టి మోడీ రెండింతలు ఎక్కువగా అప్పులు చేశారని వాపోయారు.

రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ తాత, ముత్తాతలు దిగొచ్చినా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏం చేయలేరు. రాజీవ్ విగ్రహంపై చేయి వేస్తే ఈపు చింతపండే. ఎవడు తొలగిస్తాడో రావాలి. తారీఖు చెప్పాలి. పదేండ్ల తర్వాత ఈ సన్నాసులకు తెలంగాణ తల్లి గుర్తొచ్చింది. కనిపించే తెలంగాణ తల్లి సోనియమ్మ. ఆమె జన్మదినం డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసి తెలంగాణ తల్లికి నిజమైన వారసులమని నిరూపించుకుంటాం. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రతి రోజు ప్రజలను కలుస్తున్నాం. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. అన్ని సమస్యలను పరిష్కరిస్తాం. ఆ సన్నాసులను నమ్ముకుని రైతులు రోడ్డెక్కొద్దు. ఈ ప్రభుత్వం ఉన్నదే ప్రజల కోసం. పదేండ్లు మిమ్మల్ని దోచుకుతిన్న ఈ బీఆర్ఎస్ దోపిడీ దొంగలను నమ్మొద్దు' అని విజ్ఞప్తి చేశారు. పదేండ్లలో వాళ్లు ఇచ్చింది ఎంతో...పది నెలల్లో కాంగ్రెస్ ఇచ్చింది ఎంతో చర్చకు సిద్ధమా? అని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు...ఇప్పుడు డ్రామాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 39 సీట్లలో తొమ్మిది కూడా మిగలవని జోస్యం చెప్పారు.

జేపీసీ వేసేదాకా ఆందోళన ఆగదు : భట్టి

అదానీ దోచుకున్న ఆస్తులపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేసే వరకు తమ ఆందోళన ఆగదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. దేశం కోసం, దేశ ప్రజల ఆస్తులను రక్షించేందుకు ఈడీ కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమం ఉన్నతమైందన్నారు. దేశ సంపద ప్రజలందరికి చెందాలంటూ రాహుల్‌గాంధీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నారని చెప్పారు. అదానీకి మోడీ దేశ సంపదను ఎలా దోచిపెడుతున్నాడో భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ వివరించారని గుర్తు చేశారు. అనంతరం అదానీ వ్యవహారంపై విచారణ జరిపించాలంటూ టీపీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, జాతీయ నేత సల్మాన్ ఖుర్షీద్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ కార్యనిర్వహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు ఇడి ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, అజరుద్దీన్, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, వేం నరేందర్‌రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనలేం... తినలేం!

• దిగిరానంటున్న ఉల్లి ధరలు • మెట్రో నగరాల్లో అర్ధ సెంచరీ దాటేసింది

• తగ్గిన దిగుబడులు, సరఫరాలు • సాగు విస్తీర్ణమూ పడిపోయింది

కూరలో ఉల్లి ముక్కలు ఉంటే ఆ రుచే వేరు. చాలా మందికి ఉల్లి ఘాటు తగలనిదే ముద్ద గొంతు దిగదు. అయితే ప్రస్తుతం దాని ధర సామాన్యులకు అందనంత దూరంలో ఉంది. ఆ ధర చూసి ఉల్లిని కోయకుండానే కంటి నుండి నీరు వచ్చేస్తోంది. దేశంలోని అనేక మార్కెట్లలో కిలో ఉల్లిగడ్డ ధర నలభై ఐదు రూపాయలు పలుకు తోంది. గత సంవత్సరం ఇదే సమయంలో దాని ధర ముప్పై రూపాయల చిల్లరే. ఇవి వినియోగ వ్యవహారాల శాఖకు చెందిన ధరల నియంత్రణ విభాగం అందజేసిన లెక్కలు. కొన్ని చోట్ల ఉల్లి ధర అర్ధ సెంచరీ దాటేసింది.



న్యూఢిల్లీ : రాజధాని ఢిల్లీ సహా అనేక మెట్రో నగరాల్లో కిలో ఉల్లిగడ్డ ధర యాభై రూపాయలు దాటింది. గత నెల ధరతో పోలిస్తే ఇది పాతిక శాతం అదనం. శ్రావణమాసం ముగుస్తుం డడంతో ధరలు పెరుగుతు న్నాయని మార్కెట్ వర్గాలు తెలి పాయి. శ్రావణ మాసంలో ఉత్తరాదికి చెందిన అనేక మంది హిందువులు ఉల్లిని తినరు. అనేక ఆహార సంబంధమైన ఆంక్షలను కూడా పాటిస్తారు. శ్రావణ మాసంలో మూడో వారం కొనసాగుతున్న నేపథ్యంలో తిరిగి ఉల్లికి డిమాండ్ పెరుగుతోంది.

ధరలు పెరుగుతాయన్న అంచనాతో...

మహారాష్ట్రలోని లాసల్‌గాన్ హోల్‌సేల్ మార్కెట్‌లో గత నెలతో పోలిస్తే ఇప్పుడు ఉల్లి ధర సగటున 30 శాతం పెరిగింది. ఇది దేశంలోనే అతి పెద్ద ఉల్లిగడ్డల వ్యాపార మార్కెట్. బుధవారం కిలో ఉల్లి ధర రూ.35 పలికింది. ధరలు మరింత పెరుగుతాయన్న అంచనాతో చాలా మంది వ్యాపారులు తమ వద్ద ఉన్న ఉల్లి నిల్వలను బయటికి తీయడం లేదు. అక్టోబర్, నవంబర్ నెలల్లో భారీ వర్షాలు కురుస్తాయని, అప్పుడు సరఫరాలకు అంతరాయం కలిగి ధరలు బాగా పెరుగుతాయని వ్యాపారుల అంచనా.

కేంద్ర నిర్ణయం పొరబాటే : మహారాష్ట్ర డిప్యూటీ సీఎం

ఉల్లి ఎగుమతులను నిషేధించాలని గత సంవత్సరం చివరలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ క్షమాపణ చెప్పారు. ఆ నిర్ణయం పొరబాటేనని అంగీకరించారు. పెరుగుతున్న ధరలను నియంత్రించేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఉల్లిని అధికంగా ఉత్పత్తి చేసే మహారాష్ట్రలో కేంద్రం నిర్ణయంపై రైతులు భగ్గుమన్నారు. పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. మార్చి వరకూ నిషేధాన్ని పొడిగించిన కేంద్రం, మే ప్రారంభంలో దానిని ఎత్తివేసింది. మహారాష్ట్రలో ఉల్లిని అధికంగా పండించే ప్రాంతాల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగుకు ముందు వ్యూహాత్మకంగా నిషేధం తొలగించింది.

హైదరాబాద్‌లోనూ హాఫ్ సెంచరీ

జంట నగరాల్లోనూ ఉల్లి ధర ఘాటెక్కింది. ఇటీవల వర్షాలు కురవక ముందు రూ.100కు మూడు కేజీలు పలికిన ఉల్లి ఇప్పుడు మార్కెట్లో కిలో రూ. 50 పలుకుతోంది. పంటలు తగ్గడం, విదే శాలకు ఎగుమతుల వల్ల సరఫరా తగ్గిం దని వ్యాపారులంటున్నారు. కొత్త పంట వచ్చేదాక ఉల్లి ధర మరింత ఘాటె క్కడం ఖాయమని అంటున్నారు. వాస్త వానికి దిగుబడిని బట్టి వ్యాపారులు ఉల్లిని గోడౌ న్లలో నిల్వ చేస్తున్నారు. దీంతో బ్లాక్ మార్కెట్‌లో ధరలు మండుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సబ్సిడీ ధరపై రైతు బజార్లలో ఉల్లిని విక్రయిస్తే బాగుంటుందని వినియోగదారులు కోరుతున్నారు.

నిల్వలు దాచిపెడుతున్న వ్యాపారులు

కారణాలు ఇవే

ఆశించిన స్థాయిలో ఉత్పత్తి జరగక పోవడం, మార్కెట్ పరిణామాల కారణంగా దేశంలో ఉల్లిగడ్డల రిటైల్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే రబీ సీజన్‌లో పంట విస్తీర్ణం తగ్గడం కూడా ధరల పెరుగుదలకు కారణమైంది. రబీ ఉల్లి పంటను డిసెంబర్-జనవరిలో వేసి, మార్చి తర్వాత తీసుకుంటారు. దేశంలో ఉల్లి అవసరాలను రబీ పంటే 72-75 శాతం వరకూ తీరుస్తోంది. అయితే ఈ సంవత్సరం రబీ పంట సాగు చేసిన ప్రాంతాల్లో దిగుబడి గణనీయంగా పడిపోయింది. 2023లో 1.23 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో ఉల్లిని సాగు చేయగా ఈ ఏడాది 7.56 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగైంది.

తగ్గిపోయిన దిగుబడులు

రబీ సీజన్‌లో 19.1 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరుగుతుందని కేంద్రం అంచనా వేసింది. ఇది దేశీయ అవసరాలకు సరిపోతుందని భావించింది. కానీ వాస్తవ దిగుబడి అంచనాల కంటే తగ్గింది. దీంతో సరఫరాలో కొరత ఏర్పడింది. ఈ సంవత్సరం ఖరీఫ్ పంట సాగు విస్తీర్ణం కూడా చాలా తక్కువగానే ఉంది. గత సంవ త్సరం 2.85 లక్షల హెక్టార్లలో ఉల్లి పంట వేయగా ఈ ఏడాది 1.54 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. దీంతో సరఫరాలు మరింత తగ్గిపోయాయి. అయితే ఇటీవల నాసిక్, ఇతర ప్రాంతాల్లో మంచి వర్షాలు పడడంతో ఖరీఫ్ సాగు పెరుగుతుందని భావిస్తున్నారు. ఏదేమైనా దేశంలో ఉల్లి కొరత ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

మంత్రివర్గంలో చోటు ఊహాగానమే

- ఎమ్మెల్సీ కొత్త పాత్ర
- ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటాను
- విధ్వంసకారులకు ప్రశ్నించే నైతికత ఎక్కడిది?: ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ - హైదరాబాద్

తనకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించబోతున్నట్లుగా జరుగుతున్న ప్రచారమంటూ ఊహాగానాలు మాత్రమేనని ఎమ్మెల్సీ, టీజేఎస్ అధ్యక్షులు కోదండరామ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రి పదవిపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. కానీ విస్తృతమైన పాత్ర పోషించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతున్నదని తెలిపారు. కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా టీజేఎస్‌కు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి మాట నిలబెట్టుకుందని తెలిపారు. కొన్ని కార్పొరేషన్ పదవులు రావాల్సి ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే విషయం రాష్ట్ర కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్సీ తనకు కొత్త పాత్ర అంటూ, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటానని తెలిపారు. పదేండ్లపాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన బీఆర్ఎస్ నాయకులకు ప్రశ్నించే నైతికత ఎక్కడుందని ప్రశ్నించారు. గతంలో పురపాలకశాఖ మంత్రిగా పని చేసిన కేటీఆర్ ఉపయోగించుకున్న ఫాంహౌజ్ కూడా నిబంధనలకు విరుద్ధంగా ఉందంటే ఆ పాలన ఎలా చేశారో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. 2016 నుంచి రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో 12 లక్షల రేషన్ కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రుణమాఫీ కోసం కుటుంబాలను గుర్తిస్తున్న సందర్భంలో ఉమ్మడి రేషన్ కార్డుల జాబితాలోనే పేర్లు ఉండటంతో కొంత మేరకు సాంకేతికంగా ఇబ్బంది కలిగిందన్నారు. ఈ ఇబ్బందికి రేషన్ కార్డులు జారీ చేయని బీఆర్ఎస్ నిర్లక్ష్యమే కారణమని వివరించారు. రాజీవ్ గాంధీ విగ్రహం - తెలంగాణ తల్లి విగ్రహం మధ్య ఘర్షణ పెట్టవద్దని ఆయన అభ్యర్థించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ముఖ్య ద్వారం వద్ద పెట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదనీ, తెలంగాణ అస్థిత్వ చిహ్నాలను కాపాడేందుకు సర్కారు సిద్ధంగా ఉందని చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే స్థానిక సంస్థల్లో బీసీ కోటా తెచ్చారనీ, దాన్ని తెలుగుదేశం ప్రభుత్వం కూడా కొనసాగించిందని గుర్తుచేశారు. బీసీల ప్రాతినిథ్యం మరింత పెంచాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్‌కు, తెలంగాణ ఉద్యమకారులతో బంధం తెగిపోవడమే దాని ఓటమికి దారి తీసిందని తెలిపారు. ఎమ్మెల్సీగా కొత్త పాత్రను పోషించనున్న క్రమంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు టీజేఎస్ కార్యాలయంలో శిక్షణా తరగతులు పెట్టుకున్నట్టు తెలిపారు.

గురుకులాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ, ప్రస్తుతం ఇబ్బందులు కొనసాగుతున్నాయని కోదండరాం తెలిపారు. వీటిని పరిష్కరించాల్సిన అవసరముందని చెప్పారు. ఉద్యోగ నియామకాల్లో ఖాళీల భర్తీకి అడ్డుగా ఉన్న జీవోను వన్ టైం అడ్జెస్ట్ మెంట్ కింద సవరించడం లేదా ఇతర పరిష్కార మార్గాలు వెతకాల్సి ఉందన్నారు. గ్రూప్ 1, 2, 3, 4ల కోసం ఒకే పరీక్షను నిర్వహిస్తే నిరుద్యోగులకు ఉపయుక్తంగా ఉంటుందని సూచించారు. ఎస్సీ వర్గీకరణను తాను మొదట్నించి సమర్థిస్తున్నట్టు గుర్తుచేశారు. ఎవరి వాటా వారు పొందడమే న్యాయమని స్పష్టం చేశారు. ఇందు కోసం ప్రభుత్వం ఒక కమిటీని వేసి హేతుబద్ధంగా అధ్యయనం చేయాలని సూచించారు. జీవో 317కు, రాష్ట్రపతి ఉత్తర్వులకు సంబంధించి ప్రాంతాల వారీగా ఎంపిక ప్రక్రియను అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం జోన్లను, జిల్లాలను అనాలోచితంగా చేయడంతో జీవో 317లో కూడా ఇబ్బందులు తలెత్తి, ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్థానికతను నిర్ణయించేందుకు, తెలంగాణ బిడ్డలు నష్టపోకుండా విస్తృతంగా చర్చించాల్సిన అవసరముందని కోదండరాం అభిప్రాయపడ్డారు. ప్రజలు స్వేచ్ఛగా కలిసేందుకు వీలుగా తనకు కేటాయించిన గన్ మెన్లను వద్దని తిరస్కరించినట్టు తెలిపారు.

బీటెక్ విద్యార్థి దారుణ హత్య

- బాలాపూర్‌లో మండి ఏ37 అరేబియన్ రెస్టారెంట్ వద్ద ఘటన

నవతెలంగాణ-బడంగ్‌పేట్

స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఇంజినీరింగ్ విద్యార్థి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రశాంత్(21) తల్లిదండ్రులు శాంతయ్య- అనితతో కలిసి బాలాపూర్‌లో నివసిస్తున్నాడు. అతను ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బి.ఈ సివిల్ 2వ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం సాయంత్రం ప్రశాంత్ నలుగురు స్నేహితులతో కలిసి బాలాపూర్ గణేష్ చౌక్ సమీపంలో ఉన్న మండి ఏ37 అరేబియన్ బిర్యానీ రెస్టారెంట్‌కు వెళ్లాడు. పక్కనే పాన్‌షాప్ వద్ద నలుగురూ సిగరెట్ తాగుతుండగా వారి మధ్య చిన్న గొడవ జరిగింది. ఈ క్రమంలో అందులో ఒకరు కత్తితో ప్రశాంత్‌ను పొడిచి పరారయ్యాడు. దాంతో ప్రశాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ హత్యకు సంబంధించిన పూర్తివివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

వేములవాడ రాజన్న ఆలయంలో ఏసీబీ తనిఖీలు

- రికార్డుల పరిశీలన
- ఏకకాలంలో ఏసీబీ, విజిలెన్స్, మెట్రాలజీ శాఖల అధికారుల సోదాలు



నవతెలంగాణ - వేములవాడ

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఏకకాలంలో ఏసీబీ, విజిలెన్స్, మెట్రాలజీ శాఖల అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐలు తిరుపతి, కృష్ణకుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఆలయంలో లడ్డూ తయారీ, అమ్మకం, గోదాము, అన్నదాన సత్రం, ధర్మశాలలు, ఆడిట్, శానిటేషన్ తదితర విభాగాల్లో రికార్డులను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దేవాలయంలోని వివిధ విభాగాల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందనే ఆరోపణలు, వివిధ దినపత్రికల్లో కథనాలు వచ్చాయి. ఆగస్టు 5న 28 మంది ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర దేవాలయాలకు బదిలీ చేసింది. ఈ క్రమంలో సోదాలు జరిగాయి. రికార్డుల పరిశీలన పూర్తయ్యాక అధికారులు వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. దేవాలయాల్లోని ప్రధాన శాఖలో ఏసీబీ, విజిలెన్స్, తూనికల కొలతల శాఖ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించడంతో ఎవరి అవినీతి చిట్టా బయటపడుతుందోనని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందించనున్నట్టు ఏసీబీ అధికారులు చెప్పారు.

విదేశీ శక్తులకు ఏజెంటుగా కాంగ్రెస్ : ఏలేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్‌లో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ హిండెన్‌బర్గ్‌కు మౌత్‌పీసుగా మారిందనీ, దీనిని బట్టే ఆ పార్టీ విదేశీ శక్తులకు ఏజెంటుగా మారిందనే అనుమానాలు వస్తున్నాయని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే కుట్ర దీనికి వెనకాల ఉందని ఆరోపించారు. సెబీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు డిమాండ్ చేయడం విడ్డూ రంగా ఉందని పేర్కొన్నారు. ఓ విదేశీ కంపెనీని నమ్ముకుని కాంగ్రెస్ రాజకీయం చేయడం దుర్మార్గమని తెలిపారు. జన్మతా విదేశీయులైన సోనియా గాంధీ, ఆమె కుమారుడైన రాహుల్ గాంధీ కూడా ఇండియన్ హెరాల్డ్ కేసులో బెయిల్ పై ఉన్నారని పేర్కొన్నారు. పదేండ్లుగా గాంధీ కుటుంబం అధికారానికి దూర మైందనీ, కనుచూపు మేరలో కూడా అధికారంలోకి వస్తుందనే నమ్మకం లేదని విమర్శించారు. అందుకనే విదేశీ సంస్థలను నమ్ముకుని రాజకీ యాలు చేస్తున్నదని ఆరోపించారు.

సెబీ చైర్‌పర్సన్ షేర్లు కొనుక్కుంటే తప్పేంటీ ?

- ఎంపీ ఎం.రఘునందన్‌రావు




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముళ్లు దందాలు చేసుకోవచ్చుగానీ సెబీ చైర్‌పర్సన్ అదానీ సంస్థలో షేర్లు కొనుక్కుంటే తప్పా? అని బీజేపీ ఎంపీ ఎం.రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఇన్వెస్టర్లను, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు హిండెన్‌బర్గ్ రాసిన వార్తలపై రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి కలిసి చేస్తున్న ఆరోపణలను ఖండించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హిండెన్‌బర్గ్ సంస్థ రాసిన వార్తలను, ఆరోపణలను సుప్రీం కోర్టు తోసిపుచ్చిందని గుర్తుచేశారు. బ్లిట్జ్ మ్యాగజైన్‌లో రాహుల్‌గాంధీకి భార్యాపిల్లలున్నారని చెబుతూ ప్రచురితమైన కథనంపై ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. అదానీని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని రేవంత్ రెడ్డి ఎందుకు ఆహ్వానిం చారు? అని నిలదీశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయాలని కుట్ర చేసేవారికి కాంగ్రెస్ నాయకులు భజన చేస్తున్నారని ఆరోపించారు. జార్జ్ సోరెస్ లాంటి వారు వ్యాపార సామ్రాజ్యంలో అడ్డగోలుగా సంపాదిం చేందుకునేందుకు తప్పుడు వార్తలు రాస్తే దానికి రాహుల్ గాంధీ లాంటి వారు ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అదానీతో కలిసి వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరుడని చెప్తూ వివరాలతో సహా కోర్టులో సుబ్రమణ్య స్వామి పిటిషన్ వేశారనీ, పౌరసత్వం ఎక్కడ తీసేస్తారో అన్న భయంతో రాహుల్‌గాంధీ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య మృతి

- కడ్తాల్ పీఎస్‌లో ఘటన



నవతెలంగాణ-ఆమనగల్

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మల్లయ్య(50) కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో సుదీర్ఘ కాలం హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. దాంతో సిబ్బంది చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మల్లయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని బడంగ్‌పేట్ ప్రాంతంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించినట్టు సీఐ తెలిపారు. మల్లయ్య అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందారని కొనియాడారు. కడ్తాల్ మండల కేంద్రంలో వివిధ పార్టీల నాయకులు హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గల్లంతైన బాలిక మృతదేహం లభ్యం

- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం తన ఇంటిముందు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు డ్రయినేజీలో పడిన బాలిక అనన్య(2) గల్లంతయిన సంగతి తెలిసిందే. గురువారం ఉదయం 6గంటల తరువాత పాప మృతదేహం నగరంలోని పీఎఫ్ కార్యాలయం వద్ద నున్న దోబిఘాట్ వద్ద లభ్యమైంది. నిజామాబాద్ నగరంలోని వర్ని రోడ్‌లోని ఆనంద్ నగర్ ప్రాంతంలో నాలుగు గంటల ప్రాంతంలో అనన్య తోటి స్నేహితులతో కలిసి ఆడుకునే సమయంలో డ్రయినేజీలో పడి గల్లంతయిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు ప్రత్యేక రెస్క్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది గాలిస్తున్న నేపథ్యంలో అదే డ్రయినేజీ పరిధిలో 100 మీటర్ల దూరంలో అనన్య మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసుకొచ్చినట్టు రెస్క్యూ టీమ్ సిబ్బంది తెలిపారు. అయితే తమతో కలిసి సరదాగా ఆడుతూ పాడుతూ తిరిగిన అనన్య మృతిచెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఇంటర్నేషనల్ సెక్స్ రాకెట్ గుట్టురట్టు

- గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటర్నేషనల్ సెక్స్ రాకెట్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో 17 మంది విదేశీ అమ్మాయిలను అరెస్టు చేశారు. సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ ప్రొఫెసర్ కాలనీలోని సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్న ఓ ముఠా 17 మంది విదేశీ అమ్మాయిలతో సెక్స్ రాకెట్ నిర్వహిస్తోంది. ఢిల్లీ, బాంబే, బెంగళూరు, హైదరాబాద్‌లో ఉంటున్న విదేశీ అమ్మాయిలతో కనెక్ట్ లోకాంటో వెబ్‌సైట్‌లో వారి ప్రొఫైల్‌లను ఉంచి విటులకు ఎర వేస్తున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, లాండర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు.

పాలన లేదు.. రేవంత్ రెడ్డిది గారడీనే

• దేవుళ్లను కూడా దగా చేశారు • యాదాద్రి నుండే మా పోరు షురూ. : మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-యాదగిరిగుట్ట

పాలన లేకుండా గారడీ చేస్తున్న గొప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, దేవుళ్లను కూడా దగా చేశారని ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. యాదాద్రి నుండే కాంగ్రెస్ పాలనపై తమ పోరు షురూ అవుతుందని చెప్పారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో లక్ష్మీ నర్సింహస్వామిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ప్రజాపాలన అంటూ రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుపుతున్నారని విమర్శించారు. రుణమాఫీ చేయాలని తమ కార్యకర్తలు ధర్నాలు చేస్తే అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై కూడా కాంగ్రెస్ కార్యకర్తలు దాడులు చేయడం అన్యాయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అడుగడుగునా అన్ని వర్గాలనూ మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతుల రుణం తీరుస్తా అన్నోళ్లు ఇవ్వాళ రైతులతో రణం చేస్తున్నారని, రుణమాఫీ కాలేదని అడిగితే కేసులు పెడుతున్నారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా, ఎన్ని కేసులు పెట్టినా రుణమాఫీ పూర్తిగా చేసేదాకా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆరు గ్యారంటీలతో మొట్టమొదటి మోసం చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు దేవుళ్ల మీద ఒట్టు పెట్టి వంద శాతం రుణమాఫీ చేస్తా అన్నారని, కానీ మాట తప్పి మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని క్షమించండని యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామికి పూజలు చేసినట్టు తెలిపారు. రేవంత్ లాంటి దగుల్బాజీ వ్యక్తిని ఇప్పటివరకు చూడలేదన్నారు. మంత్రులు ఒక మాట, సీఎం ఒక మాట మాట్లాడుతున్నారని, ఏది నిజం ఏది అబద్ధమో తేల్చాలన్నారు. 54శాతం కూడా రుణమాఫీ కాలేదు.. దీన్ని బట్టి ఎవరు రాజీనామా చేయాలో చెప్పాలన్నారు. సీఎం రేవంత్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. దేవుళ్లకు కూడా ఆయన క్షమాపణలు చెప్పాలన్నారు. ఇప్పటివరకు చేసిన రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాదవరం కృష్ణారావు, కెపి.వివేకానంద్, కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునిత, బుడిద బిక్షమయ్య, డీసీసీబీ మాజీ చైర్మెన్ గొంగిడి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- విప్ అడ్లూరి లక్ష్మణ్‌కు గెస్ట్ లెక్చరర్ల సంఘం వినతి
- అమర వీరుల స్థూపం వద్ద నివాళి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 11 ఏండ్లుగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని గెస్ట్ లెక్చరర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. 1,654 మంది గెస్ట్ లెక్చరర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. త్వరలో జరగనున్న 1,392 అధ్యాపక పోస్టుల భర్తీతో సంబంధం లేకుండా 11 ఏండ్లుగా పనిచేస్తున్న తమ సర్వీసును పరిగణనలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రెన్యూవల్ ఉత్తర్వులను విడుదల చేయాలని కోరారు. అడ్లూరి లక్ష్మణ్ స్పందిస్తూ గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. తప్పకుండా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రెన్యూవల్ ఉత్తర్వులపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఫోన్ చేసి వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కోడి మహేష్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎం బాబురావు, సిహెచ్ దేవయ్య, కోశాధికారి బండి కృష్ణ, నాయకులు వెంకటేష్, ప్రసాద్, ఎస్ పరమేశ్, మల్లికార్జున్, యాదగిరి, చంద్రమోహన్, అరుణ, శివలీల, శ్రీధర్, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఘర్షణ

- పరస్పరం రాళ్లు, కోడిగుడ్లతో దాడి
- కొంతమందికి స్వల్ప గాయాలు
- బాధితులను పరామర్శించిన మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-తిరుమలగిరి

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. తోపులాట.. పరస్పరం రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేసుకున్నారు. రైతు రుణమాఫీని అందరికీ వర్తింపజేయాలని కోరుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా.. పదేండ్లు బీఆర్ఎస్ ఏం చేసిందంటూ రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలు, టపాసులు విసిరారు. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను నిలువరించారు. అనంతరం ఇరు పార్టీల కార్యకర్తల నినాదాలతో తోపులాట.. బాణాసంచా, కోడిగుడ్లు, రాళ్లు వేసుకోవడంతో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. దాంతో బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అక్కడి నుంచి పంపించేశారు. సూర్యాపేట డీఎస్పీ రవి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బాధితులకు మాజీ మంత్రి పరామర్శ

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య జరిగిన దాడిలో బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కార్యకర్తలు పెరుమాండ్ల పురుషోత్తం, పొదిళ్ల అంజయ్యకు గాయాలయ్యాయి. తిరుమలగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుల పక్షాన రుణమాఫీ చేయాలని శాంతియుతంగా ధర్నా చేస్తుంటే రాళ్లతో, గుడ్లతో దాడి చేయడం, బాంబులు వేయడం సరికాదన్నారు. ఇలాంటి చిల్లర దాడులకు, వేషాలకు భయపడేది లేదన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ పాలనలో మహిళా జర్నలిస్టులకు రక్షణేది?

- కొండారెడ్డిపల్లిలో సరిత, విజయారెడ్డిలపై దాడిని ఖండిస్తున్నాం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతు రుణమాఫీపై అసలు వాస్తవాలను ప్రజలను చూపించేందుకు సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లికి వెళ్లిన మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిపై సీఎం అనుచరులు దాడి చేయడాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్యే కే.తారకరామారావు తప్పుబట్టారు. ఇందిరమ్మ పాలనలో మహిళా జర్నలిస్టులకు రక్షణ లేదా? అని ప్రశ్నించారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రుణమాఫీ సరిగా జరిగి ఉంటే సీఎంకు అంత భయమెందుకు అని ప్రశ్నించారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

ఆరాధన మహోత్సవంలో ఈటల రాజేందర్



నవతెలంగాణ - వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయనగర్ రాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్ర స్వామి ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర స్వామి ఆలయ గురువు లక్ష్మీనారాయణ, పార్టీ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, వైదేహి నగర్ కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, పార్టీ నాయకులు భూపాల్ రెడ్డి, రఘురాం నేత, ప్రేమ్ నాథ్, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు శ్రీధర్ రావు, శ్రీనివాస్ శర్మ, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కామేష్, నరసింహారెడ్డి, రమేష్, నాగేష్, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేవైఎం సెక్రెటరీ పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

నవతెలంగాణ-హయత్‌నగర్

రోడ్డు ప్రమాదంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈసీఎల్(కాప్రా)కు చెందిన ఎన్వీ జయలక్ష్మి(47)...విజయవాడ జాతీయ రహదారి పెద్ద అంబర్‌పేటలో రోడ్ దాటుతుంది. ఓ కార్ విజయవాడ నుండి ఎల్బీనగర్‌కు వస్తున్న క్రమంలో ఆమెను కారు ఢీ కొట్టింది. వెంటనే ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు.

అదేవిధంగా పెద్ద అంబర్‌పేటలోని లక్ష్మా రెడ్డి పాలెం వద్ద చౌటుప్పల్ నుండి ఎల్బీనగర్‌కు చౌటుప్పల్ మల్కాపురానికి చెందిన మహేష్ తన ద్విచక్ర వాహనం వస్తున్నాడు. ఈ క్రమంలో అతని ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయింది. అతని తలకు బలమైన గాయాలు అయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం హయత్ నగర్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు తుదిశ్వాస విడిచారు. వారి మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొనిరావాలని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 23వ డివిజన్ పరిధిలో ఉన్న రోమా ఎంక్లేవ్, మారుతి నగర్, బీరప్ప కాలనీలల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ రాళ్ళగూడెం సంతోషి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్టు బాలకృష్ణ, సూర్ణగంటి విజయ్ కుమార్, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాచకొండకు ఐటీ సెల్, ఎస్ఓటీ, సీసీఎస్ విభాగాలు గుండె కాయలాంటివి

- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు



నవతెలంగాణ-హయత్‌నగర్

రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో ఐటీ సెల్, సీసీఎస్, ఎస్ఓటీ విభాగాలు గుండె కాయలాంటివని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఎల్బీనగర్‌లో ఉన్న ఆ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తర్వాత వివిధ పోలీసు విభాగాల అధికారుల, సిబ్బంది పనితీరు పరిశీలించారు. సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి ఐటి సెల్ కార్యాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ రాచకొండ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పలు కేసుల దర్యాప్తులో సాంకేతిక ఆధారాలను అందించడంతో పాటు, పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్, 100 డయల్ వంటి అత్యవసర సేవల అమలులో ఐటీ సెల్ పోషిస్తున్న పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఐటీ సెల్ కార్యాలయంలోని సోషల్ మీడియా ఇతర విభాగాల స్టాఫ్ పనితీరు సమీక్షించినట్టు పేర్కొన్నారు. సీసీటీవీల అవసరాన్ని ప్రజల్లో మరింతగా ప్రచారం చేయాలని, వాటి నిర్వహణను పటిష్టం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల వద్దకు పోలీసులు మరింత త్వరగా చేసుకునేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, నూతన విధానాలను రూపొందించాలని సూచించారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఎస్ఓటీ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడినట్టు తెలిపారు.

రాచకొండ పరిధిలో డ్రగ్స్, కల్తీ విత్తనాలను సరఫరా చేసే ముఠాలను ఉక్కుపాదంతో అణచివేయాలని కోరారు. సీసీఎస్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. రాచకొండ పరిధిలో దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర ముఠాలను పట్టుకోవాలని, ఎటువంటి దొంగతనాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఇళ్లలో లేని సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మరింతగా ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, ఏసీపీ ఐటీ సెల్ నరేందర్ గౌడ్, ఏసీపీ రమేష్, ఏసీపీ కృష్ణయ్య, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన





నవతెలంగాణ-నాగోల్

రాబోయే వినాయక చవితి సందర్భంగా నాగోలు చెరువు కొలనులో నిమర్జన కార్యక్రమ ఏర్పాట్లను నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ గురువారం జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాగోలు పరిసర ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చే గణపతుల విగ్రహాల నిమర్జనానికి సంబంధించిన ఏర్పాట్ల కొలను చెరువులో పరిశీలించినట్టు తెలిపారు. రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, విద్యుత్ వైర్ల పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అదేవిధంగా వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని డివిజన్‌లో పలు కాలనీలలో పాడైపోయిన వీధి దీపాలను గుర్తించి.. వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు కూడా ఉత్పన్నం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. ఈ పరిశీలనలో ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్, నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ సుధీర్ కృష్ణ, జీహెచ్‌ఎంసీ ఈఈ రమేష్, ఏఈ రాకేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్, నరేందర్, నవీన్ కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఐటీలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు'





నవతెలంగాణ-పెద్దఅంబర్‌పేట్

ఆధునిక సాంకేతిక విద్యతో ఐటీలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు అని సారంపూడి. శ్రీకాంత్, జనరల్ మేనేజర్, హెచ్‌ఆర్, రీజినల్ హెడ్, హ్యూమన్ రిసోర్సెస్(టీ.సి.ఎస్.) అన్నారు. శ్రేయస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) లో 14వ ఓరియెంటేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై విద్య ప్రస్థానంలో ఇప్పటివారికి ఒకలా ఇక నుండి వేరుగా కొనసాగనుందంటూ తెలిపారు. సమన్వయంతో చుట్టూ వచ్చే మార్పులను పరిగణలోకి తీసుకోవాలని సూచిస్తూ.. లైఫ్ స్కిల్స్ ఎంత ముఖ్యమో నిజాయితీ గల జీవితం కూడా అంతే ముఖ్యమని సూచించారు. అనంతరం కళాశాల వైస్ చైర్మెన్ అనంతుల హ్రిదయ రెడ్డి మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక విద్యతో ఐటీలో ఉన్నత శిఖరాలను అధిరోహించవొచ్చు అని అన్నారు. అందుకు శ్రేయాస్ కళాశాల ఉన్నతమైన వేదికగా గత 13 సవత్సరాలుగా రాణిస్తున్నందుకు గర్విస్తున్నాం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కే సాగర్ మాట్లాడుతూ గత సంవత్సరం అత్యధికంగా 18 లక్షల ప్యాకేజీతో ప్లేసెమెంట్ సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ చింతల రవీంద్రనాథ్ యాదవ్, చైర్మెన్ అనంతుల వినయ్ కుమార్ రెడ్డి, ఎచ్ఓ డీలు, ఇతర సిబ్బంది, విద్యార్థుల తల్లీదండ్రులు పాల్గొన్నారు.

రేపటి సమాజ రథ సారథులు ఉపాధ్యాయులే

- లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ 320 ఏ డా.డి.కోటేశ్వరరావు

నవతెలంగాణ-సిటీబ్యూరో

రేపటి సమాజ సారథులను తయారు చేసేది ఉపాధ్యాయులే అని లయన్స్ జిల్లా గవర్నర్ 320 ఎ డా. డి.కోటేశ్వరరావు అన్నారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్వెస్ట్ ఆధ్వర్యంలో జిల్లా లయన్స్ క్వెస్ట్ చైర్ పర్సన్ వి.మాధవరావు శ్రీ భవిష్య ఇంటర్నేషనల్ స్కూల్ హస్తినాపురంలో 30 మంది టీచర్లకు 2 రోజులు ఉచితంగా టీచర్ ట్రైనింగ్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జి. మహేంద్ర కుమార్ రెడ్డి ప్రారంభించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. డి.కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో అత్యున్నత స్థానం ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయుడు విద్యార్థుల జీవితాలను మార్చగల శక్తివంతమైన వ్యక్తి అన్నారు. అందుకే, వారి ప్రవర్తన, వారి పాత్ర, మంచి ఉపాధ్యాయుడుగా ఉండడానికే ఈ వర్క్ షాప్ అని అన్నారు. ఉపాధ్యాయుడు కేవలం జ్ఞానాన్ని ఇచ్చే వ్యక్తి కాదని, ఈ ప్రపంచానికే ఆదర్శవంతమైన మార్గదర్శకుడని తెలిపారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగడం ద్వారా వారిలో నమ్మకం పెరుగుతుందని చెప్పారు. మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జి. మహేంద్ర కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రేమించాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రత్యేకమైని, వారిని వ్యక్తిగతంగా గుర్తించి, వారికి ప్రోత్సాహం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఒక రోల్ మోడల్ అన్నారు. విషయావగాహనతో పాటు విలువలు కూడా నేర్పించాలన్నారు. నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయుడు ఎల్లప్పుడూ నేర్చుకుంటూనే ఉండాలని చెప్పారు. ఫ్యాకల్టీ రేణుక కొండపల్లి ట్రైనింగ్ ఇవ్వగా విద్యార్థులకు ధైర్యాన్ని, మనఃస్థైర్యాన్ని, స్ఫూర్తిని అందించాల్సింది టీచర్లు అని అన్నారు. యాదయ్య గౌడ్, గోవింద రాజు, శివ ప్రసాద్, మోహన్ దాస్, శ్రీనివాస్ రెడ్డి, ఎమ్. శ్రీనివాస్, మైఖేల్, డా.హిప్నో పద్మా కమలాకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

నవతెలంగాణ- చంపాపేట్

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ ఘటన కంచన్బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..చంపాపేట డివిజన్ బైరామల్‌గూడకు చెందిన యాతం కృష్ణమ్మ(55) తన కుమారుని వద్ద ఉంటూ ఇళ్లల్లో పాచి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజు మాదిరిగా బుధవారం ఉదయం 5గంటల ప్రాంతంలో బైరామల్‌గూడ నుంచి ఫిసల్ బండ మీదుగా నడుచుకుంటూ చంద్రాయణగుట్ట సమీపంలోని ఫరివార్ టౌన్ షిప్‌లోకి బయలుదేరింది. మిథానీ బస్ డిపో వద్ద ప్రధాన రహదారిపై కృష్ణమ్మను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే పోలీసులు ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ ఆమె మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలి స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం బొల్లపల్లి గ్రామం. మృతురాలి కుమారుడు యాతం జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగలు అరెస్ట్

నవతెలంగాణ - చంపాపేట్

ముగ్గురు సెల్‌ఫోన్ దొంగలు అరెస్ట్ అయిన ఘటన సంతోష్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..కాలాపత్తార్కు చెందిన షేక్ ముజాహిద్ సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఆయన గత ఏప్రిల్ నెలలో ఫహాడిషరీఫ్‌లో తన బంధువుల ఇంట్లో ఫంక్షన్ ముగించుకుని బయల్దేరాడు. అనంతరం సంతోష్‌నగర్‌లోని ఇక్బాల్ కాలనీ సమీపంలో తన అల్లుడి కోసం ఎదురు చూస్తున్న సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు తన చేతిలో నుంచి మొబైల్ ఫోన్‌ను లాక్కొన్ని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా...మీర్‌పేట్ నందనవనానికి చెందిన సుధాకర్, గణేష్, సాయిలుగా గుర్తించారు. వెంటనే వారిని అరెస్టు చేసి.. ఒక ద్విచక్ర వాహనం, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

వధూవరులను ఆశీర్వదించిన పలువురు

నవతెలంగాణ-పెద్దఅంబర్‌పేట్

అంబర్‌పేట్ ఘట్కేసర్ మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ పలుగుల మాధవరెడ్డి తనయుడు పలుగుల ప్రణయ్ రెడ్డి- రమ్య రెడ్డిల వివాహాన్ని పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని వీఆర్‌సీ కన్వెన్షన్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ జడ్పీ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మాజీ శాసన సభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, ఘట్కేసర్ మాజీ ఎంపీపీలు ఏనుగు సుదర్శన్ రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, ఉప్పల్ కాంగ్రెస్ నాయకులు మందముల పరమేశ్వర్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకులు మంద



సంజీవరెడ్డి, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబీర్ అలీ, తదితరులు ఆశీర్వదించారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

- రైతు రుణమాఫీ ఒక పెద్ద మోసం
- బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి





నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని, రుణమాఫీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి యావత్ తెలంగాణ రైతాంగాన్ని మోసం చేశాడని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆరోపించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పిలుపు మేరకు.. బాలాపూర్ మండలం కార్యాలయం ఎదుట ప్రతి రైతుకూ రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. తర్వాత తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామిడి రాంరెడ్డి, పలువురు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు మాట్లాడారు. రైతులను మోసం చేసిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించిన పాపానపోలేదన్నారు. రైతులతో పెట్టుకున్న రేవంత్ రెడ్డి సర్కార్ కూడా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికల సమయంలో ప్రజలను, రైతులను నమ్మించి మోసం చేశాడని, రైతులను మోసం చేసిన ఏ ఒక్కరూ బాగుపడిన దాఖలాలు లేవన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేసిన పాపాన కాంగ్రెస్ ప్రభుత్వం పోలేదన్నారు. తప్పుడు అమీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు. మూడు విడతలుగా 2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ కేవలం నలభై శాతం రుణమాఫీ మాత్రమే అయిందని, మిగిలిన రైతులకు ఎప్పుడు మాఫీ చేస్తారని నిలదీశారు. ఆగష్టు 15 వరకు ప్రతి రైతుకూ రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తానని, చేయకుంటే రాజీనామా చేస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయకుండా ఎక్కడికి పారిపోయారని నిలదీశారు. రుణమాఫీ చేయకుండా రైతుల కంట నీరు పెట్టిస్తున్న రేవంత్ రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. గతంలో రైతుల కోసం అమలు చేసిన రైతు బంధు పథకం ఎక్కడకు పోయిందని మండిపడ్డారు.

రైతులు కేసీఆర్ పాలనలో రాజులు..కాంగ్రెస్ పాలనలో బిచ్చగాళ్లు...

కాంగ్రెస్ పార్టీని నమ్మి రైతులు ఓట్లు వేస్తే, రైతు బంధు రాకపోగా, రుణమాఫీ కూడా కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో రాజులుగా బతికిన రైతులు..కాంగ్రెస్ పాలనలో ఒక బిచ్చగాళ్లుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రైతుకూ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, లేనిచో కాంగ్రెస్ పార్టీకి రైతులు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాదర్‌గుల్ రైతు సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, యాత్తం పవన్ కుమార్ యాదవ్, ఏనుగు రాంరెడ్డి, చుక్క శివ కుమార్, నాయకులు పెద్దబావి ఆనంద్ రెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, భీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, ఎల్బాల సుదర్శన్ రెడ్డి, చిగిరింత నరసింహారెడ్డి, ఆర్కల కామేష్ రెడ్డి, హన్మంతు రావు, బీసీ సెల్ అధ్యక్షులు కే.జంగయ్య, పి.సంతోష్ కుమార్, జగాల్ రెడ్డి, జల్ పల్లి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ నాయకులు రైతులు, కార్యకర్తలు అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డల పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూత : శ్రీనివాస్



నవతెలంగాణం-నాగోల్

పేదింటి ఆడబిడ్డల పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూత ఇస్తున్నట్టు టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన మోటం గణేష్ జగదాంబల కుమార్తె మౌనిక వివాహానికి సహకారం అందించాలని కోరుతూ ఉప్పల శ్రీనివాస గప్తను మర్యాదపూర్వకంగా కలిశారు. వెంటనే స్పందించిన ఉప్పల శ్రీనివాస గుప్త..వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకుని మౌనిక వివాహానికి మంగళసూత్రం, మట్టెలు చీర, గాజులను అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహానికి సహాయ సహకారాలు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కావెలి రాములు తదితరులు పాల్గొన్నారు.

'పేదల ఇండ్లను కూల్చివేయద్దు'

- సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

పేదల ఇల్లు నిర్మాణం కోసం సర్పంచుల చొరవతో ఇంటి నిర్మాణం చేపడితే ఆ ఇండ్లను మండల రెవెన్యూ అధికారులు తప్పుడు సమాచారంతో కూల్చివేయడం సరికాదని, పేదలు నిర్మాణం చేపడుతున్న ఇండ్లను కూల్చివేయొద్దని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. గురువారం నారాయణగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ రాష్ట్ర పరిధిలో గత 70 ఏండ్ల నుండి వ్యవసాయం సాగు చేస్తూ జీవనం సాగిస్తున్న నిరుపేదల భూములను గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల నుండి బలవంతంగా లాక్కొని హెచ్ఎండీఏ వారికి కేటాయించి సొమ్ము చేసుకుందని ఆరోపించారు. ఆ భూములపై ఏ ఒక్క రైతుకు ఒక రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణమైన రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ భూములను రైతులకు అప్పగించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి చొరవతో కుల సంఘాలు, ట్రస్టుల పేరుతో నిరుపేదల భూములను బలవంతంగా లాక్కొని ట్రస్టులకు కేటాయించడం సిగ్గుచేటన్నారు. నిరుపేదల భూములను అన్యాయంగా లాక్కుంటున్న ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యేలు, నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులపై సీఎం ఉక్కు పాదం మోపాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.నిరుపేద రైతులకు భూమి దక్కేంత వరకు లేదా నష్టపరిహారం చెల్లించేంత వరకు తమ పార్టీ తరపున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంధం లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి గోవింద నాయక్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పి.జ్యోతి, నరేష్, ఏఐడబ్ల్యూటీయు రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఝాన్సీ, భానుప్రసాద్, నాయకులు పి.సంధ్యారాణి, బి.సుజాత, వి.నాగేంద్రమ్మ, జి.అఖిల, వి.శ్రీలత, సుగుణ, బి.నవీన్, ఆర్.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



స్కూల్‌లో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్

ఘట్కేసర్ మండల పరిధిలోని ఎదులాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.50 లక్షల నిధులతో నూతన భవన నిర్మాణ పనులకు టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే సుస్థిర పాలన అందుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియోజకవర్గానికి రూ.10 కోట్లు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షులు విమల మహేష్‌గౌడ్, ఘట్కేసర్ మండలాధ్యక్షులు కార్య రాజేష్, ఎదులాబాద్ గ్రామ అధ్యక్షులు శ్యామల అమర్, ఎంపీటీసీ, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన డీఈవో



నవతెలంగాణ-మేడ్చల్

గుడ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీ స్కూల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, భారతి ఫౌండేషన్ వారు సమకూర్చిన లైబ్రరీ, సమర్థన్ ట్రస్ట్ వారు సమకూర్చిన ఆర్‌వో వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి విజయా కుమారి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా.ఎ రంగాచారి, భారతి ఫౌండేషన్ కోఆర్డినేటర్ సతీష్, రోటరీ క్లబ్ కంప్యూటర్ బోధకురాలు హరిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివారు గ్రామాలను వేరు చేయొద్దు

- మంత్రుల సబ్ కమిటీ ముందు ప్రతిపాదనలు పెట్టిన వజ్రేష్ యాదవ్
- సుముఖత వ్యక్తం చేసిన మంత్రుల సబ్ కమిటీ
- మున్సిపాలిటీలలో శివారు గ్రామాలను కలపాలని కలెక్టర్‌కు ఆదేశాలు



నవతెలంగాణ-బోడుప్పల్

అవుటర్ రింగ్ రోడ్డు వెలుపల ఉన్న మేడ్చల్ జిల్లా పరిధిలోని గ్రామాలను వేరు చేయకుండా పాత మున్సిపాలిటీలలో కలపాలని కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మంత్రుల సబ్ కమిటీ ముందు ప్రతిపాదన పెట్టారు. ఈ మేరకు గురువారం జీహెచ్ఎంసీలో గ్రామాల విలీనంపై మంత్రుల సబ్ కమిటీ సమావేశం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో సబ్ కమిటీ చైర్మెన్ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మంత్రుల సబ్ కమిటీ సభ్యులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర బీసీ సంక్షేమం, ఆర్టీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అంకుషాపూర్, అవుషాపూర్, మాధారం గ్రామాలను ఘట్కేసర్ మున్సిపాలిటీలో విలీనం చేయాల ని, కీసర మండల పరిధిలోని బోగారం, అంకిరెడ్డిపల్లి గ్రామాలను నాగారం మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రతిపాదన చేశారు. దీంతో మంత్రుల సబ్ కమిటీ ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు వజ్రేష్ యాదవ్ ప్రతిపాదించిన గ్రామాలను ఆయా మున్సిపాలిటీలలో విలీనం అయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

విద్యుత్ తీగలపై భారీ చెట్టు కొమ్మలు..

- గాలికి వైర్ల తాకిడితో నిప్పురవ్వలు
- షార్ట్ సర్క్యూట్ భయంతో స్థానికులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

11కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లపై భారీ చెట్టుకొమ్మలు పడడంతో విపరీతమైన ఈదురు గాలులతో వైర్ల తాకిడికి నిప్పురవ్వలు పడుతున్నాయని, ఎప్పుడు షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరుగుతుందోనని భయంతో బతుకుతున్నామని వినాయక నగర్ డివిజన్‌లోని వీధి నెంబర్ 14వ లైన్‌లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ.. వర్షా కాలం కావడంతో చిరుగాలులకే ఎగిరిపోయే ఇంటి రేకులు, మరోపక్క ఇంటిపై గుదిబండల 11కేవీ హై టెన్షన్ విద్యుత్ తీగలు వెళ్ళటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. విద్యుత్ తీగలపై భారీ చెట్టుకొమ్మలు పడి ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు చెట్టు కొమ్మలకు తాకడంతో నిప్పురవ్వలు వెదజల్లుతున్నాయని వాపోయారు. సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులతో పాటు ఏఈకి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని స్థానిక లీడర్ల దగ్గరికి తిరిగితే కాలయాపన చేస్తున్నారని వాపోయారు. సమస్యను ఎవరికి చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇపట్టికైనా వినాయక్ నగర్ విధి నెంబర్ 14లోని సమస్యలను కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి విద్యుత్ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.

వివాహానికి హాజరైన నాయకులు



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ పలుగుల మాధవరెడ్డి తనయుడు పలుగుల ప్రణయ్ రెడ్డి వివాహం రమ్యరెడ్డితో పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని వీఆర్‌సీ కన్వెన్షన్‌లో గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ జడ్పీ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, ఘట్కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, ఉప్పల్ కాంగ్రెస్ నాయకులు మందముల పరమేశ్వర్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకులు మంద సంజీవరెడ్డి, ఘట్కేసర్, పోచారం మున్సిపల్‌లు, పీర్జాదిగూడ, బోడుప్పల్ కార్పొరేషన్ల కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబీర్ అలీ, ఆయా పార్టీల నాయకులు, అధికారులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి భూ సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉప్పల్

రాష్ట్రంలో రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి భూ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ అసోసియేట్ నాయకులు డాక్టర్ రాజారామ్, వెంకటయ్య, అశోక్, కె. రాజేందర్‌లు అన్నారు. బుధవారం ఉప్పల్‌లో రాపోలు రాములు ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ రికార్డు బిల్లు 2024 పై జరిగిన చర్చ వేదికలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు.

1) తెలంగాణ రికార్డు ఆఫ్ రైట్స్ బిల్-2024 అని ఉంది. దీనికి రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్-2024 అని ఉండాలి.
2) ఆన్‌లైన్ పోర్టల్ పేరు 'భూ మాత' లేదా 'భూ భారతి" అని పేరు పెట్టాలి.
3) భూ సమస్యలపై జిల్లా స్థాయిల్లో రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి, కలెక్టర్ తర్వాత ట్రిబ్యునల్‌కు అధికారం ఉండాలి.
4) భూమి సమస్య పరిష్కారాలకు నిర్ణీత గడువు తప్పనిసరి చేయాలి. అధికారులకు 90 రోజులు లేదా 120 రోజులలో పరిష్కారాలు చూపాలి.
5)రికార్డుల ఎంట్రీకి సంబంధించి సివిల్ కోర్టుకు ఇచ్చిన అధికారాలను తొలగించి ట్రిబ్యునల్‌లకు అధికారాలు ఇవ్వాలి.
6)రికార్డులలో తప్పులు దొర్లితే సరిదిద్దే అధికారం తహశీల్దార్లకు ఇవ్వాలి.
7)ఆన్‌లైన్‌లో రికార్డ్స్ ఉండాలి. చేతి రాతలో తయారు చేయకూడదు.
8)సాదా బైనామాలకు సంబంధించి... పాతవి తహసీల్దార్ చేయాలి. దీనిని ఇప్పటి నుంచి ఆర్డీవో చేయాలి.
9) మిగులు భూములపై పరిష్కారాలు ఆర్డీవోకు ఇవ్వాలి.
10) వ్యవసాయ భూమిలో ఉన్న పశువుల కొట్టాలు, చేపలు చెరువుల భూములను వ్యవసాయ భూమిగానే చూడాలి.
11) అబాది (గ్రామకంఠం) భూములను కొలతలు చేయాలి.
12) గ్రామ లెక్కలు రాయడానికి వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
13) భూముల సర్వేకు నిపుణులతో సర్వే వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
14) భూదార్ కార్డు ఇచ్చేటప్పుడు పట్టదార్ పాస్ పుస్తకానికి ఉన్న నెంబర్‌నే యూనిక్ నెంబర్‌గా ఇవ్వాలని చర్చించారు. ఈ చర్చలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు డా.పి.రాజారాం. బి. వెంకటయ్య. వి.అశోక్, కే. రాజేందర్. రిటైర్డు తహశీల్దార్ బాలరాజు, అసోసియేట్ సభ్యులు రాపోలు రాములు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన కిరణ్ గుత్తికొండ



నవతెలంగాణ-నేరేడ్ మెట్

చిరంజీవిపై అభిమానంతో ఆయన పుట్టినరోజు నాడు వివాహం చేసుకోవాలని వధూవరులు కోరగా వారి కోరిక మేరకు గురువారం సైదాబాద్‌లోని ఆర్య సమాజ్ లో రూపాయి ఫౌండేషన్ ఫౌండర్ నాగమల్ల అనిల్ కుమార్ అనాథలైన జ్యోతి, పవన్ కుమార్‌ల వివాహాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వివాహానికి మల్కాజిగిరికి చెందిన టీవీహెచ్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించా రు. ఈ కార్యక్రమంలో టీవీహెచ్ఎస్ఎస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు మెరుగు శివకృష్ణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



- నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు జరిమానా
- ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు
- ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ లక్ష్మి మాధవి

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ ట్రాఫిక్ జోనల్ డీసీపీ మనోహర్ ఆదేశాల మేరకు గురువారం ఉప్పల్ రింగ్ రోడ్డులో ఉప్పల్ ట్రాఫిక్ సీఐ లక్ష్మిమాధవి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఏసీపీ శ్రీనివాస్ హాజరై స్పెషల్ డ్రైవ్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ డ్రైవ్‌లో సుమారు 92 వాహనాలను తనిఖీ చేసి పత్రాలు సరిగ్గా లేని వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్, సీఐ లక్ష్మి మాధవి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్ సరిగ్గా లేకుంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఆర్సీ, ఇతర వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమం ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరసనకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు





కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసనకు బయలు దేరుతున్న మైనంపల్లి హనుమంతరావు

నవతెలంగాణ-నేరేడ్ మెట్

అదానీ కుంభకోణాన్ని కేంద్ర ప్రభుత్వం కప్పిపుచ్చడానికి చేస్తున్న ప్రయత్నాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పీసీసీ ఆధ్వర్యంలో గన్ పార్క్, అమరవీరుల స్థూపం నుంచి ఈడీ కార్యాలయం వరకు నిర్వహించిన నిరసనకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నక్క ప్రభాకర్ గౌడ్, జీఎన్‌వీ. సతీష్ కుమార్, వెంకటేష్ యాదవ్, కె చెన్నారెడ్డి, వినోద్ యాదవ్, జీడీ. సంపత్ గౌడ్, నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, తదితరులున్నారు.



నిరసనలో పాల్గొన్న మైనంపల్లి హనుమంతరావు, తదితరులు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన రాగం అర్జున్

నవతెలంగాణ-మేడ్చల్

బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఇటీవల నియమితులైన రాగం అర్జున్ గురువారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కార్యవర్గంలో తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.విక్రమ్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. మేడ్చల్ మండల పరిధిలోని మారుమూల గ్రామమైన గిర్మాపూర్‌కు చెందిన తనకు గ్రామస్థాయి కార్యకర్త నుండి రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగేందుకు అవకాశం కల్పించిన పార్టీకి ఎల్లవేళలా రుణపడి ఉంటానని తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయి బాధ్యతలు ఇచ్చిన పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కష్టపడి పని చేస్తానన్నారు.



మహా రథోత్సవంలో పాల్గొన్న ఎంపీ, కార్పొరేటర్ క్యానం



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మల్కాజిగిరిలోని శ్రీ మంత్రాలయ రాఘేంద్రస్వామి దేవాలయంలో 353 వ ఆరాధన మహోత్సవ సందర్భంగా గురువారం నిర్వహించిన మహా రథోత్సవంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథం ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి జీడి బాలచందర్ గౌడ్, బీజేపీ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, సాయి సురేష్, శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్ డంపింగ్ యార్డుపై పర్యవేక్షణ ఉండాలి

నవతెలంగాణ-కాప్రా

ఆదర్శనగర్ డంపింగ్ యార్డు నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆదర్శనగర్ డంపింగ్ యార్డు నిర్వహణపై డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, సర్కిల్ ఏఎమ్ఓహెచ్ డాక్టర్ లావణ్య చర్లపల్లి కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛ ఆటో వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనాల సంఖ్యను పెంచాలన్నారు. ఆదర్శనగర్ డంపింగ్ యార్డు మెకానిజంను అన్ని విధాలుగా ఆధునికరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రామ్కీ సంస్థ ప్రతినిధులకు స్పష్టం చేశారు. రామ్కీ సంస్థ వాహనాల పెంపు, ఆదర్శనగర్ డంపింగ్ యార్డు నిర్వహణపై వారం రోజుల వ్యవధిలో సమూల మార్పులు జరగాలని జీహెచ్ఎంసీ అధికారులను, రాంకీ సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ ప్రతినిధులు, నాయకులు కాసం మైపాల్ రెడ్డి, ఎంపల్లి పద్మారెడ్డి, బైరి నవీన్ గౌడ్, కుమారస్వామి, గంప కృష్ణ, ఎస్. ఏ రహీం, కొండూరి మురళి పంతులు, సారా అనిల్ ముదిరాజ్, సారా వినోద్, నవీన్, నరసింహ వంశరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలి



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

నవతెలంగాణ-కాప్రా

ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం రైతులకు రుణమాఫీ చేయాలని కోరుతూ మల్లాపూర్ చౌరస్తాలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని హరీశ్ రావు పూజలు చేశారని పేర్కొన్నారు. అనంతరం మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ నుంచి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, నాయకులు మధు ముదిరాజ్, ఉల్లెం బాలరాజు, నరసింహ గౌడ్, కృష్ణ, రాజ్ కుమార్, గుమ్మడి జంపాల్ రెడ్డి, వాసుచారి, హరినాథ్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, శీనురెడ్డి, రమేష్, అంజి, చారి, బాలయ్య గౌడ్, అశోక్, బాలనరసింహ, అజయ్, మనీష్, దండెం నరేందర్ తదితరులు యాదగిగుట్టకు బయలుదేరారు.

అందరికీ రుణమాఫీ చేయాలి

- బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్

మేడ్చల్‌లో..



ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేయాలని బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మేడ్చల్‌లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ.. రుణమాఫీ పేరుతో రైతులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీల్లో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం సౌకర్యం తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఏడ్చిన వ్యవసాయం ఉండదన్న విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రహించాలని సూచించారు. రుణమాఫీ అంటూనే తెల్ల రేషన్ కార్డు లేని వారికి, ఐటీ కట్టిన వారికి రుణమాఫీ ఉండదు అంటూ మోసం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రైతుల పైన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే ఎలాంటి ఆంక్షలు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద యాదవ్,ప్రధాన కార్యదర్శి సుదర్శన్, యూత్ అధ్యక్షుడు హరత్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, పీఏసీఎస్ చైర్మెన్ రాణదీప్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు రాజమల్లారెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, గణేష్, గోపాల్ రెడ్డి, జీవన్, మహేందర్, కర్ణాకర్, నాయకులు సందీప్ గౌడ్, నడికొప్పు నాగరాజు, యునిష్ పాషా, శ్రీనివాస్ రాజు,కౌన్సిలర్లు హేమంత్ రెడ్డి, తుడుం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ మోసం

- ఘట్కేసర్ మున్సిపాలిటీలో రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా



బోడుప్పల్‌లో..

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రుణమాఫీ పేరుతో మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఘట్కేసర్ మున్సిపాలిటీలోని రైతు సహకార సంఘం బ్యాంక్ ఎదుట రైతులతో కలిసి గురువారం ధర్నా చేశారు. ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, బోడుప్పల్ అధ్యక్షులు మందా సంజీవరెడ్డి, పీర్జాదిగూడ నాయకులు, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, ఘట్కేసర్ మండల అధ్యక్షులు నాగులపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, రైతు సహకార సంఘం డైరెక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, మాజీ రైతు సహకార సంఘం చైర్మెన్ డొంకెని భిక్షపతి గౌడ్, జావీద్ ఖాన్, శ్రీనివాస్, కిరణ్ నాయక్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు,ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శుక్రవారం | ఆగస్టు 23, 2024 | www.navatelangana.com

25న బీపీ మండల్ జయంతిని నిర్వహించాలి

- ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 25వ తేదీన బీసీ రిజర్వేషన్ పితామహుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, జాతీయ బీసీ కమిషన్ చైర్మెన్ భిందేశ్వర ప్రసాద్ మండల్ (బీపీ మండల్) జయంతిని బీసీలు, బహుజనులందరూ వాడవాడల ఘనంగా నిర్వహించాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. 25న ఎల్బీనగర్‌లోని యశోద నగర్ కాలనీలోని ప్రజా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉదయం 10 గంటలకు బీపీ మండల్ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

నిత్య పూలమాల కార్యక్రమం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు నిత్యపూల మాల కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి అవిజే జేమ్స్ డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ యొక్క భవనం ఫౌండర్ చే ఈ నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచింటి అంజన్న, విజయలక్ష్మి ఆధ్వర్యంలో.. 100 రోజులు పాటు కొనసాగుతుందని, 100వ రోజు భారీ బహిరంగ ఉంటుందన్నారు. ఆ సభలో భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చమని అలా చేయని పక్షంలో అమర నిరాహార దీక్షకు దిగుతామని తెలియజేస్తూ... ఈ నిరసన కార్యక్రమాన్ని మొదలుపెట్టడం జరిగిందన్నారు.

పల్లె పోరుకు సన్నద్ధం

- పంచాయతీ ఓటరు జాబితాపై ఎస్ఈసీ దృష్టి
- ప్రత్యేక షెడ్యూల్ విడుదల
- వచ్చే నెల 6 నుంచి సవరణ ప్రక్రియ



నవతెలంగాన-సిటీబ్యూరో

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) దృష్టి సారించింది. ఓటర్ల జాబితా సిద్ధం చేయాలంటూ జిల్లా పంచాయతీ అధికారులకు రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక షెడ్యూల్ ఖరారు చేసింది. వచ్చే నెల 6వ తేదీ నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభించి 21వ తేదీన పంచాయతీల్లోని వార్డుల వారీగా తుది జాబితా ప్రక టించాలని ఆదేశించింది. అయితే ఈ జాబితాను ఏ విధంగా రూపకల్పన చేయాలనే దానిపై ఇటీవల జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యద ర్శులకు శిక్షణ అందించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ లో రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు వీరికి అవగాహన కల్పించారు.

అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగానే..

అసెంబ్లీ ఓటర్ల జాబితా అనుసరించి ఈ ఏడాది ఫిబ్రవరి 20న ప్రకటించిన జాబితా ఆధారంగానే పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఈసీ ఆదేశించింది. ఎంపీడీవోలు, ఎంపీవోలు తమ పరిధిలోని గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఫొటోలతో కూడిన జాబితాలను సిద్ధం చేసే ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్చనున్నారు. కాగా ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు, ఎంపీ డీవోలు, ఎంపీవోలకు ప్రత్యేక శిక్షణ కూడా అందించారు.

ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్..

1.వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా సిద్ధం చేసి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో సెప్టెంబర్ 6న ప్రకటించాలి.

2.9వ తేదీన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు, 10న మండల స్థాయిల్లో ఎంపీడీవో లు సమావేశాలు నిర్వహించి సిద్ధం చేసిన జాబితాలను అందజే యాలి. వార్డులు, గ్రామాల వారీగా సిద్ధం చేసిన జాబితాలపై సెప్టెంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాలి.

3.గ్రామాలు, వార్డుల వారీగా అందిన అభ్యంత రాలను జిల్లా పంచాయతీ అధికారి 19వ తేదీన పరిష్కరించాలి.

4.జిల్లాలోని అన్ని వార్డులు, గ్రామ పంచాయతీల్లో సిద్ధమైన ఓటర్ల తుది జాబితాలను 21న ప్రకటించాలి.

ఈ గ్రామాల్లో ఎన్నికలు లేనట్టే..

హైదరాబాద్ నగర శివార్లలోని కొన్ని గ్రామాలతో పాటు పురపాలికలను జీహెచ్ఎంసిలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ మహానగరాన్ని మరింత విస్తరించేందుకు ఔటర్ రింగు రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాలను ముందుగా సమీన పురపాలికల్లో విలీనం చేసి ఆ తరువాత గ్రేటర్‌లో కలిపేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఇక్కడ ఓటర్ల జాబితా ప్రక్రియ చేపట్టడు లేదు. దీంతో మేడ్చల్-మల్కాజిగిరి మేడ్చల్ జిల్లాలో పంచాయతీ ఓటర్ల సంఖ్య తగ్గనుంది. పురపాలి కల్లో విలీనమయ్యే గ్రామాలు ఈ జిల్లా పరిదిలోనే అధికంగా ఉన్నాయి. జిల్లాలో 23 గ్రామాలు, ఏడు పురపాలికలను విలీనం చేస్తున్నారు. ఈ శివారు గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనంపై స్థానికంగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతున్నది. పంచాయతీల విలీనం వల్ల తమపై పన్నుల భారం పెరుగుతుం దని స్థాని కులు బావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై కొందరు న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.

మెడికల్ అధికారికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మెడికల్ అధికారి కార్తీక్‌కు సర్కిల్ ఎస్ఎఫ్ఏ పారిశు ధ్య విభాగం సిబ్బంది, స్వాగతం పలికారు. చందానగర్ సర్కిల్ నుంచి మూసాపేట్ సర్కిల్‌కు బదిలీపై వచ్చిన మెడికల్ అధికారి డాక్టర్ కార్తీక్‌ని సర్కిల్ ఎస్ఎఫ్ఏలు, పారిశుధ్య విభాగంకు సంబంధించిన సిబ్బంది అందరు కలిసి శాలువా కప్పి, పూల బొకేతో ఆహ్వానం పలికారు.

కేపీహెచ్‌బీ : మూసాపేట సర్కిల్ కార్యాలయంలో హెల్త్ ఆఫీసర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కార్తీక్‌ని గురువారం కేపీహెచ్‌బీ కాలనీ రమ్యా గ్రౌండ్ శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కలిసి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కేపీ హెచ్‌బీ కాలనీ మూడవ ఫేజ్ రమ్యా గ్రౌండ్‌లో గణేష్ మండప ప్రాంగణము అంతయు, రమ్యా గ్రౌండ్ చుట్టూ కూడా శానిటేషన్ సిబ్బంది చేత శుభ్రం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివశక్తి కల్చరల్ అసోసి యేషన్ కమిటీ సభ్యులు కట్టా నరసింగరావు, మోర్ల రామకృష్ణ, బండారుపల్లి శ్రీనివాసరావు, యలమంచిలి వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీని ఉన్నత స్థాయికి తీసుకెళ్ళాలి



- కూకట్‌పల్లి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

నవతెలంగాణ-కేపీ హెచ్‌బీ

జన సైనికులు, వీర మహిళలందరూ సమిష్టిగా తెలంగాణ రాష్ట్రంలో పనిచేసే జనసేన పార్టీని రానున్న రోజుల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్ళాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ అన్నారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కంటె స్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, శేర్లింగంపల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాలలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు చేయించిన వాలంటరీలకు ఆయన శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు 10 లక్షలు పైన జరిగిన సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో అత్యధిక సభ్యత్వాలు అయినం దుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ సిద్ధాంతాలను అధ్యక్షుడు కొణి దల పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజలకు వివరించి, సభ్యత్వం వలన పార్టీ సభ్యులకు ఇచ్చే బీమా భరోసా, రాబోయే రోజులలో పార్టీ యొక్క భవిష్యత్తును గురించి వివరించి సభ్యులను నమోదు చేయించిన వాలంటరీలం దరికి అభినందనలు తెలిపారు.

తల్లిని హత్య చేసిన కసాయి కొడుకు

- గంజాయి మత్తులో పెంచిన తల్లిని కడతేర్చిన కిరాతకుడు
- మగ సంతానం కావాలని పెంచుకుంటే, చంపేసిన వైనం



నిందితుడు వేణు



మృతురాలు పెద్ది జయమ్మ

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గంజాయి మత్తులో పెంచిన తల్లిని కడతేర్చిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఐదుగురు ఆడపిల్లలు పుట్టిన అనంతరం మగ సంతానం కోసం చేరదీసి పెంచుకుంటున్న ఆ కొడుకే ఆ తల్లి పాలిట కాలయముడిగా మారా డు. గంజాయికి బానిసై ఆ మత్తులో డబ్బుల కోసం పెంపుడు తల్లిని కడతెర్చిన ఓ కిరాతక కొడుకు ఘటన కుత్బుల్లాపూర్ గ్రామం హరిజన బస్తీలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి జలమండలిలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పెద్ది స్వామి, భార్య పెద్ది జయమ్మ (64)లకు ఐదుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. మగ సంతానం కావాల ని... బంధువుల నుంచి మూడు నెలల ఉన్నప్పుడే వేణు (నిందితుడు) అనే ఓ మగ పిల్లవాడిని తెచ్చుకొని, సుమా రు 32 సంవత్సరాలు పెంచి పోషించి వివాహం కూడా చేశారు. వేణుని తెచ్చుకొని పెంచుకున్న సుమారు నాలుగు సంవత్సరాల అనంతరం స్వామి, జయమ్మలకు వినోద్ (24) జన్మించాడు.

వేణు గంజాయికి బానిసై డబ్బు కోసం...

నిందితుడు వేణు (32) పని పాట లేక జులాయిగా తిరుగుతూ... గంజాయికి బానిసై నిత్యం తల్లిదండ్రులు, భార్యతో గొడవపడేవాడు. అతని ప్రవర్తన భరించలేక సుమారు 8 నెలల క్రితం అతని భార్య ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్ళిపోయింది. అయినా తీరు మార్చుకొని వేణు నిత్యం తాగి వచ్చి డబ్బుల కోసం తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన సెల్ ఫోన్‌ను తాకట్టు పెట్టి గంజాయి సేవించి, ఇంటికి వచ్చి అదనపు డబ్బు కోసం తల్లిని వేధించాడు. ఈ క్రమంలోనే తల్లి కొడుకుల మధ్య గొడవ జరిగినట్లు... గంజాయి మత్తులో తల్లిని విచక్షణ రహితంగా కొట్టి నుదుటిపై పదునైన పరికరంతో పొడిచి కడతెర్చినట్టు తెలుస్తుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని...మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

18 నెలల క్రితం అదృశ్యమైన సొంత కొడుకు వినోద్

స్వామి, జయమ్మల సొంత కొడుకు వినోద్ (24), సుమారు 18 నెలల క్రితం ఇంటి నుంచి అదృశ్యమయ్యా డు. అదే విషయంపై వారు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే ప్రస్తుతం చోటు చేసుకున్న సంఘటన తో వినోద్‌ను కూడా వేణు ఏమైనా చేసి ఉన్నాడా...? అనే అనుమానాలను కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు కూడా వ్యక్తం చేస్తున్నారు.

ఈడీ కార్యాలయం ముట్టడికి తరలిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-దుండిగల్

ఏఐసీసీ పిలుపు మేరకు అదానీ మెగా కుంభకోణం పై జాయింట్ పార్లమెంటరీ కమిషన్(జెపిసి) వేసి విచారణ జరిపించి.. దోషులను చట్టపరంగా శిక్షించి అదే విధంగా సెబి చైర్మెన్ వెంటనే రాజీనామా చేయా లని డిమాండ్ చేస్తూ ... గురువారం తలపెట్టిన ఈడి కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్య ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ, మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకు లతో కలిసి ముట్టడి కార్యక్రమానికి కుత్బుల్లా పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి నేతృత్వం లో... కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి అనేక మంది కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లొ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతి రెడ్డి, జ్యోత్స్న శివారెడ్డి, పున్నా రెడ్డి ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజవర్గం నుంచి డివిజన్ నాయకు లు, ఎన్ఎస్ఐయుఐ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ట్రపసా కుత్బుల్లాపూర్ నూతన కమిటీ నియామకం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్

తెలంగాణ గుర్తింపు పొందిన అఫర్డబుల్ ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ (ట్రపసా)గ్రేటర్ కుత్బుల్లాపూర్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఈ మేరకు రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్‌లోని బ్రైట్ కాన్సెప్ట్ పాఠశాలలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సుమారు 50 పాఠశాలల కరస్పాండెంట్లు వివిధ సమస్యల పై కూలం కషంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువు రు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్‌లో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల సంఘాలు కొందరు వ్యక్తుల కోసమే పని చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల యాజ మాన్యాల ప్రయోజనాల కంటే వ్యక్తుల స్వప్రయోజనాలే పరమావధిగా సంఘాలు పనిచేస్తున్నా యని అభిప్రాయ పడ్డారు. ఇది ఏ ఒక్కరికి మంచిది కాదని ఈ పద్ధతులు మారాల్సిన అవసరం పలువురు తమ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వ్యక్తి భజనలతో సంబంధం లేకుండా కేవలం పాఠశాలల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కలిసికట్టుగా ఉండేలా కొత్త సంఘాన్ని ముందుకు తీసుక పోదామని కరస్పాండెంట్లు నిర్ణయానికి వచ్చారు. కొత్త సంఘం పాఠశాలల అభ్యున్నతి, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఇందుకు తగిన మార్గదర్శకాలను రూపొందించుకుందామని తీర్మానం చేశారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు.



నూతన అధ్యక్షులుగా వినోద్ జాదవ్...

తెలంగాణ గుర్తింపు పొందిన అఫర్డబుల్ ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ గ్రేటర్ కుత్బుల్లాపూర్ అధ్యక్షులుగా వినోద్ జాదవ్, చైర్మెన్‌గా కొల వెంకటేష్ ముదిరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దయాకర్, కోశాధికారిగా శ్రీశైలంలు ఎన్నికయ్యారు. త్వరలోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల కరస్పాండెంట్లు బిర్రు ఆంజనేయులు, కాసర్ల గిరి,నరసింహులు, నందా రెడ్డి, భూపాల్ రెడ్డి, స్వరూప్ రెడ్డి, చేప్యాల నరసింహులు గౌడ్, ప్రవీణ్ రెడ్డి, సొంటిరెడ్డి పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో బీబీఏ (డేటా అనలిటిక్స్),(రెగ్యులర్) కార్యక్రమంపై అవగాహన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో.. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (డేటా అనలిటిక్స్), బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (రెగ్యులర్) కార్యక్రమాల ప్రారంభో త్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి విశ్వవిద్యాలయ రెక్టర్ డాక్టర్ కే. విజయ కుమార్ రెడ్డి హాజరై విద్యార్థులు స్వీయ-శ్రమ, నైతిక, సామాజిక విలువలు, సమయం, డబ్బు, ఇతర వనరులను ఉత్తమంగా ఉపయోగించుకోవడం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. యూసీఎంహెచ్ ప్రిన్సిపాల్ ప్రొఫెస ర్ సింధు, సంస్థ యొక్క ప్రయాణాన్ని సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ స్టడీస్ నుంచి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, తదనంతరం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్ మెంట్ హైదరాబాద్ వరకు ఎలా మారిందో వివరించారు. కోర్సు పాఠ్యాంశం, బోధనా విధానం, పరీక్షా ర్యాంకింగ్ విధానం మొదలైనవాటిపై వివరాలు ఇచ్చారు. క్యాంపస్‌లో జరిగే వివిధ సహ-పాఠ్య సహాయ కార్యక్రమా ల గురించి కూడా చర్చించారు. సుమారు 72 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. యూసీ ఎంహెచ్ బోధనా, బోధనేతర సిబ్బంది, ఎంబిఎ. బిబిఎ సీనియర్ విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొ న్నారు. యూసీఎంహెచ్ తరఫున అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. సంతోష్ కుమారి కృతజ్ఞతలు తెలిపారు.

వివాహ వేడుకల్లో మేయర్ దంపతులు



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన నాగరాజు యాదవ్ కోడలి వివాహానికి మేయర్ దంపతులు కోలన్ నీలా గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీ కోలన్ గోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా, అలాగే కాంగ్రెస్ నాయకులు సీనియర్ నాయకు లు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్ రెడ్డి, ఆవుల పావని జగన్ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, తలారి సాయి ముదిరాజ్, తులసి అశోక్, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండ రామ్‌ను కలిసిన నాయకులు



నవతెలంగాన-సిటీబ్యూరో

శాసనమండలి సభ్యులు ప్రొ.కోదండరాంను కలిసి ఉద్యమ అభినం దనలు తెలుపుతున్న ఉద్యమ సంఘం, తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరే షన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, పూర్వ అధ్యక్షులు జె.కైలాసం, మేడ్చల్ జిల్లా గౌరవాధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు, అధ్యక్షులు ఉరెల్ల విఠల్, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రఘునం దన్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి మొగలయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బి. నాగేశ్వర రావు, మేడ్చల్ జిల్లా బాధ్యులు రూహి, రామయ్య, తదితరులు కలిశారు. ఈ సందర్భంగా టి యు టి ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా శాఖ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్‌సీలను వెంటనే ఇప్పించాలని, 317 ద్వారా ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలని, ఉమ్మడి జిల్లాలో జరిగిన అంతర బదిలీల ఉపాధ్యాయులకు సర్వీస్ ప్రొటెక్షన్ ఇప్పించాలని, ఈ విషయంపై ముఖ్య మంత్రితో మాట్లాడి ఒప్పించి న్యాయం చేయాలని కోరినట్టు తెలిపారు.

డ్రయినేజీ సమస్యను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీ 4వ ఫేజ్‌లో నెలకొన్న డ్రయినేజీ సమస్యలపై కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకులు గాదె శివ చౌదరి, బచ్చు మల్లిలు గురువారం పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా గత నెల రోజులుగా డ్రయినేజీ నీరు 4వ ఫేజ్‌లో మసీదు బ్యాక్ సైడ్ గల్లీలో వరదగా పారుతుందని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం బి బ్లాక్ మహిళా ప్రెసిడెంట్ సంధ్యారాణి, ఎస్సీ, ఎస్టీ ప్రెసిడెంట్ బాబ్జీ కుమార్‌లు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన ఆదేశాల మేరకు కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకులు గాదె శివ చౌదరి, బచ్చు మల్లిలు స్పందించి, పరిశీలించారు. ఈ సందర్భం గా స్థానికులు మాట్లాడుతూ.. వర్షాలు, దోమల కారణంగా ఇప్పటికే విష జ్వరాలతో బాధపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే దుర్వాసనతో ఇంకా భయాందోళనలకు గురవుతున్నామన్నారు. దీంతో జీహెచ్ఎంసీ అధికా రుల దృష్టికి తీసుకెళ్ళి, సమస్యను అరగంటలో పరిష్కరించారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించారు.



మూసాపేట్ మైసమ్మ చెరువులో ఎట్టకేలకు పేరుకుపోయిన గుర్రపు డెక్కకు మోక్షం లభించి.. స్థానికులకు దోమల బెడద తగ్గనుందని మూసాపేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ బీజేపీ గత 2 నెలలుగా జీహెచ్ఎంసీ అధికారుల పై పోరాటంతో.. ఎట్టకేలకు మైసమ్మ చెరువులో జీహెచ్ఎంసీ గుర్రపు డెక్కను తొలగిస్తున్నారని, తెలిసి బీజేపీ సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్, పోలాకి కిషోర్, సాయి, అబ్బాస్, వెంకటేష్‌లతో వెళ్లి పరిశీలించారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

దోషులు ఎంతటి వారైనా శిక్షించాలి : లెనిన్ గువేరా



నవతెలంగాణ మెహదీపట్నం.

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారం ఘటనను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాంపల్లి మల్లెపల్లి ఐటీఐ కాలేజీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా మాట్లాడుతూ దేశంలో అమ్మాయిలు అన్ని రంగాల్లో ముందుకెళ్తున్న క్రమంలో ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరమన్నారు. దోషులు ఎంతటి వారైనా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్, పవన్, విఘ్నేష్ , మధు తదితరులు పాల్గొన్నారు.

బీసీ న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా బత్తుల కష్ణ



నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీ న్యాయవాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా హైకోర్టు న్యాయవాది బత్తుల కష్ణ నియామకమయ్యారు. గురువారం విద్యానగర్ బీసీ భవన్ లో న్యాయవాదుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కష్ణయ్య చేతుల మీదగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బత్తుల కష్ణ మాట్లాడుతూ బీసీల సమస్యల సాధనకు నిరంతరం కషి చేస్తానని తెలిపారు. న్యాయవాదుల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, సోషల్ మీడియా ఫోరం అధ్యక్షులు వేద్ ప్రకాష్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షులు వినోద్ కుమార్,బీసీ యువజన సంఘం అధ్యక్షులు నీలా వెంకటేష్,బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు అనంతయ్య, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకష్ణ, రాజేందర్, రాందేవ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిరక్షించడానికి బల్దియా సిబంది కృషిచేయాలి

- జీహెచ్ఎంసీ ఆరోగ్య విభాగం అదనపు కమిషనర్ పంకజ
- మీరాలం ట్యాంక్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ - ధూల్ పేట్

చెరువులను పరిరక్షించడానికి బల్దియా సిబంది కృషిచేయాలని జీహెచ్ఎంసీ ఆరోగ్య విభాగం అదనపు కమిషనర్ పంకజ అన్నారు. గురువారం ఆమె మీరాలం ట్యాంక్ ను సందర్శించి, చెరువులో గుర్రపు డెక్కల ఆకును తొలగిస్తున్న మిషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెరువు పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. చెరువులో నుండి తీసివేసిన వ్యర్థాలను వెంటనే లిఫ్టింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. మిరాలం ట్యాంక్ సుందరీకరణలో భాగంగా నిర్దేశించిన సమయంలో వ్యర్థాలను తొలిగించాలన్నారు. వ్యర్థాలను తొలిగించి ఎంటమూలజీ సిబందితో ట్యాంక్ అంచులలో స్ప్రే చేయాలని చార్మినార్ జోన్ మలేరియా సీనియర్ ఎంటమాలాజిస్ట్ శ్రీనివాస్ ను ఆదేశించారు. ఎక్కడ నిర్లక్ష్యం చేయకూడదని, పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఏఈ ఉదయ్ కుమార్, ఈవీడీఎం సిబంది, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తున్నది



- మాజీ ఎంపీ వీహెచ్

నవతెలంగాణ-అంబర్‌పేట:

బీజేపీ, మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసి దేశ సంపదలను ఆదాని అంబానీలకు అక్రమంగా కట్టబెడుతున్నదనిమాజీ ఎంపీ వీ హనుమంతరావు అన్నారు. టీపీసీసీ ఆధ్వర్యంలో గన్ పార్క్ నుంచి ఈడి కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ సీబీఐ ఈడి ఐటీ రాజ్యాంగ సంస్థలను ఉపయోగించుకుంటూ ప్రతిపక్ష పార్టీలను కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ మెగా కుంభకోణం పై విచారణ జరపాలని, సెబీ చైర్మెన్ అక్రమాలపై జేపీసీ వేయాలి, సెబీ చైర్మెన్ రాజీనామా చేయాలని, దోషులకు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, పీసీసీ కార్యదర్శి అప్సర్ యూసుఫ్ జైహి, లకుపతి యాదగిరి గౌడ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కష్ణ గౌడ్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు యాసిని షరీఫ్, నల్లకుంట డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, చందు పటేల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ ర్యాలీ, ధర్నాలో వక్తలు



నవతెలంగాణ - ముషీరాబాద్

గ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను, రైతులకు ప్రకటించిన రుణమాఫీని అర్హులైనంద వారందరికీ ఇవ్వాలని, రైతు భరోసా నిధులను విడుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల అమలులో జరుగుతున్న తాత్సారాన్ని నివారించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కెచ్చేల రంగయ్య అధ్యక్షతన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ నుంచి ఇందిరా పార్క్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ప్రజాస్వామిక వాది ప్రొఫెసర్ హరగోపాల్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో ప్రజాస్వామిక విలువలు ఉండాలని, ప్రజల కోరికలను ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన బాధ్యత ఉందన్నారు. అనేక వాగ్దానాలను చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలుచేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. దేశంలో, రాష్ట్రంలో అసమానతలు పెరిగిపోయాయని, వ్యవసాయ రంగం కునారిల్లిపోతూ, రోజు రోజుకి సంక్షోభంలోకి వెళుతున్నదని అన్నారు. ఈ క్రమంలో రైతులకు గిట్టుబాటు ధరతో పాటు వారు వ్యవసాయాన్ని చేసుకోవడానికి కావలసిన వనరులను సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులకు రుణమాఫీతో పాటు, రైతు భరోసా, సబ్సిడీతో విత్తనాలను సకాలంలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ. గత ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కులను కాలరాసిందని, ప్రశ్నించే హక్కును, మాట్లాడే హక్కును నిరోధించిందన్నారు. రైతులకు రుణమాఫీ 10 సంవత్సరాల కాలంలో రెండుసార్లు చేసి రైతులకు చాలా చేశామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచితం తప్ప వేటిని అమలు చేయకపోవడం అభ్యంతరకరమైనది ఆక్షేపణీయమైనదన్నారు. రైతు పంటకు గిట్టుబాటు ధర కాకుండా బోనస్‌గా ఇస్తానని ఇవ్వలేదన్నారు. అలాగే కేవలం 40 శాతం మాత్రమే రుణమాఫీ చేయడం దేనికి నిదర్శనం అని ప్రశ్నించారు.

విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ చేయలేదని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని తెలిపారు. నిరుద్యోగ సైన్యం పెరిగిపోతూ అనేకమైన దురలవాట్లకి, తప్పుడు దోవలో వెళ్లే విధంగా పరిణామాలు ఉద్భవించాయన్నారు. ఇది రాష్ట్ర భవిష్యత్తు కు ప్రమాద సూచిక అన్నారు. ఆటో, రిక్షా కార్మికులకు జీవన భతినీ ఇస్తానని, బీడీ కార్మికులకు జీవన భతి పెంచుతానని, పెన్షన్లను పెంచుతానని, కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తానని చెప్పిందని గుర్తు చేశారు. పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కె.జి. రామచందర్, కె.రమ్మ గుమ్మడ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ప్రదర్శనలకు అనుమతిని ఇవ్వకపోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో చెప్పాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేదలందరికీ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని ప్రజలందరూ తమ సమస్యల పరిష్కారం కోసం తమకు అందవలసిన అన్ని రకాల ప్రయోజనాల కోసం ఉద్యమించడం, సంఘటితమై పోరాటం చేయటం వల్లనే హక్కులు సాధించొచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జి వెంకటేశ్వరరావు, వి కష్ణ, వి ప్రభాకర్, చిన్న చంద్రన్న,కే సూర్యం, చంద్ర అరుణ, కష్ణ, ఎం. హనుమేష్, ఎస్. ఎల్.పద్మ సదానందం తదితరులు పాల్గొన్నారు.

‘ఉచిత టాలెంట్ హంట్ పోటీలు’



నవతెలంగాణ-హిమాయత్ నగర్

శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఇస్కాన్ కూకట్ పల్లి ఆధ్వర్యంలో ఈ నెల 23 శుక్రవారం (నేటి) నుంచి 27వ తేదీ వరకు ‘ఉచిత టాలెంట్ హంట్’ పోటీలను నిర్వహిస్తున్నామని ఇస్కాన్ కూకట్ పల్లి ప్రతినిధులు శ్రీవాణి మాతాజీ, అంజనాదేవి మాతాజీ, లలిత తబరా మాతాజీ, సునీల్ రాఠి తెలిపారు. గురువారం హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్ సెంటర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ‘టాలెంట్ హంట్’కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుక్షేత్ర యుద్ధ క్షేత్రంలో భగవద్గీత రూపంలో భగవంతుడు దివ్య జ్ఞానాన్ని సమస్త మానవాళికి అర్జునుడి ద్వారా అందజేశారని, ఈ భగవద్గీత జ్ఞానాన్ని అందరికీ తెలియజేయడానికి ఇస్కాన్ కూకట్ పల్లి టాలెంట్ హంట్ పేరుతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 6 నుండి 18 ఏండ్ల వయస్సు గల పిల్లలలో నిక్షిప్తమై ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇది ఒక చక్కని వేదిక అన్నారు.

ఈ పోటీలలో గానం, నృత్యం, కలరింగ్, డ్రాయింగ్, వ్యాస రచన, వ్యక్తిత్వం, క్విజ్, స్టోరీ టెల్లింగ్, శ్లోక పఠనం, పెద్దలకు గానం, నృత్యం పోటీలు నిర్వహించబడతాయని, పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు, పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేయబడతాయని వారు తెలిపారు. ఈ అన్ని రకాల పోటీలకు ఉచితంగా www.iskconkukatpally.inలో నమోదు చేసుకోవచ్చని, మరింత సమాచారం కోసం తమను mahashring.dasa@gmail.com, లేదా 9440486792 ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరని వారు కోరారు.

జీహెచ్ఎంసీ

స్టాండింగ్ కమిటీలో 7 అంశాలకు ఆమోదం

- వివిధ ఏజెన్సీల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు అనుమతి
- కార్పొరేటర్ల స్టడీ టూర్‌కు కొటేషన్ల ఆహ్వానం





నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టాండింగ్ కమిటీ సమావేశంలో 7 అంశాలకు ఆమోదం లభించింది. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 4వ స్టాండింగ్ కమిటీ సమావేశం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కమిటీ సమావేశంలో 7 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. నగర అభివృద్ధికి, ప్రజలకు ఉపయుక్తమైన పనులు చేపట్టడంలో కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి కాట, స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, మహమ్మద్ ఖదీర్, మహమ్మద్ నజీర్ ఉద్దీన్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబిహా బేగం, ఆవుల రవీందర్ రెడ్డి, చింతల విజయ్ శాంతి, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, అధికారులు ఈ.ఎన్.సీ జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, నళిని పద్మావతి, గీతా రాధిక, యాదగిరి రావు, చంద్రకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్లు వెంకన్న, రవికిరణ్, ఉపేందర్ రెడ్డి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, సీసీపీ శ్రీనివాస్, చీఫ్ అకౌంట్స్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఎస్.ఇ కృష్ణారావు, సీ.ఈ దేవానంద్, సెక్రటరీ సత్యనారాయణ, చీఫ్ వెటర్నరి డాక్టర్ అబ్దుల్ వకీల్, శానిటేషన్, లేక్స్, ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు

నాలుగు లైన్ల బై డైరెక్షన్ ఎలివేషన్ కారిడార్ ఇందిరా పార్క్ నుండి వి.ఎస్.టి వరకు ఎన్టీఆర్ స్టేడియం, వి.ఎస్.టి మెయిన్ రోడ్ అశోక్ నగర్ జంక్షన్ ఆర్.టీ.సీ క్రాస్ రోడ్డు మీదుగా ఫ్లైఓవర్ పనులు, బాగ్ లింగంపల్లి జంక్షన్ నుండి మూడు లైన్ల బై డైరెక్షన్ ఎలివేటెడ్ కారిడార్, రామ్ నగర్ నుండి బాగ్ లింగంపల్లి వీ.ఎస్.టీ మీదుగా సెకండ్ లెవెల్ ఇండియన్ హుమేపైప్ కో.లిమిటెడ్, వజీర్ సుల్తానా టొబాకో వరకు నిర్మించే రోడ్డు పనులకు రివైజ్డ్ అంచనా వ్యయం రూ.565 కోట్లు ప్రతిపాదించారు. అందులో రూ.426 కోట్లు ఖర్చు అయ్యింది. గతంలో మంజూరు అయిన మొత్తం నుండి 139 కోట్ల రూపాయలకు చెల్లించుట పరిపాలన మంజూరు చేసేందుకు కమిటీ ఆమోదం పొందింది.

స్లమ్ ఏరియాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో సీ.ఎస్.ఆర్ కింద డా.విజయ్ కుమార్ దాట్ల ఫౌండేషన్‌కు ఒక సంవత్సర కాలానికి బొల్లారంలోని మోడల్ మార్కెట్ బిల్డింగ్‌ను ఇచ్చుటకు, ఒప్పందం చేసుకొనుటకు కూకట్ పల్లి జోనల్ కమిషనర్‌కు అనుమతి ఇస్తూ కమిటీ ఆమోదం లభించింది.

మార్చి 2024 నుండి మే, 2024 వరకు జీహెచ్ఎంసీకి సంబంధించిన ఆదాయ, వ్యయాలకు కమిటీ ఆమోదం తెలిపారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) ఆన్ లైన్ పోర్టల్ లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించిన లబ్ధిదారుల వివరాలను అప్లోడ్ చేసిన మెస్సర్స్ కోన ఇ-డేటా సొల్యూషన్స్ ఏజెన్సీకి చెల్లించాల్సిన రూ. 12,38,534/- లకు కమిటీ ఆమోదం.

శేరిలింగంపల్లి జోన్ మియర్ గురునాథ్ చెరువును సి.ఎస్.ఆర్ కింద అభివృద్ధి, నవీకరణ చేయుటకు మల్లిగా వద్ సంస్థకు ఆరు నెలల కాలానికి జీహెచ్ఎంసి కమిషనర్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం లభించింది.

జీహెచ్ఎంసీకి సంబంధించిన (15) ఐటీ మాడ్యుల్స్ నిర్వహణ అగ్రిమెంట్‌ను (మూడు సంవత్సరాలకు) నవంబర్ 2023 నుండి అక్టోబర్ 2026 వరకు రెన్యువల్ చేస్తూ, రూ.9,88,41,234/- లకు పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదం లభించింది.

సెప్టెంబర్ 1వ తేదీ నుండి 30 వరకు జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌లను మూడు విడతల్లో ఒక్కో విడతకు 50 మంది చొప్పున స్టడీ టూర్‌కు తీసుకొని వెళ్ళుటకు ట్రావెల్ ఏజెన్సీల నుండి కొటేషన్లు ఆహ్వానించుటకు కమిటీ ఆమోదం తెలిపారు.

పురాణపుల్ చౌరస్తాలో ట్రాఫిక్ డివైడర్లను తొలగించాలి



- సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నాగేశ్వర్

నవతెలంగాణ - ధూల్ పేట్

పురాణ పుల్ చౌరస్తాలో ప్రాణాలు పోవడానికి కారణమవుతున్న ట్రాఫిక్ డివైడర్లను వెంటనే తొలగించాలని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సమస్యశ్రీఐ తక్షణం పరిష్కరించాలని ఆందోళన వ్యక్తం చేస్తూ సీపీఐ(ఎం) సౌత్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం పురణపూల్ చౌరస్తాలో నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వన్ వైపు, 2జే బస్ స్టాప్ వైపు వెళ్ళాల్సిన వాహనాలకు అడ్డుగా ట్రాఫిక్ అధికారులు సిమెంట్ డివైడర్లు వేయడం వల్ల బైపాస్ రోడ్డు కింది భాగంలోకి వాహనాల రద్దీ పెరిగిందన్నారు. ప్రాంతం దిగువ ప్రాంతం కావడంతో అదుపుతప్పే ప్రమాదం ఉందని, తక్షణం వాటిని తొలగించాలన్నారు. గత బుధవారం ద్విచక్ర వాహనం పై ఈ ఇరుకైన రోడ్డు నుంచి వెళ్తుండగా ప్రమాదం జరిగి తండ్రి, బిడ్డ చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్డు లో యూ టర్న్ తీసుకున్నాక రోడ్డు అంతా గుంతలు పడ్డాయని ముందుగా ఆ రోడ్డు రిపేర్ చేయాలని కోరారు. ఉన్నతాధికారులకు చెప్పి సమస్య పరిష్కరిస్తామని గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ లు చెప్పారు. వారి హామీ మేరకు తాత్కాలికంగా నిరసనను విరమించారు. కార్యక్రమం లో సీపీఐ(ఎం) కార్యకర్త కడపయ్య, స్థానికులు రాజు సాజిద్, రాజేందర్, లక్ష్మీ కాంత్, సల్మాన్, జాఫర్, అశ్లాం, ఎం.డీ.గౌస్, ఖలీల్, గిరిబాబు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు

‘ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి’



నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని తెలంగాణ హ్యాండీక్రాఫ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ అన్నారు. గురువారం ఇందిరా పార్క్ ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీ సాయి స్వశక్తి మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సాయి చేనేత కాటన్, సిల్క్స్ ఎక్స్ షోరూం చేనేత హస్తకళ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన సెప్టెంబర్ 29 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ హస్త కళా ప్రదర్శనను హ్యాండీక్రాఫ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ నాయుడు సత్యనారాయణ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ. సామాన్యులకు అతి తక్కువ ధరలో చేనేత వస్త్రాలను అందించాలని ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇది కేవలం వస్త్రాల ప్రదర్శన మాత్రమే కాదు తమ నైపుణ్యం ద్వారా మన సాంస్కృతిక వారసత్వాన్ని సజీవంగా ఉంచిన కళాకారులకు ఇది నివాళి అన్నారు. ఈ ఎక్స్‌పో వారి ప్రతిభకు తార్కాణమే కాకుండా నేరుగా నేత కార్మికులతో అనుసంధానం చేయడం ద్వారా వారికి సాధికారత కల్పించే వేదిక అన్నారు. తరతరాలుగా ఈ పురాతన పద్ధతులను భద్రపరిచిన మన హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనమని తెలిపారు. హస్తకళ ప్రదర్శన ఆర్గనైజర్ కంభంపాటి పద్మజ మాట్లాడుతూ . ఈ చేనేత హస్తకళలో దేశంలోని పలు రాష్ట్రాల నుండి చేనేత డ్వాక్రా మహిళలు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు.తమ ప్రతిభావంతులైన నేత కార్మికులను ప్రోత్సహించడానికి, మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించిన సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం తమకు చాలా ఆనందంగా ఉంది, ఈ ఎగ్జిబిషన్ చేనేత వస్త్రాల అందం, ప్రాముఖ్యతను అభినందించడానికి, వారి వారసత్వం కొనసాగుతుందని నిర్ధారించుకోవడానికి సమాజానికి ఒక అవకాశం అని తెలిపారు.



నవతెలంగాణ - ధూల్ పేట్

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సోయా బుల్లా ఖాన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షురాలు అల్కా మనోజ్.

మనుషుల్లాగే జంతువులకు స్వాతంత్ర్యం అవసరం

- వేగాన్స్ ఫౌండేషన్ ఫౌండర్ ప్రవళిక



నవతెలంగాణ-హిమాయత్ నగర్

జంతువులను హక్కులు కలిగిన వ్యక్తులుగా గుర్తిం చవలసిన ఆవశ్యకతను ఎత్తిచూపుతూ మనుషుల్లాగే జంతు వులకు స్వాతంత్ర్యం అవసరమని వేగాన్స్ ఫౌండేషన్ ఫౌం డర్ ప్రవళిక అన్నారు.గురువారం హైదర్ గూడలోని ఎన్ఎ స్ఎస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవాతుకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వేగాన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రవళిక, సూరజ్, రఘురాం, పంచ్ తదితరులు మాట్లా డారు. జంతువులను దోపిడీ చేయడం మానేయాలని, వాటిని వ్యక్తులుగా చూడాలని, జంతు ఉత్పత్తులను తినడం మానేయాలని ప్రజలను కోరారు. మానవ జంతు సంఘ ర్షణ కేసులను తగ్గించడానికి కుక్కలు, పిల్లులను కొనుగోలు చేయడానికి బదులుగా వాటిని దత్తత తీసుకోవాలన్నారు. ప్రతి ఏడాది బిలియన్ల కొద్దీ భూమి జంతువులు, ట్రిలియన్ల సముద్ర జంతువులు మానవుల చేత చంపడం జరుగు తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని జంతువులకు స్వేచ్ఛ కల్పించాలని కోరుతూ వందలాది మంది జంతు హక్కుల కార్యకర్తలు ఈ నెల 24న ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు నగరంలోని సంజీవయ్య పార్క్ నుండి నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా వరకు ‘జంతు సంరక్షణ’ పేరుతో కవాతు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ము ఖ్య అతిథులుగా ప్రముఖ దర్శకుడు శశికిరణ్ టిక్క, సిన్సమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇషాంత్, ప్రముఖ నటి ఊత లూరు అభిజ్ఞ, సిటిజన్స్ ఫర్ యానిమల్స్ వ్యవస్థాపకులు పనీరు తేజ తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే చట్టపరంగా చర్యలు

- సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలుంటాయని సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్ రాంబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను డ్రైవింగ్ చేస్తూ పట్టు బడితే మోటార్ యాక్ట్ సెక్షన్ 181 ప్రకారం మొదటిసారి నిందితులైన వాహన దారులకు రూ.500 జరిమానా, రెండో సారి, మూడో సారి దొరికితే 3 నెలల డ్రైవింగ్ లైసెన్స్ రద్దవుతుందని, నాలుగోసారి దొరికితే శాశ్వతంగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా జైలు శిక్ష అనుభవిస్తారని వాహన హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి డ్రైవరు కీలక పాత్ర వహించాలని, కుటుంబసభ్యుల సంక్షేమాన్ని దష్టిలో పెట్టుకొని జాగరూకతతో వాహనాలను నడపాలని సూచించారు. ప్రతి డ్రైవర్ వాహనాలు నడపడంలో శిక్షణ పొందాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ రూల్స్ పాటించాలని కోరారు. ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్, ఇన్సూరెన్స్, వాహన రిజిస్ట్రేషన్ తదితర ధవీకరణ నకలు ప్రతులను వాహన దారులు, డ్రైవర్లు వెంట ఉంచుకోవాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపరాదని, బహిరంగ ధూమ పానం చేయవద్దని, డ్రైవర్‌తో పాటు నలుగురికి మించి ఆటోల్లో ప్రయాణం చేయరాదని సూచించారు. వాహనాల వెనుకా ముందు తప్పని సరిగా వాహన రిజిస్ట్రేషన్ నంబర్ రాయించాలని కోరారు.

సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చంటి ముదిరాజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చంటి ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ గురు వారం చంటి ముదిరాజ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. చంటి ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జాతీయ ప్రధాన కార్య దర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్‌కు జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు కు కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో ఆ వ్యక్తికి కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత ఆయా అధికారులపై ఉందన్నారు. నిర్దీత సమయంలోపు అందించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చన్నారు. ఇక్కడా స్పందన రాకపోతే రాష్ట్ర సమాచార చట్టం చీఫ్ కమిషనర్ కు అప్పీల్ చేసుకోవాలన్నారు. కమిషన్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకు ఒటుందన్నారు.సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిరాకరించే అధికారం ప్రభుత్వ వ్యవస్థలో ఏ శాఖ, అధికారికి లేదన్నారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు,నంగునూరు మండల అధ్యక్షులు అశోక్ యాదవ్,గుండెల రాయుడు,బోదాస్ జగన్, ఎం.డి మున్న,జి.భాను ప్రసాద్, వెంకటేష్ యాదవ్,నమిండ్ల హరీష్, పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గుర్తుతెలియని యువకుడు రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాంపల్లి రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాంపల్లి రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్ పేట్ -హైటెక్ సిటీ మధ్య ఓ గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలపై తలపెట్టి పడుకోగా గుర్తుతెలియని రైలు అతని మెడపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని వయసు 25 నుండి 30 ఉంటుందన్నారు. అతని ఒంటిపై వైట్ కలర్ రౌండ్ నెక్ టీ షర్ట్ ఉందన్నారు. బ్లూ నెక్కర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలిం చినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా ఆ మృతుడి సంబంధికులు ఉంటే వెంటనే 04023202238, 8712658580, 9866357238 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫీజు చెల్లింపునకు వచ్చేనెల 11 వరకు గడువు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులను ఆదుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పథకాన్ని అమలు చేస్తోంది, ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పొందేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించి అర్హత పొందిన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా ఈ పథకానికి దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. 2024-25 విద్యా సంవత్సరానికి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ స్కీమ్ పరీక్ష కోసం సెప్టెంబర్ (వచ్చే నెల) 11వ తేదీలోగా ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్ https//bse.telangana.gov.in ను సందర్శించాలని డీఈవో తెలిపారు.



జాతీయ అంతరిక్ష దినోత్సవం గోడ పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖధికారిణి ఆర్.రోహిణి గురువారం తమ కార్యాలయంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించాలని డీఈవో కోరారు. ఈ కార్యక్రమంలో డీఈవో కార్యాలయ ఈడీ బి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ రావ్ , ప్లానెట్ సొసైటీ ఇండియా డైరెక్టర్ ఎన్. రఘునందన కుమార్, నవం ఫౌండేషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్ , సమగ్ర శిక్ష అభియాన్ సెక్టోరియల్ అధికారులు సి. ఉమ, ఖనీజ్ ఫాతిమా పాల్గొన్నారు.

డాక్టర్ ముజీబ్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే ఆస్పత్రిలో అన్నదానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మెన్, టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో గురువారం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో 650 మంది రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా టీఎన్జీవోస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు రాజేందర్, కేంద్ర సంఘం క్రీడా కార్యదర్శి బోలిగిద్ద శంకర్, సభ్యులు లక్ష్మి ప్రసాద్, మొయిజుద్దీన్ పాల్గొని డాక్టర్ ముజీబ్‌తో కలిసి రోగులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా అధ్యక్షులు రాజేందర్ మాట్లాడుతూ దానాలలో అన్నదానం అతి విలువైనది.. ఇంత మంచి కార్యక్రమానికి తనను పిలిచిన ముజీబ్‌కి శిరస్సు వంచి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్ రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఖాలిద్ అహ్మద్, ఏపీ ఆర్వో ముహమ్మద్ వహీద్, ఆస్పత్రి సభ్యులు శివకుమార్, శేఖర్ డియో, సభ్యులు సుదర్శన్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సయోధ్య చేయూత

- మిత్ర మానసిక వ్యాధుల గుర్తింపు, శిక్షణను ప్రారంభించిన ఈస్ట్ జోన్ డీసీపీ డా. బాలస్వామి బాగ్ అంబర్‌పేట



నవతెలంగాణ-అంబర్‌పేట

మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సయోధ్య మైత్రీ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ చేయూతనందిస్తున్నదని ఈస్ట్ జోన్ డీసీపీ డా.బాలస్వామి తెలిపారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్సీఎస్సీ), ఉస్మానియా యూనివర్శిటీలోని సైకాలజీ విభాగం సహకారంతో సయోధ్య హెూమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేటలోని అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో మిత్ర మానసిక వ్యాధుల గుర్తింపు, శిక్షణ, సిఫార్సు, అవగాహన కార్యక్రమాన్ని డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సయోధ్య మిత్ర చేపట్టింది చాలా మంచి కార్యక్రమమన్నారు. ఈ శిక్షణలో యువతులలో మానసిక ఆరోగ్య సమస్యల ముందస్తు సంకేతాలను గుర్తించడానికి అంబర్‌పేట నుండి పోలీసు కానిస్టేబుళ్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు తదితర 100 మంది ఫ్రంట్లైన్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పొందిన వారు తర్వాత మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలను సయోధ్య మైత్రీ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌లోని సైకాలజిస్టు, శిక్షణ పొందిన ఫ్యామిలీ కౌన్సిలర్ల ప్యానెల్కు రిఫర్ చేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ప్యానెల్ వారికి సరైన అవగాహన, చికిత్స వైపు మార్గనిర్దేశం చ ఏస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్సీఎస్సీ సెక్రటరీ జనరల్ సి.శేఖర్రెడ్డి, ఓయూ సైకాలజీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ స్వాతి, హెచ్‌సీఎస్ సీ జాయింట్ సెక్రటరీ గీత గోటి, కార్యదర్శి ప్రశాంత్, సయోధ్య ప్రధాన కార్యదర్శి మృదుల వేములపాటి, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, బాగ్‌అంబర్పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డిలతో పాటు కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్, పోలీసు కానిస్టేబుళ్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, ఫ్యామిలీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాత పింఛన్ స్కీం విధానాన్ని పునరుద్ధరించాలి..



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

2004 ఏప్రిల్ 1 తర్వాత నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులను కొత్త పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్(ఓపీఎస్) విధానాన్ని పునరుద్ధరించాలని మున్సిపల్ సహకార్ మజూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఆదిల్ షరీఫ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఐఎన్‌టీయూసీకి అనుబంధంగా ఉన్న మున్సిపల్ సహకార్ మజూర్ యూనియన్ (జీహెచ్ఎంసీ) 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి, యూనియన్ నాయకులతో కలిసి సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఉద్యోగుల డీఏలను విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీహెచ్ఎంసీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని సీఎంను కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీహెచ్ఎంసీ ఉద్యోగులందరికీ 125 చదరపు గజాల స్థలం, నాల్గవ తరగతి నుండి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ల వరకు సకాలంలో పదోన్నతి కల్పించాలని, జీహెచ్ఎంసీలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు రూ.26 వేల వేతనం చెల్లించాలని కోరారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు విజయ్కుమార్ యాదవ్, కె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న సంజయ్ కుమార్ యాదవ్..



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

గన్ పార్క్ నుంచి ఈడీ ఆఫీస్ వరకు కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంజయ్ కుమార్ యాదవ్ , బాల పోచయ్య, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ నెంబర్ తెలంగాణదే కాదు

- రాత్రి వేళల్లో మహిళలకు పోలీసుల ఉచిత రవాణా సౌకర్యమంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం
- తప్పుడు ప్రచారమన్న రాచకొండ పోలీసులు..



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాత్రి వేళల్లో మహిళలు గమ్యస్థానాలకు వెళ్లేందుకు పోలీసులు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై రాచకొండ పోలీసులు స్పందించారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, అలాంటి వదంతులను నమ్మవద్దని రాచకొండ పోలీసులు స్పష్టం చేశారు. 'రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల మధ్య ఒంటరిగా ఉన్న మహిళ ఇంటికి వెళ్లేందుకు వాహనం దొరకని పక్షంలో పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్‌లను (1091, 7837018555) సంప్రదించ వచ్చుని, మీ విన్నపాన్ని పరిగణలోకి తీసుకుంటున్న పోలీసులు ఉచితంగా పోలీస్ వాహనాన్ని పంపించి మహిళలను ఇంటి వరకు దింపేస్తారని, పోలీస్ కంట్రోల్ రూం వాహనాలు అందుబాటులో లేకుంటే పీఆర్‌సీ వాహనం, లేదా ఎస్‌హెచ్‌ఓ వాహనాన్ని పంపిస్తా రని, ఏది సులువైన మార్గమో ఎంచుకుని వాహనాలు పంపిస్తారని, ఈ ప్రయాణం పూర్తిగా ఉచితం' అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై రాచకొండ పోలీసులు స్పందిస్తూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారిని ఆన్‌లైన్ నెంబర్లు తెలంగాణ పోలీసులకు సంబంధించినవి కావని, అవి పంజాబ్ రాష్ట్ర, లుదియానా పోలీసులకు సంబంధించినవని తెలిపారు. తెలంగాణలో ఎలాంటి ఎమర్జెన్సీ ఉన్నా ఆన్‌లైన్ నెంబర్ డయాల్ 100కి ఫోన్ చేయాలని రాచకొండ పోలీసులు స్పష్టం చేశారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు..

- అడ్డుకున్న ఖైరతాబాద్ రెవెన్యూ అధికారులు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



రహమత్ నగర్ డివిజన్ ఆశయ్య నగర్‌లోని ప్రభుత్వ భూమిలో ఉన్న బోర్డును కొందరు తొలగించి నిర్మాణం చేస్తుండగా, స్థానిక బీఆర్ఎస్ నాయకులు బి. నర్సింగరావు, రెవెన్యూ అధికారులు వెంటనే వచ్చి పనులు ఆపివేసి, తిరిగి ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు డిప్యూటీ ఎమ్మార్వో లక్ష్మణ్, ఆర్ఐలు రాజు ,కిరణ్ రాజ్, సర్వేయర్ విమల నాయక్, చైన్ మాన్ మెహతాబ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసన సభ్యులు, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ తన క్యాంపు కార్యాలయంలో గురువారం వెంగల్ రావు నగర్, షేక్ పెట్ డివిజన్లకు సంబంధించిన ఐదుగురు సీఎంఆర్ఎఫ్ లబ్దిదారాలకు చెక్కులను పంపిణీ చేశారు.



తార్నాకలో కూలిన చెట్టు

- పరిశీలించిన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

తార్నాకలోని వీధి నెంబర్ 2, మండే మార్కెట్ కాలనీలో ఒక పెద్ద చెట్టు విరిగి పడడంతో పాటు, హై టెన్షన్ వైర్లు తెగిపోయాయి. దాంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం అందుకున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి , ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి తో కలిసి వెంటనే డీఆర్ఎస్ టీమ్, హార్టికల్చర్, విద్యుత్, శానిటేషన్ అధికారులను అప్రమత్తం చేసి, ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. డివిజన్‌లోని ప్రతి కాలనీలో ప్రమాదకర స్థితిలో ఉన్న చెట్ల గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



డిప్యూటీ మేయర్‌ను కలిసిన డీఈ

నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్ నూతనంగా శానిటేషన్ డీఈగా పదవి బాధ్యతలు చేపట్టిన వెంకటేష్ గురువారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డిని తార్నాక లోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ వారి పని తీరుతో డివిజన్ మరింత శుభ్రంగా ఉండే విధంగా ఉండాలని అలాగే డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని తెలిపారు.



ఇందిరానగర్‌లో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-ఓయూ

కార్పొరేటర్ సామల హేమ గురువారం అధికారులతో కలిసి ఇందిరా నగర్ లో పర్యటించారు. డిసెంబర్ 2022లో స్ట్రామ్ వాటర్ లైన్ మంజూరు అయ్యింది కానీ కాంట్రాక్టర్ సరిగ్గా పని చేయకపోవడం వల్ల పనులు మొదలు పెట్టలేదు.. దీనిపై స్పందించిన కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారులకు తెలుపగా టెండర్ రద్దు చేస్తామని నోటీసులు జారీ చేయగా కాంట్రాక్టర్ పనులు మొదలు పెడతామని తెలిపారు. ఈ పనులు 70 లక్షలతో చేపట్టినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు పాల్గొన్నారు.



ఎన్‌వీబీడీసీపీ, జతఈ వ్యాక్సిన్‌ల పై సుల్తాన్ బజార్, ఇసామియాబజార్ లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశా వర్కర్లకు ,వైద్యులకు అవగాహన సమీక్షలో పాల్గొన్న కింగ్ కోఠి క్లస్టర్ ఎస్ పి హెచ్ ఓ డాక్టర్ సాయి బాబా, వైద్యులు తదితరులు

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

వాసవీ గ్రూప్.. ది మోస్ట్ ట్రస్టెడ్ రియల్ ఎస్టేట్ గ్రూప్

- ప్రాజెక్ట్స్ డెవలప్మెంట్, షేరింగ్, ఫ్యూచర్ ప్లాన్స్ గ్రూప్ సీఎస్ఆర్ ఇనిషియేటివ్‌లపై గ్రూప్ డైరెక్టర్ల ప్రెస్ మీట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

30 సంవత్సరాల వారసత్వంతో, వాసవీ గ్రూప్ తన కస్టమర్ల నమ్మకాన్ని అత్యున్నత స్థాయిలో కలిగి ఉందని, గ్రూప్ తన విలువైన కస్టమర్లకు పారదర్శకతను నిర్ధారించడానికి అందుబాటులో ఉన్న ఏ సమయంలోనైనా ప్రాజెక్ట్ వివరాలను పరిష్కరించడానికి స్పష్టమైన ఖచ్చితమైన సమాచారాన్ని అందించడానికి కట్టుబడి ఉందని గ్రూప్ డైరెక్టర్లు ప్రాజెక్ట్స్ డెవలప్మెంట్, షేరింగ్, ఫ్యూచర్ ప్లాన్స్ గ్రూప్ సీఎస్ఆర్ ఇనిషియేటివ్‌లపై మీడియాను ఉద్దేశించి గురువారం బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో చర్చించారు.

ఈ సందర్భంగా వాసవీ గ్రూప్ డైరెక్టర్ అభిషేక్ చందా మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ప్రముఖ రియల్ ఎస్టేట్ గ్రూప్ వాసవి గ్రూప్ నాణ్యత, సమగ్రత,ఆవిష్కరణ అసమానమైన కస్టమర్ సేవ పునాదిపై విజయగాథను నిర్మించిందన్నారు.1994లో స్థాపించిన సంస్థ ప్రధాన కార్యాలయం హైదరాబాద్, రియల్ ఎస్టేట్ గ్రూప్ వారి అసాధారణ ప్రయాణం ద్వారా జంట నగరాల్లో 30 రెసిడెన్షియల్ ప్రాజెక్టలను 17 వాణిజ్య ప్రాజెక్ట్‌లను అమలు చేసినందుకు గర్వంగా ఉందని, వాసవీ గ్రూప్ నిలువెత్తు సారాంశాన్ని బయటకు తీసుకొచ్చి, రాబోయే దశాబ్దాల పాటు వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లే విజయాలనూ నియమించారని తెలిపారు.

30 నివాస ప్రాజెక్టులు/17 వాణిజ్య ప్రాజెక్టులు, 310 ఎకరాల విల్లా ప్లాట్లు విక్రయించడం జరిగిందని, 4510 అపార్టుమెంట్లు, 8 మిలియన్ చ.అడుగుల 50 మిలియన్ చ.అడుగుల నిర్మాణాలు చేపట్టిందని, రాబోయే 5 సంవత్సరాల లక్ష్యం 25,000 ఫ్లస్ ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతోషంగా నివాసాల ఉండేలా నిర్మాణాలు పూర్తి చేస్తున్నామన్నారు.

వాసవీ సరోవర్..

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్న వాసవీ సరోవర్, వాసవీ గ్రూప్ ప్రతిష్టాత్మకమైన రెసిడెన్షియల్ ప్రాజెక్ట్. మా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాలలో భాగంగా, కూకట్‌పల్లిలోని వాసవీ సరోవర్ పక్కన ఉన్న చిన్న మైసమ్మ సరస్సుతో సహా రెండు సరస్సుల సుందరీకరణను చేపట్టామన్నారు. మైసమ్మ సరస్సు సుందరీకరణ సీఎస్ఆర్ ఆదేశం కింద అధికారికంగా తమకు అప్పగించారని, తాము సరస్సు పర్యావరణాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి సారించామని తెలిపారు. సరస్సుపై ఎటువంటి నిర్మాణ కార్యకలాపాలలో పాల్గొనలేదని స్పష్టం చేశారు.ఇప్పుడు జరుగుతున్న తప్పుడు సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ విషయంలో ఎలాంటి అభివృద్ధిని చేపడుతున్నారనే వాస్తవిక వాస్తవాలను వివరించడాని ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

తప్పుడు సమాచారంతో వాసవి అర్బన్ డెవలప్మెంట్ ఆగిపోదని, వాస్తవాలను తెలియజేయడంలో ఎటువంటి తప్పిదం లేదు అన్నారు. తప్పు చేయకుండా ఇది తప్పే తప్పే అంటూ పదేపదే ప్రచారం చేయడం వల్ల తమ సంస్థ నమ్మకాన్ని వమ్ము చేయలేరాని హైదరాబాద్ లోని బాచుపల్లిలో మరో ప్రతిష్టాత్మకమైన రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ వాసవీ అర్బన్‌ను నిర్మిస్తున్నామని అన్నారు.

తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాలలో భాగంగా, తాము కోమటికుంట సరస్సుతో సహా రెండు సరస్సుల సుందరీకరణను చేపట్టామన్నారు .నీటిపారుదల శాఖ ఇంజినీర్ల నుంచి ఎన్ఏసీ, హెచ్ఎండీఏ నుంచి అనుమతి పొందిన తర్వాతే పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పటికీ, తాము ప్రాజెక్ట్‌ను విజయవంతంగా నిర్వహించామని, తాము సరస్సు పర్యావరణాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి సారించి సరస్సుపై ఎటువంటి నిర్మాణ కార్యకలాపాలలో పాల్గొనడం లేదని తెలిపారు. తమ ప్రాజెక్టలన్నీ పూర్తి చట్టపరమైన సమ్మతి పారదర్శకతతో అమలవుతాయన్నారు. సరస్సులను సుందరీకరించడానికి సీఎస్ఆర్ ఇనిషియేటివ్ కింద లేక్ డెవలప్మెంట్ మోడల్ గురించి కొన్ని స్థానిక సోషల్ మీడియా వేదిక కొందరు చేస్తున్న తప్పుడు సమాచారాన్ని ఖండిస్తూ అభిషేక్ చందా తెలిపారు. చందా ప్రాజెక్టుల వివరాలను మీడియా చూపిస్తూ పర్యావరణ అనుకూలమైన దాని వాసవి గ్రూప్ ప్రయత్నమని వాసవి గ్రూప్ తన సీఎస్ఆర్ ఇనిషియేటివ్ వైపు మొగ్గు చూపుతున్నట్టు మీడియాతో చెప్పారు. కొన్ని స్థానిక యూట్యూబ్ ఆధారిత వార్తా ఛానెళ్ల నిర్మాణాలకు సంబంధించిన తప్పుడు వ్యాఖ్యానం పూర్తిగా నిరాధారమైనదని, తాము వాసవి వద్ద ఉన్నాము తప్పుదారి పట్టించే క్లెయిమ్లన్నింటినీ స్పష్టం చేయడానికి గ్రూప్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.

దోపిడి ఆగేదాకా ధర్నాలు జరుగుతూనే ఉంటాయి





- ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కాంగ్రెస్ గురువారం ఈడీ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అదానీ దోచుకున్న ఆస్తులు దేశ ప్రజల కు చెందే వరకు, జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసే వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగు తుందన్నారు.



హైదరాబాద్ ఈడీ కార్యాలయం ఎదుట గురువారం కాంగ్రెస్ నిర్వహించిన ధర్నాలో టీపీసీసీ కార్యదర్శి, సనత్ నగర్ అసెంబ్లీ ఇంచార్జ్ డా.కోట నీలిమ, మేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నవతెలంగాణ-బేగంపేట

సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుల ధర్నా

నవతెలంగాణ-కంటోన్మెంట్



నగరంలో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గురువారం కంటోన్మెంట్‌లో ధర్నా నిర్వహించారు. బోయిన్‌పల్లి చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. పజా సమస్యల పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు.

విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం బేగంపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శంకర్ రాజ్ ఆధ్వర్యంలో ఉచితంగా హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5000 వరకు జరిమానా, మూడు నెలల జైలు శిక్షను కూడా విధిస్తారన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, నడిపినచో తల్లిదండ్రులు వాహన యజమానికి జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. అలాగే రూ. 25,000 జరిమా నాతో పాటు వాహనం రిజిస్ట్రేషన్ రద్దవుతుందన్నారు. రోడ్డు దాటనప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు తెలియ జేసారు., స్కూల్ ఇన్‌చార్జి హిరణ్య, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది, సుమారు 76 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయమ్మలకు వెంటనే రెండు నెలల వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ- జూబ్లీహిల్స్



యూసఫ్ గూడా శిశువిహార్ లో పనిచేయు ఆయమ్మలకు రెండు నెలల వేతనాలు ఇవ్వాల్సిందిగా యూనియన్ నాయకులు, డైరెక్టర్ ఆఫీస్‌లో గురువారం వినతిపత్రం అందజేశారు. డైరెక్టర్ అందుబాటులో లేని కారణంగా అసిస్టెంట్ డైరెక్టర్ ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీ వారం రోజుల్లో రెండు నెలల వేతనాలు చెల్లిస్తామని యూనియన్ నాయ కులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్,తార ,సుశీల ,జయశ్రీ పాల్గొన్నారు.

అదానీ మెగా స్కాంపై జేపీసీ విచారణ జరపాలి

- బోరబండ కాంగ్రెస్ నాయకుల డిమాండ్


నవతెలంగాణ- జూబ్లీహిల్స్



హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నిర్వహించిన ధర్నాకు బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా, బోరబండ డివిజన్ కాంగ్రెస్ నాయకులు భారీగా పాల్గొన్నారు. బోరబండ సైట్ 1 కమాన్ నుంచి బస్సులలో, కార్లలో, బైకల పై ప్రారంభమై గన్ పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్తూపం వరకు వెళ్లి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదానీ మెగా స్కాంపై జేపీసీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

గాన సభ సంగీత విద్యార్థులు పాటల చిరు జల్లులు





నవతెలంగాణ-కల్చరల్

వయస్సు తో నిమిత్తం లేకుండా త్యాగరాయ గానసభ లో సంగీత శిక్షణ ఉచితంగా ఇస్తున్నారు..ప్రముఖ శాస్త్రీయ సంగీత గురువు సంయుక్త నిర్వహణలో వారి శిష్యులు అన్నమయ్య త్యాగయ్య వంటి వాగ్గేయ కారులు కీర్తనలు మాత్రమే కాకుండా సినీ పాటలను పాడగలరని చిరంజీవి జన్మ దిన సందర్భంలో ఆయన నటించిన పలు చిత్రాల్లో పాటలు పాడుతూ శ్రోతలను గురువారం అలరించారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా మారుతి కళా వేదిక పై సంయుక్త శిష్యులు చిరంజీవి సినిమాలో పాటలు రెండు గంటలు పైగా హుషారుగా పాడారు. ప్రముఖ జర్నలిస్ట్ రచయిత సంగమం అకాడమీ స్థాపకుడు సంజయ్ కిషోర్ అతిథిగా పాల్గొని మ్యూజిక్ అందించిన బాపి రాజును సంయుక్త ను అభినందించారు

ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న ఎంపీ

నవతెలంగాణ-ఓయూ



రామంతపూర్ గణేష్ నగర్‌లోని మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో ఆరాధన మహోత్సవం సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు .కార్యక్రమంలో స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఓయూలో ఇస్రో ప్రాజెక్టులపై అవగాహన..

- ఆకట్టుకున్న ఇస్రో నమూనాలు..
- విద్యార్థుల్లో పరిశోధన శక్తిని పెంపొందిస్తాయి : ఓయూ రిజిస్ట్రార్ ప్రో.పప్పుల లక్ష్మీ నారాయణ



నవతెలంగాణ-ఓయూ

అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, ఆసక్తిని పెంపొందించడం, అంతరిక్ష శాస్త్రాన్ని అన్వేషించడం... ఇస్రో కార్యకలాపాలపై అర్థం చేసుకునే ఉద్దేశంతో ఉస్మానియా విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల స్పేస్ ఆన్ వీల్స్ పేరుతో గురువారం ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఎన్ఆర్ఎస్సీ సంయుక్తం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా సైన్స్, టెక్నాలజీ సామాన్యులకు చేరువవుతుందని ఓయూ రిజిస్ట్రార్ పో.పప్పుల. లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జరిగిన స్పేస్ ఆన్ వీల్స్ ప్రదర్శనకు రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు.కార్యక్రమన్ని ప్రారంభించిన ఓయూ రిజిస్ట్రార్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు పంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నందుకు ఈసీఈ శాఖను అభినందించారు. విద్యార్థుల ఆచరణాత్మక అభ్యాసాన్ని మెరుగుపరచడానికి, అంతరిక్ష సాంకేతికతలో తదుపరి పరిశోధనలకు ఊతమిచ్చేందుకు లాంచ్ వెహికల్స్ కొన్ని నమూనాలను ఓయూలో శాశ్వతంగా ప్రదర్శించాలని నిర్వాహకులను కోరారు. జీడిమెట్లలోని ఇస్రోలోని ఎన్ఆర్ఎస్‌సిలో సైంటిస్ట్ ఎస్ఎఫ్ డాక్టర్ శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించి చంద్రయాన్-3, ఇస్రో సాధించిన విజయాలపై చేస్తున్న పరిశోధన లపై ప్రసంగించారు. ఇస్రో ఔట్ రీచ్ కార్యకలాపాలు, అంతరిక్ష యాత్రల గురించి విద్యార్థులకు వివరించారు. చంద్రయాన్ సహా ఇతర ఇస్రో కార్యకలాపాల గురించి తెలుసుకోవడానికి ఇది ఎంతగానో ఉపయోగపడిందని, కార్యక్రమ కన్వీనర్ ఈసీఈ ప్రొఫెసర్ పెరుమాళ్ళ నవీన్ కుమార్ అన్నారు. అంతరిక్ష శాస్త్రంపై లోతైన అవగాహనను పెంపొందించడంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ రోజునే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రదర్శనలో OceanSat, RISAT, RESOURCESAT, చంద్రయాన్ వంటి ఉపగ్రహ నమూనాలను జీడిమెట్లలోని NRSC ఔట్రీచ్ ఫెసిలిటీ ద్వారా ప్రదర్శించారు.

ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల వందలాది మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. చంద్రయాన్-3 ల్యాండింగ్ పాయింట్లను (శివశక్తి పాయింట్) కలిగి ఉన్న చంద్రుని 3డీ నమూనా విద్యార్థులను ఆకర్షించింది. GSLV MK-III, PSLV, ASLV, SLV-3, RLVTD వంటి ప్రయోగ వాహనాల నమూనాలు ప్రదర్శించారు. OceanSat, RISAT, చంద్రయాన్ 1, చంద్రయాన్ 3 వంటి ఉపగ్రహాల నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇస్రో గగన్‌యాన్ మిషన్‌పై నినాదాల పోటీలో విజేతలకు బహుమతులు అందించారు. రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్‌లు, చంద్రయాన్, మంగళయాన్‌లకు సంబంధించిన పోస్టర్లు, ప్యానెల్‌లను ఏర్పాటు చేశారు.అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రో. పి. చంద్రశేఖర్, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రో. రాజేంద్ర నాయక్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.





సెక్స్... బహిరంగంగా చర్చించడానికి ఇష్టపడని అంశాల్లో ముందు వరసలో ఉంటుంది. ఇక పిల్లల సమక్షంలో ఇది ఎప్పుడూ మాట్లాడకూడని టాపిక్. నిజానికి ఈ దాపరికమే టీనేజ్ పిల్లలతో తప్పటడుగు వేయిస్తోంది. అందుకే చిన్న వయసు నుంచే పిల్లలకు లైంగిక విద్యపై అవగాహన కల్పించడం చాలా అవసరం. అసలు పిల్లలకు ఏ వయసు నుంచి లైంగిక విద్యపై అవగాహన కల్పించాలి? ఈ సున్నితమైన అంశం గురించి వాళ్లకెలా వివరించాలి? దీని గురించి నిపుణులు ఏమంటున్నారో ఈ రోజు తెలుసుకుందాం...

చర్చ జరగాల్సిందే..

లైంగిక విద్యపై చిన్నారుల్లో అవగాహన కల్పించడం మాట సరే... కానీ ఏ వయసు నుంచి దీన్ని ప్రారంభించాలనే దానిపై చాలా మంది తల్లిదండ్రులకు స్పష్టత ఉండదు. అయితే ఊహ తెలిసినప్పటి నుంచే వాళ్ల వయసును బట్టి ఒక్కో అంశంపై అవగాహన పెంచడం మంచిదంటున్నారు నిపుణులు.

చిన్న వయసు నుండే...

ఐదేండ్ల నుంచే లైంగిక విద్యకు సంబంధించిన ప్రాథమిక విషయాలు వాళ్లకు వివరించాలంటున్నారు నిపుణులు. అది కూడా ఆ వయసులో వాళ్ల అర్థం చేసుకొనే బాషలోనే.. శరీర భాగాలు, వాటి పేర్లు, వాటి విషయంలో పాటించే ప్రైవసీ, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ వంటివన్నీ వారికి వివరించాలి. అలాగే 9-12 ఏండ్ల మధ్య వయసున్న చిన్నారులు రుతుచక్రం ప్రారంభమయ్యే దశలో ఉంటారు. కాబట్టి అందుకు అనుగుణంగా శరీరంలో జరిగే మార్పులు, మానసికంగా ఎదురయ్యే సమస్యలు, భావోద్వేగాల గురించి వారికి తెలియజేయాలి.

మరింత లోతుగా...

టీనేజ్‌లోకి ప్రవేశించిన అమ్మాయిలతో లైంగిక అంశాల గురించి మరింత లోతుగా చర్చించాల్సి ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ప్రత్యుత్పత్తి వ్యవస్థ ఆరోగ్యం, గర్భనిరోధక పద్ధతులు, సుఖ వ్యాధులు వంటి అంశాలపై అవగాహన కల్పించాలి. నిజానికి ఈ విషయాల గురించి వాళ్లతో చర్చించడం కాస్త కష్టమే అయినా మరో విధంగా వాళ్లు తెలుసుకొని తప్పటడుగు వేసే కంటే తామే సున్నితంగా వివరించడం మంచిదంటున్నారు నిపుణులు.

నిర్మొహమాటంగా మాట్లాడుకోవాలి

లైంగిక విద్యపై అవగాహన కల్పించే క్రమంలో మీరు చెప్పడం, పిల్లలు వినడం కాకుండా ఇరువైపుల నుంచి చర్చ జరగాలంటున్నారు నిపుణులు. చర్చజరిగేటపుడు పిల్లలకొచ్చిన సందేహాల్ని నివృత్తి చేయడం తల్లిదండ్రుల బాధ్యత అంటున్నారు. వాళ్లు అడిగిన సందేహాలకు నిజాయితీగా, నిర్మొహమాటంగా సమాధానమివ్వడం వల్ల ఏది మంచి, ఏది చెడు అన్న విషయాలు తెలుసుకోగలుగుతారు. ఒక వేళ ఏదైనా ప్రశ్నకు సమాధానం తెలియకపోతే వాళ్లనే ఆన్‌లైన్ చెక్ చేసుకోమని చెప్పకుండా ఇద్దరూ కలిసి దానికి సమాధానం వెతికే ప్రయత్నం చేయాలి. ఇలా మీకు అర్థమైన విషయాన్ని వారికి వివరించడం ఓ పద్ధతి. అలాగే మీడియాలోనూ దీనికి సంబంధించిన వార్తలు కొన్ని వస్తుంటాయి. వాటిని పిల్లలు చూడకూడదని ఛానల్స్ మార్చేయడం సరికాదు. ఎందుకంటే దీనివల్ల అదేంటో తెలుసుకోవాలన్న ఆరాటం పిల్లల్లో పెరుగుతుంది. ఇది కూడా వారిని పెడదోవ పట్టించవచ్చు. కాబట్టి ఇలాంటి విషయాల గురించి కుటుంబ సభ్యులు నిర్మొహమాటంగా మాట్లాడుకోగలిగితే సమాజంలో దీనిపై ఉన్న అపోహలు క్రమంగా తొలగిపోతాయి.



పొరపాట్లు దొర్లకుండా

లైంగిక విద్యపై పిల్లలకు అవగాహన కల్పించే క్రమంలో, ఈ విషయాల గురించి వాళ్లతో చర్చించేటప్పుడు కొన్ని పొరపాట్లు దొర్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలంటున్నారు నిపుణులు. కొంతమంది దీని గురించి పదే పదే పిల్లల దగ్గర ప్రస్తావించడం ఇష్టం లేక అన్ని విషయాలూ ఒకే సారి మాట్లాడి 'హమ్మయ్య..ఎలాగైతేనేం చెప్పాలనుకున్నది చెప్పేశాం' అని చేతులు దులుపుకుంటారు. కానీ ఇది సరికాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే దీని గురించి తరచూ ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్య చర్చలు జరిగినప్పుడే పిల్లలకు సరైన అవగాహన వస్తుందని, మరింత తెలుసుకోవడానికి ఆన్‌లైన్‌ను ఆశ్రయించే అవకాశం ఉండదంటున్నారు.

పద్ధతిగా మాట్లాడండి

చిన్న వయసులో ఉన్న పిల్లలు లైంగిక అంశాల గురించి అర్థం చేసుకోలేరని, అందుకే 15-20 ఏండ్ల వయసొచ్చాకే దీని గురించి చెప్పాలనుకుంటారు కొందరు తల్లిదండ్రులు. కానీ ఇది పొరపాటు అంటున్నారు నిపుణులు ఇంతకు ముందు చెప్పుకున్నట్లు చిన్న వయసు నుంచే ఒక్కో అంశం గురించి వివరించడం వల్ల ఒక వయసొచ్చే నాటికి వారికి పూర్తి అవగాహన వస్తుందంటున్నారు. పిల్లలకు లైంగిక విద్యపై అవగాహన కల్పించే క్రమంలో భాష విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఏది పడితే అది, ఎలా పడితే అలా మాట్లాడడం కాకుండా సరైన పదాలు ఉపయోగిస్తూ, సున్నితంగా, పద్ధతిగా టాపిక్ గురించి వివరించడం మంచిదంటున్నారు. అప్పుడే చర్చ సౌకర్యవంతంగా సాగుతుందంటున్నారు.

నిపుణుల సలహాలూ...

పిల్లలు లైంగిక విషయాల గురించి అడిగితే పేరెంట్స్ ఏమనుకుంటారో? తిడతారేమోనని సందేహించకుండా నిర్మొహమాటంగా తమలోని సందేహాన్ని నివృత్తి చేసుకోవాలి. ఒకవేళ ఆయా అంశాల గురించి పుస్తకాల్లో, ఆన్‌లైన్‌లో వెతికినా అందులోని నిజానిజాల గురించి తల్లిదండ్రులతో చర్చించడం వల్ల తప్పటడుగు వేయకుండా జాగ్రత్తపడొచ్చు. అంతేకాదు పేరెంట్స్‌కి తెలియని విషయాలేవైనా ఉంటే నిపుణుల సలహాలూ తీసుకోవచ్చు.

జీర్ణశక్తిని పెంచే జీరా వాటర్..



కొందరు అజీర్తి, మలబద్ధకం, శరీరంలో అసౌకర్యం, కడుపుబ్బరం వంటి చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే ఎక్కువగా ఆందోళన చెందుతుంటారు. ఏమో జరిగిపోతుందనే భయంతో ఆస్పత్రులకు వెళ్తుంటారు. తీరా టెస్టులన్నీ చేశాక ప్రాబ్లం ఏం లేదని డాక్టర్లు చెప్తే అప్పుడు గానీ మనసు ప్రశాంతంగా ఉండదు. కానీ అప్పటికే ప్రాబ్లం ఏంటని తెలుసుకునేందుకు నిర్వహించే టెస్టులకే కనీసం పది పన్నెండు వేలు ఖర్చయిపోయి ఉంటాయి. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు ఇంట్లోనే పాటించగల కొన్ని హెూమ్ రెమిడీస్ అద్భుతంగా పనిచేస్తాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా జీలకర్ర లేదా జీరా వాటర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అప్పుడప్పుడు తాగడంవల్ల సాధారణ అనారోగ్య సమస్యల నుంచి బయపడే అవకాశం ఉందంటున్నారు చిట్కా వైద్యులు. అయితే దీన్ని ఎలా తయారు చేయాలి? ఎలా వాడాలో ఇప్పుడు చూద్దాం.

సాధారణంగా జీలకర్రను నీటిలో నాబెట్టడం ద్వారా లేదా మరిగించడం ద్వారా జీరా వాటర్ వస్తుంది. ఈ పానీయాన్ని ప్రతిరోజూ లేదా కనీసం వారంలో రెండు మూడుసార్లు తాగితే జీర్ణశక్తి పెరుగుతుంది. అంటే అజీర్తి, అసౌకర్యం వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. చర్మ ఆరోగ్యానికి కూడా మంచిదని నిపుణులు చెప్తున్నారు. ఇక జీరాలోని డైటరీ ఫైబర్ శరీరాన్ని డిటాక్షిఫికేషన్ చేస్తుంది కాబట్టి పేగు కదలికలను ప్రేరేపించడం ద్వారా బలబద్ధకాన్ని నివారిస్తుంది.

జీరా వాటర్‌లో పొటాషియం, కాల్షియం, మాంగనీస్, సెలీనియం వంటి మినరల్స్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఇవి చర్మ సౌందర్యాన్ని పెంచడంలో సహాయపడతాయి. యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు కూడా ఉండటంవల్ల మొటిమలు తగ్గుతాయి. చర్మంలో మృత కణాలు రాకుండా ఉండటంలో, అప్పటికే వచ్చిన వాటిని తొలగించడంలో జీరా వాటర్ అద్భుతంగా పనిచేస్తుంది. దీంతో వృద్ధాప్య ఛాయలు కూడా దూరం అవుతాయని, స్కిన్ అలెర్జీలు, ఇన్‌ఫెక్షన్లు, దగ్గు, జలుబు, కడుపులో ఉబ్బరం, జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

కేసు నీరుగార్చే యత్నం

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన చాలాసేపు తరువాత కేసు నంబరు నమోదు చేసినట్టు తెలుస్తోందని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు చాలా షాకింగ్‌గా ఉందన్న ధర్మాసనం, సీబీఐ, కోల్‌కతా పోలీసుల నివేదికల మధ్య ఎందుకు వ్యత్యాసం ఉందని ప్రశ్నించింది. కేసు డైరీ హార్డ్ కాపీ సమర్పించాలని కోల్‌కతా పోలీసులను ధర్మాసనం కోరింది. ఈ కేసులో కోల్‌కతా పోలీసులు పనిచేసిన తీరు సరిగా లేదని జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు చట్ట ప్రకారం వ్యవహరించలేదని, వారి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని అన్నారు. వైద్యులకు అధిక పని గంటలపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. 30 ఏండ్లలో ఇలాంటి కేసు చూడలేదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పార్థివాలా పేర్కొన్నారు. ట్రైనీ డాక్టర్ మృతదేహానికి ఎప్పుడు పోస్టుమార్టం చేశారని, కచ్చితమైన సమయం చెప్పాలని ప్రశ్నించారు. శాంతియుత నిరసనలకు విఘాతం కలిగించొద్దని, ఆర్‌జీ కర్ ఘటనకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలిపే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. నిరసన తెలిపిన వైద్యులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ పరిస్థితిని రాజకీయం చేయొద్దని, చట్టం తన పని తాను చేసుకుంటోందని స్పష్టం చేసింది. వైద్యుల సంక్షేమం, భద్రతపై తాము ఆందోళన చెందుతున్నామని ధర్మాసనం పేర్కొంది.



క్రైం సీన్‌ను మార్చేశారు : సీబీఐ రిపోర్టు

అభయపై లైంగికదాడి, హత్య కేసును కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని సీబీఐ తన రిపోర్టులో పేర్కొంది. తల్లిదండ్రులను సైతం తప్పుదారి పట్టించారని తెలిపింది. శవ దహనం తరువాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సీబీఐ పేర్కొంది. ఘటనా స్థలంలో ఆధారాలను ధ్వంసం చేశారని వెల్లడించింది. కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై సీబీఐ స్టేటస్‌కో రిపోర్టును కోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అందించారు. స్థానిక పోలీసుల నుంచి సేకరించిన సమాచారంతో పాటు సీబీఐ సేకరించిన ఆధారాలను కోర్టుకు సొలిసిటర్ జనరల్ అందించినట్టు తెలిపారు.సీబీఐ అందజేసిన సీల్డ్ కవర్ స్టేటస్ రిపోర్ట్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం పరిశీలించింది. ఘటన జరిగిన ఐదో రోజున దర్యాప్తు తమ చేతికి వచ్చిందని సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపారు. అప్పటికే చాలా వరకూ మార్చేశారని, అందులో క్రైం సీన్ కూడా ఉందని వెల్లడించారు. అయితే ప్రతి ఒక్కటీ వీడియోగ్రఫీ జరిగిందని బెంగాల్ ప్రభుత్వం తరుపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు. మృతదేహానికి అంత్యక్రియలు జరిగిన తరువాతే రాత్రి 11 :45 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సొలిసిటర్ జనరల్ తెలిపారు. ఆస్పత్రి వైద్యుల నివేదిక ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదుకాలేదని, బాధితురాలి తండ్రి అభ్యర్థన మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. సీనియర్ డాక్టర్లు, సహచరులు ఒత్తిడి చేయడంతోనే వీడియోగ్రఫీ చేశారన్నారు. అంటే అక్కడ కవర్-అప్ ఏదో జరుగుతుందని వారంతా భావించారని సొలిసిటర్ జనరల్ వెల్లడించారు.తొలుత అసహజ మరణంగా ఉదయం 10:10 గంటలకు కేసు నమోదు చేశారని, తరువాత కేసు నంబరు నమోదు చేసినట్టు తెలుస్తోందని ధర్మాసనం పేర్కొంది. కేసు నమోదు చేయడానికి ముందే పోస్ట్‌మార్టం నిర్వహించడం ఆశ్చర్యంగా ఉందని, పోస్టుమార్టం జరిగిన 18 గంటల తరువాత క్రైం సీన్‌ను సీల్ చేశారెందుకు?, అలాగే క్రైం సీన్ భద్రపరచడం, జప్తు చేయడం రాత్రి పూట ఎందుకు జరిగాయని ప్రశ్నించింది. ఈ కేసులో ఎఎస్‌పి తీరు చాలా అనుమానాస్పదంగా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ కేసును తొలుత రికార్డుల్లో రాసిన పోలీసు అధికారి తదుపరి విచారణకు ధర్మాసనం ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. శవ పంచనామా ఎప్పుడు చేశారని సుప్రీంకోర్టు ప్రశ్నించగా, సాయంత్రం 4.20 గంటల తరువాత జరిగిందని కోల్‌కతా పోలీసుల తరుపున వాదిస్తున్న కపిల్ సిబల్ తెలిపారు. నిందితుడి వైద్య రిపోర్టును కూడా సమర్పించాలని సీబీఐని ధర్మాసనం ఆదేశించింది.

సీబీఐ, పోలీసుల నివేదికకు వ్యత్యాసం ఎందుకు?

సీబీఐ సమర్పించిన నివేదిక, కోల్‌కతా పోలీసుల నివేదికకు ఎందుకు తేడా ఉందని సీబీఐని జస్టిస్ పార్దీవాలా ప్రశ్నించారు. హత్యకు ముందు అభయను వేధించారని, కేసును కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని సీబీఐ తరుపున సొలిసిటర్ జనరల్ తెలిపారు. అంత్యక్రియల అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. ఈ విషయంలో ఆస్పత్రి పాలకవర్గం ఉదాసీనంగా వ్యవహరించిందన్నారు. నేరం జరిగిన ప్రదేశాన్ని భద్రపర్చలేదని, ఈ ఘటనపై కుటుంబ సభ్యులకు ఆలస్యంగా సమాచారం అందిందన్నారు. ఇది ఆత్మహత్య కాదని, హత్య అని కుటుంబ సభ్యులు చెప్పినా పట్టించుకోలేదన్నారు.

ఈ క్రమంలో ధర్మాసనం జోక్యం చేసుకుని సంఘటనా స్థలాన్ని ఎందుకు భద్రపరచలేదని బెంగాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఎఫ్ఐఆర్ నమోదు ఎందుకు ఆలస్యమైందని, దర్యాప్తు నిబంధనలను ఎందుకు విస్మరించారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

వైద్యుల భద్రతపై సుప్రీం కీలక ఆదేశాలు

వైద్యుల భద్రతను నిర్ధారించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసులతో చర్చించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శిని ధర్మాసనం ఆదేశించింది. వారంలోగా సమావేశాన్ని నిర్వహించాలని, రెండు వారాల్లో రాష్ట్రాలు పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించింది. నేషనల్ టాస్క్‌ఫోర్స్ కమిటీ ముందు వైద్యులు తమ భద్రతకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇచ్చేలా ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని మంత్రిత్వ శాఖకు సూచించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వైద్య సంస్థల వద్ద హింస, ఎలాంటి భయాందోళనలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపింది. ప్రయివేట్ ఆస్పత్రులు సొంతంగా రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొంది. ప్రయివేట్ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యుల భద్ర తను ఆస్పత్రుల యాజమాన్యాలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మరో వైపు వైద్యుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం ఓ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతపై ఓ మెకానిజాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వైద్యులకు తగిన భద్రత కల్పించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల భద్రతపై తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిం చింది. తదుపరి విచారణను న్యాయస్థానం సెప్టెంబర్ 5కి వాయిదా వేసింది.

ఇది ఆరంభమే..

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొని మాట్లాడారు. మొదట రూ.49వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి.. ఆ తర్వాత 31వేలకు తగ్గించి.. ప్రస్తుతం రూ.7,500 కోట్లే చేశారని విమర్శించారు. 70లక్షల మంది అర్హులైన రైతులు ఉంటే.. 20 లక్షల మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. ఇప్పటి వరకు రైతులకు రైతుభరోసా కూడా వేయలేదన్నారు. ఇదే కేసీఆర్ ప్రభుత్వంలో పంటలు ప్రారంభమయ్యే దశలోనే రైతుబంధు పడేదని తెలిపారు. రుణమాఫీపై రైతులు అధికారులను కాకుండా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. ప్రజాస్వామికబద్ధంగా ప్రభుత్వంపై కొట్లాడుతామన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించినందుకే చేవెళ్ల చెల్లెమ్మ సబితమ్మను అవమానించిండని ఆరోపించారు. షాబాద్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేశామన్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక షాబాద్ కళ తప్పిందని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా నుంచి పరిశ్రమలు వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ ప్రారంభించిన ప్రాజెక్టులను సీఎం రేవంత్‌రెడ్డి రద్దు చేశారని ఆరోపించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఏమి తీసుకుని కాంగ్రెస్‌లో చేరారో చెప్పాలని, ఎమ్మెల్యేను ప్రజలు ప్రశ్నించాలన్నారు. బీఆర్ఎస్ అంటేనే భారత రైతు సమితి అని, రైతుల పక్షాన నిరంతరం పోరాడుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, ఎమ్మెల్సీ శంబీపూరి రాజు, శాసన మండలి మాజీ చైర్మెన్ స్వామిగౌడ్‌తోపాటు పార్టీ ముఖ్య నేతలు హాజరయ్యారు.

సీఎం రైతులను మోసం చేసిండు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

జనగామ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్ర రైతాంగానికి రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశాడని అన్నారు. 'రేవంత్‌రెడ్డి.. ఏ ఊరికొస్తావో చెప్పు, ఏ మండలానికి వస్తావో చెప్పు, ఎక్కడైనా 100 శాతం రుణమాఫీ అయిందా లేదా అని అడుగుదాం' అంటూ సవాల్ విసిరారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పూర్తి రుణమాఫీ కాలేదని ప్రకటించారని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 49 లక్షల మందికి రుణమాఫీ చేయాల్సి ఉంది కానీ 22 లక్షల మంది రైతులకు మాత్రమే జరిగిందని ఒప్పుకున్నారని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ.7,000 కోట్ల రుణమాఫీ జరిగిందని బ్యాంకర్ల సమావేశంలో ప్రకటించారని అన్నారు. ప్రజలు ఎవరి మాట నమ్మాలో తెలియక ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులకు పూర్తి రుణమాఫీ చేసేదాకా ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.తొర్రూరులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండ వద్ద ప్రధాన రహదారిపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బైటాయించి ఆందోళన చేపట్టారు. ముందుగా ఎన్‌టీఆర్ సర్కిల్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సత్తుపల్లిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నిరసన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకొని ధర్నా చేపట్టారు. మెదక్ జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇచ్చోడ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మీ రైతులతో కలిసి ధర్నాలో పాల్గొని, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో బీఆర్ఎస్ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలోఎమ్మెల్సీ కోటిరెడ్డితో కలిసి ధర్నా నిర్వహించారు. మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, వేల్పూర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

కలిసి పనిచేసేందుకు సిద్ధం

పుతిన్‌తో భేటీలో చైనా ప్రధాని లీ కియాంగ్ వెల్లడి

మాస్కో : చైనా, రష్యాల మధ్య గల సమగ్ర వ్యూహాత్మక సమన్వయ భాగస్వామ్యాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లేందుకు గానూ అన్ని రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకై రష్యాతో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా వుందని చైనా ప్రధాని లీ కియాంగ్ చెప్పారు. చైనా, రష్యా ప్రభుత్వాధినేతల మధ్య జరుగుతున్న 29వ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ బుధవారం లీ ఈ వ్యాఖ్యలు చేశారు. 1996లో ఏర్పాటు చేసినప్పటి నుండి ప్రతి ఏటా ఈ రెగ్యులర్ సమావేశాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఇరు దేశాల ప్రభుత్వాధినేతల మధ్య కుదిరిన ఏకాభిప్రాయాలను అమలు చేసేందుకు ఇదొక ముఖ్యమైన యంత్రాంగం. అలాగే ద్వైపాక్షిక సహకారానికి, ప్రజల మధ్య పరస్పర మార్పిడులను పెంపొందించడానికి కూడా ఇది కీలకమైనది. రెగ్యులర్ సమావేశం అనంతరం క్రెమ్లిన్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో లీ భేటీ అయ్యారు. తనకు, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు మధ్య కుదిరిన కీలకమైన ఏకాభిప్రాయాల అమలు ఇప్పుడు మంచి ఫలితాలను అందిస్తోందని పుతిన్ పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో గ్రామాల విలీనంపై వివరాలు ఇవ్వండి : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగురోడ్డు వరకు పెంచుతూ అక్కడి గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయటానికి చెందిన వివరాలివ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి డైరెక్టర్, రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి, శంషాబాద్ మండల ఎంపీడీవో, మండల పంచాయతీ అదికారి, జీహెచ్ఎంసీ కమిషనర్లు తమ వాదనలతో కౌంటర్ వేయాలని చెప్పింది. ఓఆర్ఆర్ వరకు జీహెచ్ఎంసీ పరిధిని పెంచుతూ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి జులై 26న ఇచ్చిన మోమోను సవాల్ చేస్తూ శంషాబాద్ మండలానికి చెందిన జి పద్మావతి సహా ఐదుగురు వేసిన పిటిషన్‌ను జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారించారు. గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయటం వల్ల పేదలకు నష్టమనీ, శంషాబాద్ మండలానికి చెందిన చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ, హమీదుల్లానగర్ బహదూర్‌గూడ, రషీద్‌గూడ పంచాయతీలను సమీప మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయటానికి సమీప మున్సిపాల్టీలో విలీన ప్రయత్నాలను అడ్డుకోవాలని పిటిషనర్ తరుపు లాయర్ కోరారు. విచారణను నాలుగు వారాలకు కోర్టు వాయిదా వేసింది.

కవితకు అస్వస్థత

ఏయిమ్స్‌లో వైద్య పరీక్షలు.. తిరిగి తీహార్ జైలుకు

న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టై తీహార్ జైలు లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి అస్వస్థతకు గురయ్యారు. గత కొన్ని రోజులుగా గైనిక్ సమస్య, వైరల్ జ్వరంతో ఆమె బాధపడుతున్నారు. ఈ సమస్యలతో బాధపడుతున్న ఆమెకు తీహార్ జైలు డాక్టర్లు చికిత్సనందిస్తున్నారు.కాగా గురువారం ఈ సమస్యలు తీవ్రంకావటంతో.. జైలు డాక్టర్లు వైద్య పరీక్షల కోసం ఢిల్లీ లోని ఏయిమ్స్ కు సిఫారసు చేశారు. ఇదే విషయాన్ని కవిత భర్త అనిల్ కు జైలు అధికారులు తెలిపారు. అనంతరం ఉదయం 11 గంటల సమయంలో కవితను తీహార్ జైలు సిబ్బంది ఏయిమ్స్ తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. కవిత భర్త అనిల్ కూడా ఏయిమ్స్ కు వెళ్లారు. ఈ వైద్య పరీక్షల అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు అమెను జైలు సిబ్బంది తీహార్ జైలుకు తరలించారు.

నవచిత్రం



ఇలాంటి కథలు మరిన్ని రావాలి : అల్లుఅర్జున్

దర్శకుడు సుకుమార్ భార్య తబిత సమర్పణలో నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు వస్తున్న సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. ఇందులో రావు రమేష్ కథానాయకుడు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా, సుకుమార్ విశిష్ఠ అతిథిగా విచ్చేశారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఫస్ట్ టికెట్ అల్లు అర్జున్‌కి ప్రజెంట్ చేశారు. 'టికెట్ ఎంత పెట్టి కొంటున్నారు?' అని సుమ అడగ్గా,. "సుకుమార్ సినిమా. కోటి రూపాయలు అయినా పెడతా" అని చెప్పారు అల్లు అర్జున్.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'సుకుమార్ వైఫ్ తబితా సుకుమార్ ప్రొడ్యూస్ చేశారు. సుకుమార్‌కి ఏమాత్రం సంబంధం లేకుండా ఆవిడ ఈ సినిమా చేశారు. అందుకు సభాముఖంగా అభినందిస్తున్నా. తెలుగులో తక్కువ మంది ఆర్టిస్టులు ఉన్నారు. అందులో రావు రమేష్ లేకపోతే చాలా క్యారెక్టర్స్ రావు. ఈ సినిమా సక్సెస్ అయ్యి ఇటువంటి కథలు ఎక్కువ రావాలని కోరుకుంటున్నాను. ఇక, 'పుష్ప 2' విషయానికి వస్తే... ఈ సినిమా వస్తున్న విధానం అభిమానులకు నచ్చుతుంది. డిసెంబర్ 6న అసలు తగ్గేది లే. ఇది మాత్రం ఫిక్స్' అని అన్నారు.

'మా ఆవిడ ఫస్ట్ టైం ప్రజెంట్ చేస్తుంది. మా ఆవిడ సినిమా చూసింది. పగలబడి నవ్వానని చెప్పింది. మా ఫ్యామిలీ, తన ఫ్రెండ్స్ అందరినీ తీసుకు వెళ్ళింది. అందరికీ సినిమా నచ్చింది. ఒక రోజు హోమ్ థియేటర్లో చూశా. నాకు చాలా బాగా నచ్చింది. బన్నీ రాకతో ఇది పెద్ద సినిమా అయ్యింది. రావు రమేష్ లాంటి నటులు హీరో పాత్రలు చేస్తే చాలా కథలు బయటకు వస్తాయి. క్లైమాక్స్ వచ్చేసరికి నాకు కళ్ల వెంట నీళ్లు వచ్చాయి. లక్ష్మణ్ కార్య అద్భుతంగా తీశాడు' అని దర్శకుడు సుకుమార్ చెప్పారు. తబితా సుకుమార్ మాట్లాడుతూ, 'లక్ష్మణ్ నాకు షో వేసినప్పుడు చాలా ఎంజాయ్ చేశా. ఇది చిన్న స్థాయిలో ప్రేక్షకుల్లోకి వెళ్ళకూడదు, పెద్దగా వెళ్లాలని నేను ప్రజెంట్ చేస్తానని లక్ష్మణ్ కార్యతో చెప్పాను' అని అన్నారు. రావు రమేష్ మాట్లాడుతూ, 'మారుతి నగర్ సుబ్రమణ్యానిది ఓ యుద్ధం. అతను ఓ నూతిలో కప్ప. అన్నీ తెలుసన్నట్టు కనిపిస్తాడు. కానీ, ఏమీ తెలియదు. నన్ను అప్డేట్ చేయమని కొడుకును అడుగుతాడు. ఇటువంటి అద్భుతమైన ప్రపంచాన్ని దర్శకుడు లక్ష్మణ్ కార్య సృష్టించాడు' అని తెలిపారు.

అందుకే.. అందరూ బాగా కనెక్ట్ అవుతున్నారు

హీరో నార్నే నితిన్ తాజాగా నటించిన చిత్రం 'ఆయ్'. ఈ సినిమాకి అంజి.కే.మణిపుత్ర దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాస్ నిర్మించిన ఈ సినిమా ఈనెల 15న విడుదలైంది. ప్రేక్షకుల ప్రశంసలతోపాటు బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు అందుకుంటూ.. బ్లాక్ బస్టర్ దిశగా పరుగులు తీస్తోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు అంజి.కె.మణిపుత్ర మీడియాతో మాట్లాడారు.

- సినిమా చూశాక ఎన్టీఆర్ బావుంది.. కామెడీని, క్లైమాక్స్ కూడా చాలా బాగా డీల్ చేశావు అన్నారు. అందరూ థియేటర్లకి రావడం లేదు అంటారు కానీ.. మంచి సినిమా వస్తే ఖచ్చితంగా థియేటర్లకు వస్తారని నిరూపించావు. సెకండ్ సినిమా ఎప్పుడు తీస్తున్నావ్ అని అల్లుఅర్జున్ మాట్లాడారు.



అంజి.కె.మణిపుత్ర

- మా ఫ్రెండ్స్ అందరూ చాలా హ్యాపీ. మా ఊర్లో సినిమా ఇంకా బాగా ఆడుతోంది. మా అమ్మానాన్నలకి సినిమాల గురించి పెద్దగా తెలియదు. సినిమా హిట్ అయ్యాక అందరూ వచ్చి మీ అబ్బాయి సినిమా చాలా బాగా తీశాడని చెబుతున్నారు అని ఇవాళ పొద్దున్నే ఫోన్ చేసి చెప్పారు. నాకు చాలా సంతోషం వేసింది.
- సినిమా అందరికీ నచ్చడానికి కారణం సినిమాలో అన్ని రియల్‌గా జరిగేవి. హీరో నాగ చైతన్య కూడా అదే అన్నారు. థియేటర్లు అన్నీ బ్లాస్ట్ అవుతున్నాయి. దానికి కారణం అన్ని మనకు తెలిసిన పాత్రలు. కొన్ని సీన్లు కూడా నిజంగా నాకు జరిగినవి నేను చూసినవే. అందుకే సినిమా బాగా కనెక్ట్ అయ్యింది. రోజురోజుకీ కలెక్షన్లు పెరుగుతున్నాయి. మా నిర్మాతకు డబ్బులొస్తే నాకూ ఆనందమే కదా. సినిమా ఇంకా ఆడుతుందనే నమ్మకం పెరిగింది.

విజువల్ వండర్‌గా విశ్వంభర



చిరంజీవి

చిరంజీవి నటిస్తున్న క్రేజీ సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర' మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి, బిగ్ మాస్ బొనాంజాతో ముందుకు వచ్చారు.

'వెన్ మిత్ కొల్లాయిడ్స్ లెజెండ్స్ రైజ్' అనే కోట్‌తో ఉన్న ఈ వండర్ ఫుల్ పోస్టర్‌లో చిరంజీవి ఒక రాతిపై కూర్చొని, ప్రత్యేక శక్తులతో కూడిన త్రిశూలాన్ని పట్టుకుని పవర్‌ఫుల్‌గా కనిపించారు.

చిరంజీవి త్రిశూలం వైపు ఇంటెన్స్ లుక్స్‌తో చూస్తూ యూత్ ఫుల్ అండ్ డైనమిక్‌గా కనిపించారు. విజువల్‌గా అద్భుతమైన ఈ ఫస్ట్‌లుక్ స్ట్రాంగ్ బజ్‌ని క్రియేట్ చేసింది. సినిమాపై అంచనాలను పెంచింది.

తన డెబ్యూ మూవీ 'బింబిసార'తో బ్లాక్ బస్టర్ అందించిన దర్శకుడు వశిష్ట తన అభిమాన హీరో చిరంజీవితో కలిసి 'విశ్వంభర'ను అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా తీర్చిదిద్దుతున్నారు. మూవీ కోసం ఒక ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించారు. ఈ పోస్టర్ సైతం హై-ఆక్టేన్ యాక్షన్ ఎపిసోడ్‌లు, అద్భుతమైన డ్రామాతో విజువల్ వండర్‌గా ఉంటుందని హామీ ఇస్తోంది.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను బ్లాక్‌బస్టర్ ప్రొడక్షన్ హౌస్ యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. త్రిష కృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్స్ నటిస్తుండగా, కునాల్ కపూర్ పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు.

విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌ని చాలా గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానుంది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, సంగీతం: ఎంఎం కీరవాణి, డీవోపీ: చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్.



సచివాలయంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ లోగోను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, కమిషన్ చైర్మెన్ శివసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

- సీఎం రేవంత్ రెడ్డికి మంద కృష్ణ మాదిగ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను మంద కృష్ణతో పాటు మంత్రి దామోదర రాజనరసింహ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



అకడమిక్ కెరీర్ దృష్ట్యా టిటికి అర్చన వీడ్కోలు

ముంబయి: పారిస్ ఒలింపిక్స్ మహిళల టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణులు చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. మహిళల టీమ్ ఈవెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్న తొలి భారత జట్టుగా ఘనత సాధించింది. మన జట్టు ఈ రికార్డును చేరుకోవడంలో 24ఏళ్ల అర్చనా కామత్ కీలక పాత్ర పోషించింది. అయితే, తాజాగా ఆమె సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రొఫెషనల్ టేబుల్ టెన్నిస్‌కు వీడ్కోలు పలికింది. అకడమిక్ కెరీర్‌లో ముందుకుసాగడం కోసం ఆటను వదిలిపెట్టినట్లు ఆమె కోచ్ మీడియాకు తెలిపారు. పారిస్ గేమ్స్ ముగించుకొని భారత్‌కు తిరిగొచ్చిన తర్వాత అర్చన తన కెరీర్ గురించి కోచ్ అన్షుల్ గార్గ్‌తో సుదీర్ఘంగా చర్చించిందట. నాలుగేళ్ల తర్వాత లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో ఆడే



ఆర్థిక అవసరాల దృష్ట్యా ఆటకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకున్నట్లు తెలిసింది. "పతకం సాధించడం చాలా కష్టమైన పనే అని నేను చెప్పా. ఆమె వరల్డ్ 100 ర్యాంకుల జాబితాలో లేదు. గత రెండు నెలలుగా ఆమె ఎంతో కష్టపడుతున్నప్పటికీ.. ప్రొఫెషనల్ కెరీర్ కోసం మరింత కఠోర శ్రమ అవసరం అని వివరించా. దీంతో ఆమె విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించాలని నిర్ణయించుకుంది" అని కోచ్ వివరించారు.

డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్-2

- రాతపరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించిన టీజీపీఎస్సీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షలను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు డీఎస్సీ రాతపరీక్షలకు, గ్రూప్-2 రాతపరీక్షలకు మధ్య వ్యవధి ఒకే రోజు ఉండడంతో ఈనెల ఏడు, ఎనిమిది తేదీల్లో నిర్వహించాల్సిన గ్రూప్-2 రాతపరీక్షలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. డిసెంబర్ 15న పేపర్-1, పేపర్-2, అదేనెల 16న పేపర్-3, పేపర్-4 రాతపరీక్షలు జరుగుతాయని వివరించారు. రోజూ రెండు విడతల్లో పరీక్షలుంటాయని తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో విడత రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్ష ప్రారంభానికి వారం రోజుల ముందు నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని తెలిపారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్-2 పోస్టుల భర్తీకి రాతపరీక్షలను నిర్వహిస్తున్నది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం వచ్చేఏడాది మేలో గ్రూప్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. అక్టోబర్‌లో రాతపరీక్షలను నిర్వహించనున్నట్టు ప్రకటించింది.

గ్రూప్-2 రాతపరీక్షల షెడ్యూల్

పేపర్, సబ్జెక్టు	తేది
పేపర్-1 జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్	డిసెంబర్ 15 (ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు)
పేపర్-2 హిస్టరీ, పాలిటీ, సొసైటీ	డిసెంబర్ 15 (మధ్యాహ్నం 3 నుంచి సాయంత్ర 5.30 వరకు)
పేపర్-3 ఎకానమి, డెవలప్‌మెంట్	డిసెంబర్ 16 (ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు)
పేపర్-4 తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం	డిసెంబర్ 16 (మధ్యాహ్నం 3 నుంచి సాయంత్ర 5.30 వరకు)

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బంగారం తనఖా రుణాలు రెట్టింపు

- ఐదేండ్లలో రూ.14.19 లక్షల కోట్లకు చేరిక
- పీడబ్ల్యూసీ రిపోర్ట్



న్యూఢిల్లీ : వచ్చే ఐదేండ్ల కాలంలో బంగారం తనఖా రుణాలు రెట్టింపు కానున్నాయని పీడబ్ల్యూసీ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ప్రతీ ఏడాది ఈ రుణాలు సగటున 14.85 శాతం వృద్ధితో 2018-19 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.14.19 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా వేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ రుణాల విలువ రూ.7.1 లక్షల కోట్లుగా ఉందని 'స్ట్రైకింగ్ గోల్డ్: ది రైజ్ ఆఫ్ ఇండియాస్ గోల్డ్ లోన్ మార్కెట్' రిపోర్ట్‌లో తెలిపింది. భారతీయ కుటుంబాలు 25,000 టన్నుల బంగారాన్ని కలిగి ఉన్నాయి. భారతీయ కుటుంబాల వద్ద ఉన్న బంగారం విలువ దాదాపు రూ.126 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా.

గత ఆర్థిక సంవత్సరంలో పెరిగిన బంగారం ధరలతో రుణ రేట్లు, ధరల విషయంలో రుణదాతలు అప్రమత్తంగా ఉండాలని నివేదిక సూచించింది. బంగారం ధరలో ఏదైనా భారీ తగ్గుదల చోటు చేసుకుంటే తీవ్ర సమస్యలను సృష్టించనుందని పేర్కొంది.

ఏడాదిన్నర కనిష్టానికి జీడీపీ..!

- జూన్ త్రైమాసికంలో 6 శాతమే
- పట్టణ వినిమయంలో తగ్గుదల
- ఇక్రా రేటింగ్స్ అంచనా



న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు ఏడాదిన్నర కనిష్టానికి పడిపోనుందని ప్రముఖ దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్ నుంచి జూ న్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 6 శాతానికి పరిమితమై ఆరు త్రైమాసికాల కనిష్ట స్థాయికి చేరొచ్చని విశ్లేషించింది. ప్రధా నంగా ప్రభుత్వ మూలధన వ్య యం తగ్గుదల, పట్టణ వినియో గదారుల డిమాండ్‌లో క్షీణత వృద్ధి పతనానికి కారణం కావొచ్చని పేర్కొంది. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో అనేక రంగాలు తిరోగమనాన్ని చవి చూశాయని తెలిపింది. అయితే ఆర్థిక సంవత్సరం చివరి సగంలో రికవరీ ఉండొచ్చని భావించింది. స్థూలంగా 2024-25లో జీడీపీ 6.8 శాతానికి తగ్గొచ్చని అంచనా వేసింది. 2023-24లో 8.2 శాతం వృద్ధి చోటు చేసుకున్న విషయాన్ని గుర్తు చేసింది. "ప్రభుత్వ మూలధన వ్యయాలు, పట్టణ వినియోగదారుల విశ్వాసంలో తగ్గుదల చోటు చేసుకుంది. దీంతో గడిచిన క్యూ1లో వృద్ధి 6 శాతానికి పరిమితం కావడం ద్వారా ఆరు త్రైమాసికాల కనిష్ట స్థాయిని నమోదు చేయవచ్చు. 2024 డిసెంబర్ త్రైమాసికంలోనూ 7.8 శాతం వృద్ధి చోటు చేసుకుంది. 2023-24 జూన్ త్రైమాసికంలో 8.2 శాతం వృద్ధి నమోదయ్యింది" అని ఇక్రా రేటింగ్స్ పేర్కొంది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ ఆగస్టు 30న జూన్ త్రైమాసిక జిడిపి గణాంకాలను అధికారికంగా వెల్లడించనుంది. "గడిచిన జూన్ త్రైమాసికంలో జీడీపీ తగ్గుదలకు అనేక కారణాలున్నాయి. ఈ కాలంలో పార్లమెంటరీ ఎన్నికలు, కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ప్రభుత్వ మూలధన వ్యయం మందగించడం వల్ల వివిధ రంగాలలో మందగమనం ఏర్పడింది. అదే విధంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారుల విశ్వాస సర్వే ప్రకారం పట్టణ వినియోగదారుల విశ్వాసం సన్నగిల్లింది. రుతుపవనాలు ఆలస్యంగా ప్రారంభం కావడం వినిమయ విశ్వాసాన్ని ప్రభావితం చేశాయి" అని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ పేర్కొన్నారు.

హిందుస్థాన్ జింక్, జెఎన్‌సిఎఎస్‌ఆర్ ఒప్పందం



న్యూఢిల్లీ : వేదాంత గ్రూపునకు చెందిన హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ జింక్ ఆధారిత బ్యాటరీల అభివృద్ధికి గాను జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్సుడ్ సైంటిఫిక్ రీసెర్చ్ (జెన్‌సిఎఎస్‌ఆర్)తో కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. జింక్ మెటీరియల్స్‌తో బ్యాటరీలను అందుబా టులోకి తేవడానికి జెఎన్‌సి ఎఎస్ ఆర్‌లోని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖతో భాగస్వామ్యం చేసుకున్నట్లు పేర్కొంది.

కొత్త రంగులో హీరో గ్లామర్ 2024



హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటో తన హీరో గ్లామర్ 2024ను సరికొత్త రంగులో తెచ్చినట్లు వెల్లడించింది. బ్లాక్ మెటాలిక్ సిల్వర్‌లోని ఈ బైకును హీరో రామ్ చరణ్‌తో కలిసి హీరో మోటో చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రాంజీవ్‌విట్ సింగ్ ఆవిష్కరించారని తెలిపింది. రెండు వేరియంట్లలో లభించే వీటి ధరలను ఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద రూ.83,598, రూ.87,598గా నిర్ణయించింది.

భారత్ బెంజ్ నుంచి హెవీ డ్యూటీ రిగిడ్ ట్రక్కులు

న్యూఢిల్లీ : డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ (డిఐసివి) తన భారత్ బెంజ్ నుంచి కొత్తగా హెవీ డ్యూటీ రిగిడ్ ట్రక్కులను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇవి సరికొత్త బిఎస్6 స్టేజ్ 2తో 6.7 లీటర్ డీజిల్ ఇంజిన్‌తో లభించనున్నాయని పేర్కొంది. 250 హార్స్‌పవర్‌తో లభిస్తున్న ఈ వాహనాలను 10 లక్షల కిలోమీటర్ల వరకు వార్షిక నిర్వహణ ఒప్పందం (ఎఎంసి)తో అందిస్తున్నామని డిఐసివి ప్రెసిడెంట్ శ్రీరామ్ వెంకటేశ్వరన్ తెలిపారు.

మారుతి సుజుకి ఆల్టో కె10లో ఇఎస్‌పి ఫీచర్

న్యూఢిల్లీ : మారుతి సుజుకి ప్యాసింజర్ వెహికల్ పోర్ట్‌ఫోలియోలియో కీలకమైన ఆల్టో కె10, ఎస్-ప్రెస్సోలో కీలకమైన భద్రత ఫీచర్ అయినా ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ (ఇఎస్‌పి)ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ధరల పెంపు లేకుండానే దీన్ని అందిస్తున్నట్లు తెలిపింది. తమ వినియోగదారులు ఎంచుకున్న మోడల్‌తో సంబంధం లేకుండా మెరుగైన డ్రైవింగ్ విశ్వాసం, కీలక భద్రతను ఆస్వాదించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

ఇఎస్‌పితో పాటు స్టాండర్డ్ సేఫ్టీ సూట్‌లో డ్యూయల్ ఫ్రంట్ ఎయిర్‌బ్యాగ్‌లు, ఇబిడితో కూడిన ఎబిఎస్, రివర్స్ పార్కింగ్ సెన్సార్లు, ఇంజిన్ ఇమ్మొబిలైజర్ సాధారణ ఫీచర్లుగా అందిస్తున్నట్లు పేర్కొంది.

ఆగస్టు 27న ఐపిఒకు ప్రీమియర్ ఎనర్జీస్

Premier Energies

న్యూఢిల్లీ : సోలార్ ఉత్పత్తుల కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ ఆగస్టు 27న ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానున్నట్లు ఆ సంస్థ గురువారం వెల్లడించింది. ధరల శ్రేణిని రూ.427-450గా నిర్ణయించింది. ఇన్వెస్టర్లు కనీసం 33 ఈక్విటీ షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ ఇష్యూను ఆగస్టు 29న ముగించనుంది. ఈ ఇష్యూలో 3.42 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా రూ.2,830.4 కోట్లు సమీకరించాలని నిర్దేశించుకుంది.

కరెంటు పోల్స్ వేయకుండానే బిల్లుల డ్రా

- రామాయంపేట విద్యుత్ శాఖలో కుంభకోణం
- విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై రైతులకు టోకరా
- 2021లో జరిగిన ఘటన తాజాగా వెలుగులోకి..



నవతెలంగాణ-రామాయంపేట

సామాన్యులు కరెంటు బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్లు కట్‌చేస్తారు.. చిన్నచిన్న అవసరాల కోసం దొడ్డి దారిన కరెంటు వాడుకున్నారని, విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డారని పెద్ద పెద్ద కేసులు పెడుతుంటారు విద్యుత్ అధికారులు. అదే విద్యుత్ అధికారులు డబ్బుల కోసం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, లక్షల రూపాయల కుంభ కోణానికి పాల్పడ్డారు. రైతులకు వేయాల్సిన కరెంటు పోల్స్ వేయకుండా వారిని ఇబ్బందుల పాలు చేస్తూ. కరెంట్ పోల్స్ వేసినట్టు లక్షల రూపాయల బిల్లులు డ్రా చేసుకున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2021లో జరిగిన ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేటలో తాజాగా నవతెలంగాణ పరిశీలనలో వెలుగులోకి వచ్చింది.



బయటపడింది ఇలా..

రామాయంపేట పట్టణానికి చెందిన అల్లాడి దుర్గయ్య అనే ఓ రైతు 2021లో తన వ్యవసాయ పొలం వద్దకు కరెంటు కనెక్షన్ కోసం రూ.5,787 డీడీ తీసి విద్యుత్ అధికారులకు ఇచ్చాడు. ఎన్నోసార్లు విద్యుత్ అధికారులను సంప్రదించినా.. 'ఇంకా.. కరెంటు పోల్స్ రాలేదు..' అంటూ కాలయాపన చేశారు. దాంతో ఆ రైతు దూరంగా ఉన్న కరెంటు పోల్స్ నుంచి వైరు వేసుకొని వ్యవసాయం కొనసాగిస్తున్నాడు. కరెంట్‌పోల్ పాతది కావడంతో ఇటీవల కింద పడిపోయింది. ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే, డీడీలు చెల్లిస్తే కొత్త పోల్స్ వేస్తామంటూ ఆ రైతులకే సలహాలు ఇవ్వడం గమనార్హం. గతంలో డీడీ చెల్లించిన విషయాన్ని విద్యుత్ కార్యాలయానికి వెళ్లి వివరాలు సేకరించగా కుంభకోణం బయటపడింది. 2021 సంవత్సరంలోనే అల్లడి దుర్గయ్య అనే రైతుకు మూడు కరెంటు పోల్స్ వేసి కనెక్షన్ ఇచ్చినట్టుగా రికార్డుల్లో ఉంది. అందుకు సంబంధించిన బిల్లులు కూడా చెల్లించినట్టుగా రికార్డులు ఉండటంతో ఒక్కసారిగా ఆ రైతులు అవాక్కయ్యారు. మిగిలిన రైతులూ నోరెళ్ల బెట్టాల్సిన పరిస్థితి.

విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ మళ్లీ కట్టమంటున్నారు -పల్లె పెంటయ్య

తనకు వ్యవసాయం కోసం విద్యుత్ కనెక్షన్ అవసరం ఉండగా 2021లో కొత్త కనెక్షన్ కోసం డీడీ చెల్లించాను. చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరిగాను. అధికారులు కనెక్షన్ ఇవ్వలేదు. దూరం నుంచి వైర్లు వేసుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. అధికారులను అడిగితే మళ్లీ డీడీ చెల్లించమంటున్నారు.

2021లో జరిగిన విషయం తనకు తెలియదు - రామాయంపేట విద్యుత్ ఏఈ పెంట్యా నాయక్


అల్లడి దుర్గయ్య వ్యవసాయ కనెక్షన్ కోసం మంజూరైన కరెంటు పోల్స్ వేసినట్టుగా రికార్డుల్లో ఉన్నది నిజమే. బిల్లులు కూడా డ్రా అయినట్టుగా ఉంది. 2021లో నేను ఇక్కడ అధికారిగా లేనందున వివరాలు నాకు తెలియదు.

కరెంట్ పోల్స్ వేయలేదంటున్న మరి కొంతమంది రైతులు..

కరెంటు పోల్స్ వేయకుండా బిల్లులు డ్రా చేసిన విషయమై 'నవతెలంగాణ' ఎదుట మరి కొంతమంది రైతులు స్పందించారు. అల్లడి దుర్గయ్య వ్యవసాయ పొలం పరిసర ప్రాంతాల్లో ఉన్న మరి కొంతమంది రైతులు.. పల్లె పెంటయ్య, బత్తుల రవి, బత్తుల శామయ్య 2021లో డీడీలు చెల్లించారు. 2022లో అన్నమైన శ్రీశైలం, 2023లో జానపతి పద్మారావు, 2024లో పచ్చంటి లింగం.. కరెంటు కనెక్షన్ కోసం డీడీలు చెల్లించారు. కానీ నేటికీ వీరిలో ఎవరికి కూడా కరెంటు పోల్స్ కానీ, వైర్లు గానీ బిగించలేదు. ఈ రైతులకు సంబంధించిన కరెంటు పోల్స్ వేసినట్టు రికార్డుల్లో చూపించి, విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి బిల్లులు డ్రా చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాజధాని రుణం రాష్ట్ర వాటాలో మినహాయింపు

- కేంద్రం నిర్ణయం
- తొలి విడతగా మూడువేల కోట్లు విడుదల



అమరావతి : అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచబ్యాంకు ద్వారా ఇప్పిస్తున్న రూ.15 వేల కోటను రాష్ట్ర వాటా నిధుల నుండి కేంద్ర ప్రభుత్వం మినహాయించనుంది. ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఏటా బడ్జెట్లోనే మినహాయింపులను చూపాలని ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. నిధులకు కౌంటర్ గ్యారంటీ ఇచ్చిన కేంద్రం ఏడాది వాటాతోపాటు, వడ్డీని కూడా ప్రపంచబ్యాంకుకు చెల్లించేందుకు బాధ్యత తీసుకుంది. అయితే ఈ మొత్తాన్ని రాష్ట్ర వాటాగా ఇచ్చే నిధుల నుండే చెల్లించనుంది. ఈ మేరకు ప్రాథమిక అంగీకారం కుదిరినట్లు తెలిసింది. దీనిలో భాగంగా ఇప్పటికే రూ.3000 కోట్లును కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.దీంతో వచ్చేనెల మొదటి వారంలోనే రైతులకు కౌలు చెల్లించనున్నారు. ఈవారంలో రాజధాని పరిధిలో ప్రపంచబ్యాంకు బృందం పర్యటలను పూర్తి చేసుకోనునుంది. అప్పటి వరకూ రైతుల నుండి ఎటువంటి అభ్యంతరాలు లేకుండా చూసేందుకు మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రైతులను పిలిపించి మాట్లాడారు. ప్రపంచబ్యాంకు పర్యటిస్తున్న నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చేసుకోవాలని, లేనిపక్షంలో ఇబ్బందులు ఎదురవుతాయని మంత్రి సిఆర్‌డిఏ అధికారులకు సూచించగా దానికి అనుగుణంగావారు కూడా చర్యలు తీసుకుంటున్నారు. 2016-19 మధ్యలో ప్రపంచబ్యాంకు సభ్యులు వస్తే రైతులను పిలిచించి మాట్లాడిన ప్రభుత్వం ప్రస్తుతం అటువంటి చర్యలు తీసుకోలేదు. పర్యటన మొత్తం గుంభనంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ప్రపంచబ్యాంకు నిధులు రూ.15 వేల కోట్లు వచ్చేలోపు ముందే కొంత మొత్తాన్ని కేంద్రం రాష్ట్రానికి కేటాయించనుంది. వాస్తవంగా కనీసం మూడు నుండి ఐదేళ్లలోపు నిధుల తిరిగి చెల్లింపులకు మారటోరియం ఉంటుంది. నిధులు ఇచ్చిన తరువాత వాటిని ఉపయోగించుకోవడం, దాని ద్వారా ఆదాయం సందించుకోవడం కోసం ఈ మారటోరియం విధిస్తారు. మారటోరయం తరువాత చెల్లింపుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు బడ్జెట్లోనే తగ్గింపులు చూపించేలా రాష్ట్రంతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది.

అడ్వకేట్ల రక్షణ చట్టం ప్రతిపాదనపై వివరాలివ్వండి : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ కూకట్‌పల్లి బార్ అసోసియే షన్‌కు చెందిన లాయర్ పి.సంతోష్ కుమార్‌పై ఈ నెల 16న పోలీసులు దాడి చేసిన ఘటనపై వివరాలివ్వాలని రాష్ట్రానికి హైకోర్టు నోటీసు లిచ్చింది. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురా వటంలో సాధ్యాసాధ్యాలపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది.న్యాయవాదిపై బోరబండ పోలీసులు దాడి సంఘటనకు సంబంధించి కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ ఇచ్చిన వినతి పత్రంతోపాటు ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటో పిల్‌గా తీసుకుని విచారించింది. ప్రభుత్వానికి చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాదే, జస్టిస్ జె శ్రీనివాసరావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారించి ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నగర పోలీసు కమిషనర్, బోరబండ ఎస్‌హెచ్‌వో, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.



మహిళా కమిషన్ నోటీసులపై హైకోర్టు స్టే

జ్యోతిష్యుడు వేణుస్వామికి మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసు అమలును హైకోర్టు నిలిపివేసింది. ప్రతివాదులైన ప్రభుత్వానికి, ఫిలిం జర్నలిస్టు అసోసియేషన్లకు నోటీసులిచ్చింది. ఫిలిం జర్నలిస్టులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ వేణుస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద విచారించారు. పిటిషనర్ లాయర్ పొన్నం అశోక్ గౌడ్ వాదిస్తూ, సినీతారలకు సంబంధించి జాతకాలు చెబుతున్నారని చెప్పి తెలుగు ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్ ఫిర్యాదు చేయడం చెల్లదన్నారు. అధికారం లేకపోయినా మహిళా కమిషన్ నోటీసులు ఇవ్వడం చెల్లదన్నారు. వాదనల తర్వాత కమిషన్ నోటీసు అమలును నిలిపివేస్తూ స్టే ఆదేశాలు జారీ వెలువడ్డాయి

పత్రాలుంటే ఆస్తిపై హక్కు ఉన్నట్టు కాదు

డాక్యుమెంట్లు ఉంటే ఆస్తిపై హక్కులు ఉన్నట్టు కాదనీ, కోర్టుల్లో అప్పీళ్లు, లిటిగేషన్లు ఉన్నపుడు అవి తేలాల్సివుందని హైకోర్టు స్పష్టం చేసింది. మారేడ్‌పల్లిలోని వైజయంతి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌లో 238 చదరపు గజాల ప్లాట్ రిజిస్ట్రేషన్‌ను బోయినపల్లి సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించడాన్ని సికింద్రాబాద్‌కు చెందిన అర్వింద్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎస్ వి శ్రవణ్ కుమార్ విచారణ జరిపారు. ప్రభుత్వ భూమి అని చెప్పి రిజిస్ట్రేషన్‌ను నిరాకరించారని పిటిషనర్ లాయర్ చెప్పారు. ప్రభుత్వ పిటిషన్ భూఆక్రమణల నిరోధక ప్రత్యేక కోర్టు కొట్టేసి ందన్నారు. దీనిపై ప్రభుత్వ ప్లీడర్ స్పందిస్తూ, కింది కోర్టు తీర్పు అంతిమం కాదనీ, హైకోర్టులో పిటిషన్లు ఉన్నాయని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, తాము గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం తీర్పుకు లోబడి ఉంటుందని చెప్పి రిజిస్ట్రేషన్‌కు అనుమతిచ్చిన విషయాన్ని గుర్తు చేసి పిటిషన్‌ను పరిష్కరించినట్టు ప్రకటించింది.

వివేకా హత్య కేసులో ఉదయ్‌రెడ్డికి బెయిల్

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎనిమిదో నిందితుడు గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డికి బుధవారం హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు లోగా పులిందుల పీఎస్‌లో హాజరుకావా లంటూ పలుషరతులు విధించింది. ప్రత్యక్షం గాకానీ, పరోక్షంగాకానీ కేసులో జోక్యం చేసుకోకూడదని చెప్పింది. పాస్‌పోర్టును సీబీఐ కోర్టులో అప్పగించాలంది. ఈ మేరకు జస్టిస్ కె. లక్ష్మణ్ తుది ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక్కరోజే 185 పిటిషన్లు పరిష్కరించిన జడ్జి

హైకోర్టు చరిత్రలో ఒకే ఒక్క రోజు ఏకంగా 185 పిటిషన్లు పరిష్కారమయ్యాయి. జస్టిస్ ఎస్.వి. శ్రవణ్ కుమార్ రికార్డు స్థాయిలో ఒకేరోజు కేసులను పరిష్కరించి చరిత్ర సృష్టించారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించిన రిజిస్ట్రేషన్ వివాదాలు, రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ వంటివి ఉన్నాయి.

కెనడాలో రైల్వే ఉద్యోగుల సమ్మె

ఒట్టావా : కెనడాలో గురువారం నుంచి రైల్వే ఉద్యోగుల సమ్మె ప్రారంభమయింది. కెనడా నేషనల్, ది కెనడా పసిఫిక్ కన్సాస్ సిటీ సదరన్ అనే రెండు సంస్థలకు చెందిన 9,000 మంది ఉద్యోగులు గురువారం నుంచి సమ్మెకు దిగారు. దీంతో కెనడా రైల్వేతో పాటు ఉత్తర అమెరికా ఆర్థికవ్యవస్థ పై ప్రతికూల ప్రభావం పడనుంది. అమెరికా-కెనడా మధ్య రైల్ మార్గంలో ఎగుమతి అయ్యే సరకుల్లో మూడోవంతు ఈ సంస్థలే తరలిస్తాయి. ఫలితంగా అమెరికాలోని వ్యవసాయ, ఆటోమొబైల్, గృహనిర్మాణ, ఇంధన పరిశ్రమలకు అవసరమైన ముడిసరకు సరఫరా చేయడంలో తీవ్ర అవరోధాలు ఏర్పడనున్నాయి. ఈ సమ్మెను ఆపేందుకు ఇప్పటికే కెనడా కార్మిక శాఖ మంత్రి, ఆ సంఘాలు, సంస్థల యాజమాన్యాలతో చర్చలు జరుపుతున్నారు. అమెరికా-కెనడా పరస్పరం ఒకదానిపై మరొకటి ఆధారపడటంతో ఈ సమ్మె ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇంజిన్లు, ట్రాన్స్‌మిషన్లు, ఇతర పరికరాల సరఫరా తగ్గితే అమెరికాలోని ఆటోమొబైల్ పరిశ్రమలు కూడా తాత్కాలికంగా మూతపడే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికా రైతులు ఎరువుల కొరతను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇక కెనడా సరిహద్దుల్లో నిర్వహించే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు క్లోరిన్ సరఫరా కూడా నిలిచిపోనుంది. రోడ్డు మార్గంలో ఈ సరకును రవాణ చేయడానికి తగినన్ని ట్రక్కులు అందుబాటులో లేవు. అండర్సన్ ఎకనామిక్ గ్రూప్ అంచనాల ప్రకారం మూడు రోజుల్లో 300 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని అంచనా వేసింది. అదే వారంపాటు ఈ ఆందోళన కొనసాగితే బిలియన్ డాలర్లు ఆర్థికనష్టం వాటిల్లనుంది. ఈ సంస్థలు సమ్మెలోకి వెళ్లనున్న నేపథ్యంలో గత వారం నుంచే ప్రమాదకరమైన కెమికల్స్ సరఫరా ఆర్డర్లను తీసుకోవడం మానేసినట్లు తెలుస్తోంది. కెనడా నేషనల్(సిఎన్), ది కెనడా పసిఫిక్ కన్సాస్ సిటీ సదరన్ (సిపికెసి) సంస్థలు ఏకకాలంలో సమ్మెకు దిగడం ఇదే తొలిసారి. 2022లో సిపికెసి సంస్థ 60 గంటలు మూతపడింది. ఇక 2019లో సిఎన్‌సంస్థ దాదాపు తొమ్మిది రోజులపాటు సమ్మె కారణంగా పని చేయలేదు.





సాగు భూమికి పోడు పట్టాలివ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు
- రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాగులో ఉన్న భూమికి పోడు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి లంక రాఘవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారంకలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు హక్కు పత్రాల్లో లోపాల సవరణకు భూముల రీ సర్వే చేయాలన్నారు. హక్కు పత్రాలు ఇవ్వని పోడు భూములకు కొత్తగా హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. రెవెన్యూ భూములు సాగు చేస్తున్న రైతులకు పహాణీలు మంజూరు చేసి, రుణాలు అందించాలన్నారు. పోడు సాగుదారులు పట్టాలు లేని కారణంగా ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పోడు సాగు చేస్తున్న గిరిజన రైతులను గుర్తించి పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి పూసం సచిన్, రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి, టీఏజీఎస్ జిల్లా నాయకులు, తోడసం భీంరావ్, స్వామి, ఉయిక విష్ణు, ఆత్రం కిష్టన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.స్వామి, ఆశన్న, డి.స్వామి పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కమిటీ : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : హర్యానా- ఢిల్లీ సరిహద్దు శంభూ వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లను వారం రోజుల్లోగా తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలుచేస్తూ హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు రైతుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించేందుకు బహుళ కమిటీని ఏర్పాటుచేయనున్నట్లు తెలిపింది. రైతులు ఎదుర్కొంటున్న తాత్కాలిక సమస్యలను ఆ కమిటీకి తెలపాలని పంజాబ్, హర్యానా ప్రభుత్వాలను కోరింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయాలను వెల్లడించింది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు నిరసన తెలుపుతున్న రైతులతో ఈ నెల 12న సమావేశం నిర్వహించామని పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకు తెలియజేసింది. జాతీయరహదారిపై ఏర్పాటుచేసిన బారికేడ్లను పాక్షికంగా తొలగించేందుకు అంగీకరించినట్లు వివరించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రైతు ఉద్యమం సందర్భంగా 'చలో ఢిల్లీ'ని అడ్డుకునేందుకు రాష్ట్రప్రభుత్వం బారికేడ్లను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. అయితే వాటిని వారంలోగా తొలగించాలని ఇటీవల పంజాబ్-హర్యానా హైకోర్టు ఆదేశించింది.

సెప్టెంబరులో జనగణన ?

- 18 మాసాల తర్వాతనే డేటా సిద్ధం
- డేటా జాప్యంతో తీవ్ర సమస్యలు
- దారిద్ర్యం, అసమానతల అంచనాలపై ప్రభావం



న్యూఢిల్లీ : సుదీర్ఘకాలంగా అలస్యమవుతూ వచ్చిన జనగణన కార్యక్రమంలో సెప్టెంబరులో ప్రారంభం కానుందని సంబంధిత ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2021లో ఈ జనాభా లెక్కల సేకరణ జరగాల్సి వుంది. వచ్చే నెల్లో ప్రారంభం కానున్న ఈ బృహత్తర ప్రక్రియ పూర్తి కావడానికి 18మాసాలు పడుతుంది. కోవిడ్ కారణంగా తొలుత వాయిదా పడింది. అయితే ఆ తర్వాత ఈ ప్రక్రియను చేపట్టకుండా మోడీ ప్రభుత్వం జాప్యం చేస్తూ వచ్చింది. దశాబ్దానికోసారి చేపట్టే ఈ జనగణన ఇలా జాప్యం జరగడం 150ఏళ్ల చరిత్రలో ఇదే మొదటిసారి.

జనాభా లెక్కలు చేపట్టడంలో జరుగుతున్న జాప్యంపై ఆర్థికవేత్తల నుండి తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. దీని వల్ల ఇతర గణాంక సర్వేల కచ్చితత్వంపై కూడా ప్రభావం పడుతోందని వారు పేర్కొన్నారు. ఆర్థిక ప్రామాణికాలు, ద్రవ్యోల్బణ రేట్లు, ఉపాధి గణాంకాలు వంటి కీలకమైన డేటాలు ఇందులో వున్నాయి. ప్రస్తుతం, 2011లో నిర్వహించిన జనాభా లెక్కల డేటా పైనే ఈ సర్వేలు, ప్రభుత్వ కార్యక్రమాలు చాలావరకు ఆధారపడుతున్నాయి.

ఈ జనగణన ఫలితాలు 2026 మార్చిలో వెలువడే అవకాశం వుంది. దీనిపై కేంద్ర హోం శాఖ, గణాంకాల మంత్రిత్వ శాఖలు టైమ్‌లైన్‌లను రూపొందించాయి. అయితే ఇంకా ప్రధాని కార్యాలయం అధికారికంగా అనుమతినివ్వాల్సి వుందని ఆ వర్గాలు తెలిపాయి.

జనగణన ఆలస్యమవడంతో కలిగే ప్రభావాలు

ఆధునిక జనాభా లెక్కల డేటా లేకపోవడంవల్ల మరో 15 కీలకమైన ఇతర డేటా సెట్‌లు కూడా ఆలస్యమమయ్యాయి. వీటిల్లో ఆరోగ్యం, జనాభా, ఆర్థిక రంగాలకు సంబంధించినవి వున్నాయి. దీనికి తోడు నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్‌ఎస్‌ఎస్‌ఓ) చేపట్టే సర్వేల నాణ్యత కూడా దెబ్బతింటోంది. 2021లో మోడీ ప్రభుత్వం జనగణన నిర్వహించలేకపోవడంతో, ఆధునీకరించబడిన గణాంకాలు కొరవడిన కారణంగా దాదాపు 10కోట్ల మంది ప్రజలు ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) కు బయటనే వుండిపోయారు. తాజా జనగణన జరగకపోవడం వల్ల 80కోట్ల జనాభా దగ్గరే మనం ఆగిపోవడం దురదృష్టకరమని ఆర్థికవేత్త రితికా ఖెరా వ్యాఖ్యానించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 50శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 75శాతం జనాభాకు పిడిఎస్ వర్తిస్తుంది. ఆ లెక్క ప్రకారం అప్పుడు ఆ సంఖ్య 80కోట్లని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. ఈనాడు జనగణన చేపడితే దాదాపు పది కోట్ల మంద్రి ప్రజలు అదనంగా పిడిఎస్ లబ్దిదారులుగా చేరతారని ఆమె పేర్కొన్నారు.

ఆహార భద్రతే కాకుండా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) కూడా ఈ డేటా కొరత వల్ల తీవ్రంగా ప్రభావితమవుతోంది. రాష్ట్రంలో కుటుంబాలు, కార్మికుల సంఖ్య ఆధారంగా ప్రతి రాష్ట్రానికి నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించాల్సి వుంటుంది. అలాగే ఎస్‌సి, ఎస్‌టి వర్గాల అభివృద్ధి కోసం ఉద్దేశించిన వివిధ పథకాలకు నిధులు కేటాయించడంలో, వృద్ధాప్యపు పెన్షన్లు ఇవ్వడం, పేదలకు గృహ నిర్మాణంలో కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పడుతున్నాయి. వీటన్నింటికీ ఆధునీకరించిన డేటా లేకపోవడమే ప్రధాన కారణంగా వుంది. సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్దిదారులెవరూ దూరం కాకుండా వుండేందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్వంత డేటా సెట్ కోసం నిధులను ఖర్చు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. భారత్ వంటి దేశంలో జనాభా లెక్కలు చాలా కీలకం. దీనివల్ల జనాభా పరంగా వచ్చే మార్పులను అర్థం చేసుకోవడానికి అవకాశం వుంటుంది. లింగ నిష్పత్తి, వలసలు, కుటుంబాల ఆర్థిక స్థాయి, మేరకు పట్టణీకరణ జరిగింది, వంటి విషయాలను అంచనా వేయడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని మద్రాస్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఇన్‌స్టిట్యూట్ కి చెందిన ప్రొఫెసర్ ఎం.విజయభాస్కర్ వ్యాఖ్యానించారు. దారిద్ర్యం, అసమానతలను అంచనా వేయడానికి ఏ నమూనా సర్వే చేపట్టాలన్నా కూడా ఈ జనాభా లెక్కల డేటానే కీలకమైన ప్రాతిపదికగా వుంటుందని అన్నారు.

ఆయా శాఖల్లో ప్రగతిపై గవర్నర్ ప్రశంస

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ శాఖల ద్వారా సాధించిన ప్రగతిని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రశంసించారు. గురువారం ఆయన పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వైద్యారోగ్య, గిరిజన సంక్షేమం, ఆర్థిక, ప్రణాళిక శాఖలపై ఆయన ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాలను ఉపయోగించుకుని మరింత ప్రగతిని సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ పరిశ్రమకు అవసరమైన సహకారం

- అధికారులకు సీఎం ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పౌల్ట్రీ పరిశ్రమకు అవసరమైన సహకారాన్ని అందివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు ఉదయ్ సింగ్ బయాస్, పొట్లూరి చక్రధర రావు, శ్రీకాంత్ మంచాల (పౌల్ట్రీ ఇండియా), కాసర్ల మోహన్ రెడ్డి, ఉప్పాల నర్సింహా రెడ్డి (టీపీఎఫ్), డి.రాఘవ రావు, కె.జి.ఆనంద్ (టీపీబీఏ), గుర్రం చంద్రశేఖర్ రెడ్డి (ఎన్ఈసీసీ)లతో పాటు డాక్టర్ జి.రంజిత్ రెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు మధ్యాహ్న భోజనంలో ప్రస్తుతం వారానికి ఇస్తున్న మూడు గుడ్లను ఐదుకు పెంచాలని కోరారు. పొరుగు రాష్ట్రాలు ఇదే విధంగా ఇస్తున్నాయని తెలిపారు. అదే విధంగా పౌల్ట్రీ పరిశ్రమకు విద్యుత్ టారీఫ్ రాయితీని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్కిల్ యూనివర్సిటీలో పౌల్ట్రీ కోర్సును ప్రవేశపెట్టాలని వారు కోరగా సీఎం సానుకూలంగా స్పందించారు. నవంబర్ 27న హైదరాబాద్ హైటెక్స్‌లో ఏర్పాటు చేయబోయే పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ కు తాను ముఖ్య అతిథిగా వస్తానని సీఎం తెలిపారు.

నర్సింగ్ ఆఫీసర్ అలివేలు మంగమ్మకు

- మంత్రి దామోదర రాజనర్సింహ సన్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిండు గర్భిణీకి ఆర్టీసీ బస్సులో పురుడు పోసిన వనపర్తి జిల్లా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పని చేస్తున్న నర్సింగ్ ఆఫీసర్ అలివేలు మంగమ్మను మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. గురువారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆమెకు శాలువ కప్పి సన్మానించారు. నగదు బహుమతిని, మెమోంటోను అందజేశారు.

జోగులాంబ గద్వాల జిల్లా కొండపల్లి గ్రామానికి చెందిన గర్భిణీ సంధ్య భర్త రామాంజితో కలిసి ఆర్టీసీ బస్సులో వనపర్తి మండలం నాచహళ్లి గ్రామ శివారులోకి రాగానే పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. కండక్టర్ భారతి 108కు ఫోన్ చేశారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న అలివేలు మంగమ్మ తక్షణం స్పందించి సంధ్యకు సాధారణ ప్రసవం చేసి తల్లి బిడ్డలను సురక్షితంగా కాపాడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి, ఆమె సేవలకుగాను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పద్మజ, మంగమ్మ భర్త సత్యనారాయణలు పాల్గొన్నారు.

బీసీ పారిశ్రామిక విధానం తేవాలి

- డిప్యూటీ సీఎం భట్టికి బిక్కి ప్రతినిధుల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా సహకరించేందుకు రాష్ట్రంలో బీసీ పారిశ్రామిక విధానం తేవాలని బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(బిక్కి) సంస్థ ప్రతినిధులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో భట్టితో బీసీ పారిశ్రామిక విధానం, ప్రోక్యూర్మెంట్ పాలసీపై బిక్కి అధ్యక్షుడు చీరాల నారాయణ, కార్యదర్శి దాసరి కిరణ్, రాష్ట్ర సమన్వయకర్త పరికిపండ్ల సుమంత్ సమావేశమయ్యారు. పది ప్రతిపాదనలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బీసీ పారిశ్రామిక వేత్తలకు సంబంధించిన సమస్యలు, వారి పరిష్కార మార్గాలు, ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయసహకారాల గురించి చర్చించారు. త్వరలోనే బిక్కి ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా చూస్తానని వారికి మంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. కుటీర, కుల, చేతి వృత్తులకు ఆధునిక సాంకేతికతను జోడించి కొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతామని, ప్రత్యేక సబ్సిడీలు, రాయితీలు తదితరాలు కల్పించడమే కాకుండా, కొత్తగా బీసీ పారిశ్రామిక విధానానికి పునాదులు కూడా వేసేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

బిక్కి ప్రతిపాదనలు:

1. యువ, మహిళా బీసీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి.
2. బీసీ పారిశ్రామిక విధానాన్ని ప్రకటించడమే కాకుండా ఎంబీసీ కులాల కోసం ప్రత్యేక విధానాన్ని ప్రకటించాలి.
3. ప్రభుత్వం విడుదల చేసే వివిధ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన టెండర్లలో బీసీలకు 30 శాతం కేటాయించాలి. ఆయా టెండర్లలో ఎవ్వరూ పాల్గొనకపోతే, మూడుసార్లు ప్రకటించిన మీదట సాధారణ ప్రజలకు అవకాశమివ్వాలి.
4. బీసీల్లో పారిశ్రామికవేత్తలు తక్కువగా ఉన్న దృష్ట్యా, అంకుర పరిశ్రమలకు అవకాశాలు కలిగేలా పారిశ్రామిక అనుభవం, ఈఎమ్‌డీ మినహాయింపులు కల్పించాలి.
5. కుల వృత్తుల ఉత్పత్తులకు, సేవకు సంబంధించిన టెండర్లలో బీసీలకు మాత్రమే అవకాశం ఇచ్చేలా ప్రత్యేక చట్టం చేయాలి.
6. కంపెనీ స్థాపనలో అవసరమయ్యే భూ విక్రయం, లీజ్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ ఫీజులో పూర్తి మినహాయింపు ఇవ్వాలి.
7. పారిశ్రామిక భూముల్లో బీసీల లెక్కలు తీసి, న్యాయపరమైన వాటా అందేలా చొరవ చూపెట్టాలి.
8. బీసీ పారిశ్రామికవేత్తలకు వృత్తినైపుణ్య శిక్షణతో పాటు పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన వ్యవస్థాపకత అభివృద్ధి శిక్షణా తరగతులను ప్రభుత్వమే నిర్వహించాలి. అందుకుగానూ స్థానికంగా పని చేస్తున్నటువంటి బీఐసీసీఐ లాంటి సంస్థలతో కలిసి పని చేయాలి.
9. ప్రపంచీకరణ నేపథ్యంలో కుటీర, కుల, చేతి వృత్తులను ఆధునీకరించేలా యూనివర్సిటీల్లో పని చేస్తున్నటువంటి ప్రొఫెసర్లతో కలుపుతూ ఇండస్ట్రీ - అకాడమిక్ ప్రాజెక్టులకు మద్దతివ్వాలి. అందుకోసం నిధులు కూడా కేటాయించాలి. ఆ పరిశోధన ద్వారా వచ్చే మేథో సంపత్తిని వారి పేరిట నమోదు జరగడమే కాకుండా వారి ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మేలా చొరవ చూపాలి.
10. ప్రత్యేక విద్యుత్ సబ్సిడీ, భూ సబ్సిడీ లను కల్పిస్తూ, పారిశ్రామల వ్యవస్థాపనలో ఉండే పెట్టుబడులను, నిర్వహణా ఖర్చులను తగ్గించేలా చూడాలి.

హెచ్‌ఎం ఇబ్బందులు పెడుతున్నారు

- పోలీస్‌స్టేషన్ ఎదుట గురుకుల విద్యార్థుల ధర్నా



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలోని మావల మండల పరిధిలోగల మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రధానోపాధ్యాయురాలు పెట్టే బాధలు భరించలేకపోతున్నామని వాపోయారు. కారణం లేకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ గురువారం ఉదయం జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు విద్యార్థులు కాలినడకన వచ్చారు. అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయురాలు రోజూ ఏదో ఒక కారణంతో తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన భోజనం, హాస్టల్లో ఫ్యాన్లు, లైట్లు లేవని చెప్పారు. పలుమార్లు ప్రధానోపాధ్యాయురాలికి చెప్పినా పట్టించుకోకపోగా.. తమనే మందలిస్తున్నారని అన్నారు. వెంటనే ఆమెను ఇక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. చివరకు అధికారులు, పోలీసులు నచ్చజెప్పడంతో పాఠశాలకు తిరిగి వెళ్లారు. ఈ పరిస్థితిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

రూ.2 లక్షల పైనుంటే కట్టాల్సిందే..!

ఆపై మొత్తం చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందట!

- మార్గదర్శకాల్లో ఉన్నా.. మంత్రి చెప్పినా.. ప్రాసెస్‌పై సందిగ్ధత
- దీనిపై షెడ్యూల్ విడుదల చేస్తేనే స్పష్టత
- మంత్రివర్గ నిర్ణయంపై రైతుల ఎదురుచూపులు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీ పథకంలో రుణ విముక్తి కాని రైతుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు మూడు విడతలుగా రూ.2 లక్షలలోపు ఉన్న 22 లక్షల మంది రైతులకు చెందిన సుమారు రూ.19 లక్షల వరకు రుణమాఫీ అయింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల పైన ఎంతున్నా ఆ మొత్తాన్ని మినహాయించి రూ.2 లక్షల వరకు మాఫీ చేయాల్సి ఉంటుంది. ముందుగా ఈ మేరకు మాఫీ చేసి ఉంటే ఎలాంటి సమస్య ఉండేది కాదు. అయితే మార్గదర్శకాలు, మంత్రుల ప్రకటనల్లో రూ.2 లక్షలకు పైనున్న మొత్తాన్ని చెల్లిస్తే మాఫీ వర్తిస్తుందని ప్రకటిస్తున్నారు తప్ప దానిపై ఎలాంటి స్పష్టత ఇవ్వట్లేదు. ఎప్పుడు చెల్లించాలి? ఏ ప్రాతిపదికన చెల్లించాలి? అనే అంశాలపై నిర్దిష్టత కొరవడింది. దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదలవుతుందని వ్యవసాయశాఖ ప్రకటిస్తున్నా ఇంత వరకూ అలాంటిదేమీ అమలుకాకపోవడంతో రుణమాఫీ కాని రైతుల్లో గందరగోళం నెలకొంది. వీరి రుణాలను ఎప్పుడు మాఫీ చేయాలి? ఎంత సమయం ఇవ్వాలి? కటాఫ్ తేదీ ఎప్పుడు పెట్టాలి? అనే విషయమై మంత్రి వర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాతే షెడ్యూల్ విడుదలవుతుందని సమాచారం.

రూ.లక్షకు వారం చొప్పున...

రూ.2 లక్షలకు పైనున్న రుణాల చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్ రెండు, మూడు రోజుల్లో విడుదల కావొచ్చని విశ్వసనీయ సమాచారం. అయితే కేబినెట్‌లో చర్చించాక దీనిపై నిర్ణయం ఉంటుందా? అలాంటిదేమీ లేకుండానే షెడ్యూల్ విడుదల చేస్తారా? అనే దానిపై మాత్రం స్పష్టత లేదు. షెడ్యూల్ ఎప్పుడు విడుదలైనా రూ.లక్షకు వారం చొప్పున సమయం ఇస్తారని తెలుస్తోంది. రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఒక వారం, రూ.3-4 లక్షల వరకు ఒక వారం, 4-5 వరకు మరో వారం, రూ.5లక్షలకు పైబడిన రైతులందరికీ ఒక వారం ఇలా మొత్తం నెలరోజుల వ్యవధిలో రూ.2లక్షల పైనున్న నగదు చెల్లించేలా షెడ్యూల్ విడుదల చేస్తారని వ్యవసాయశాఖ వర్గాల సమాచారం. నిర్దేశిత సమయంలో చెల్లించిన రైతులందరి డేటాను బ్యాంకుల నుంచి సేకరించి, అర్హతలను పరిశీలించి.. ప్రభుత్వానికి పంపుతారని అంటున్నారు. అయితే ప్రస్తుతం తీసుకుంటున్న రూ.2 లక్షలలోపు ఫిర్యాదుల్లో రూ.2లక్షలకు మించి రుణం ఉన్న వారు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ సూచిస్తోంది.

రూ.2లక్షల లోపు క్లియరైతేనే షెడ్యూల్..

రూ.2 లక్షల పైనున్న రైతుల రుణమాఫీ చేయాలంటే ఇంకా రూ.9వేల కోట్లు అవసరం అవుతాయనేది ప్రభుత్వ ప్రాథమిక అంచనా. ఈ పథకానికి పీఎం కిసాన్ నిబంధనల్ని అమలు చేస్తుండటంతో రైతుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అలా అయితే రూ.4, 5వేల కోట్లతో సర్దుబాటు చేయొచ్చు. ఇప్పటికే 31 సాంకేతిక అంశాల కారణంగా రూ.2లక్షల లోపున్న లక్షలాది మంది రైతుల ఖాతాలు క్లియర్ కాలేదు. దీనిపై ఇప్పటికే ఏఈవోలు, ఏఓలు క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ఇవి కొలిక్కి వచ్చాకే రూ.2 లక్షల పైనున్న రుణాలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలయ్యే చాన్స్ ఉందని అంటున్నారు.

రెండు బ్యాంకుల్లో కలిపి రూ.2 లక్షల పైనుంటే..!

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన కొత్తపల్లి అమృతారెడ్డికి స్థానిక యూనియన్ బ్యాంక్‌లో రూ.1.63 లక్షలు, అదే గ్రామంలోని జిల్లా సహకార బ్యాంకులో రూ.1.35 లక్షల రుణాలు ఉన్నాయి. రెండు బ్యాంకుల్లో కలిపి మొత్తం రూ.2.98 లక్షల రుణం ఉంది. పీఎం కిసాన్ లబ్దిదారుడే కాకుండా రేషన్‌కార్డు కూడా ఉన్నా రుణమాఫీ జాబితాలో సంబంధిత రైతు పేరు లేదు. రూ.2 లక్షలకు పైనున్న మొత్తంపై రైతు సందిగ్ధంలో ఉన్నారు. ఆ మొత్తం చెల్లించాలా? చెల్లిస్తే ఏ బ్యాంకులో ఎంత చెల్లించాలి? చెల్లించాక రుణమాఫీ అవ్వకపోతే ఎలా? ఇలాంటి సందేహాలెన్నో ఆ రైతును వెంటాడుతున్నాయి. దాదాపు రూ.2 లక్షలకు పైన రుణం ఉన్న రైతులందరిదీ ఇదే పరిస్థితి. రాష్ట్రవ్యాప్తంగా ఇలా అనేక మంది రైతులు గందరగోళంలో ఉన్నారు. షెడ్యూల్ విడుదలైతే తప్ప దీనిపై స్పష్టత రాదని బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసే పశ్చిమ దేశాల విధానం

ఇటాలియన్ డిప్యూటీ ప్రధాని



రష్యా : రష్యా గడ్డపై లక్ష్యాలను ఛేదించడానికి ఉపయోగించే ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందించడం ద్వారా ఉక్రెయిన్ పాశ్చాత్య మద్దతుదారులు మూడో ప్రపంచ యుద్ధాన్ని ప్రేరేపించగలరని ఇటాలియన్ ఉప ప్రధాన మంత్రి మాటియో సాల్విని చెప్పాడు. కుర్స్క్ ప్రాంతంలో తమ చొరబాటులో ఉక్రేనియన్ మిలిటరీ పాశ్చాత్య దేశాలు సరఫరా చేసిన ఆయుధాలను ఉపయో గిస్తోందని రష్యా అధికారులు పేర్కొన్నారు. అనేక పాశ్చాత్య మీడియా సంస్థలు ఆలస్యంగా ఇలాంటి వాదనలతో కథనాలను ప్రచురించాయి. అనేక మంది కీవ్ మద్దతుదారులు రష్యా గడ్డపై వారు అందించిన ఆయుధాలను ఉపయో గించడానికి బహిరంగంగా అనుమతి ఇచ్చారు. "రష్యన్ భూభాగంలో కూడా దాడి చేయడానికి, చంపడానికి ఆయుధాలను పంపడం విపత్తు. ఇది ఒక నాటకీయ ప్రపంచ సంఘర్షణకు పూర్వగామి అని మౌలిక సదుపాయాలు, రవాణా మంత్రి, లెగా నోర్డ్ (నార్తర్న్ లీగ్) పార్టీకి నాయకత్వం వహిస్తున్న సాల్విని బుధవారంనాడు ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ అన్నాడు. ఉక్రెయిన్ తనను తాను రక్షించుకునే అవకాశాన్ని కల్పించడానికి మానవతా సైనిక సహాయం అందించడానికి తన మితవాద పార్టీకి వ్యతిరేకం కాదని ఉప ప్రధాన మంత్రి తెలిపాడు.

జూన్‌లో యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికలకు ముందు సాల్విని ఇటాలియన్లు వామపక్ష పార్టీలను గెలవనివ్వవద్దని కోరాడు. ఎందుకంటే వారు ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో కలిసి మూడో ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని ముందుకు తెస్తున్నారు. 'మాక్రాన్ వంటి ప్రమాదకరమైన బాంబర్లను వేరుచేయడానికి నేను యుద్ధానికి వ్యతిరేకంగా ఓటు వేయమని గట్టిగా అడుగుతున్నాను' అని అతను ఆ సమయంలో చెప్పాడు. ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దళాలను మోహరించడం గురించి మాట్లాడే ఐరోపాలో ఉన్నవారికి వ్యతిరేకంగా ఇటాలియన్ ప్రభుత్వం దాని దఢమైన వైఖరిని సాల్విని ప్రశంసించాడు. రష్యా లోపల దాడి చేయడానికి, చంపడానికి ఆ ఆయుధాలు ఉపయోగించబడవని మాకు కచ్చితంగా తెలియకపోతే, అటువంటి ఆయుధాలను పంపడాన్ని మేము ఇకపై ఆమోదించము అని జూన్‌లో డిప్యూటీ ప్రధాన మంత్రి పేర్కొన్నాడు. ఇది మమ్మల్ని నేరుగా మూడవ ప్రపంచ యుద్ధం వైపు తీసుకెళ్ళే సంఘటన అని అతను ఆ సమయంలో చెప్పాడు. విదేశాంగ మంత్రి ఆంటోనియో తజానీ దీనిని ప్రతిధ్వనిస్తూ విలేకరులతో ఇలా అన్నాడు: "మేము రష్యాకు వ్యతిరేకంగా పోరాడటం లేదు. మేము ఉక్రెయిన్‌ను సమర్థిస్తున్నాము. ఇది, అది ఒకటి కాదు. నాటో సెక్రటరీ-జనరల్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్‌ను ప్రమాదకరమైన పెద్దమనిషిగా సాల్విని అభివర్ణించాడు. అతను కీవ్‌ను పాశ్చాత్య ఆయుధాలతో రష్యాలోని లోతైన లక్ష్యాలను ఛేధించడానికి అనుమతించమని ప్రతిపాదించాడు. స్టోల్టెన్‌బర్గ్ అలాంటి విషయం ఎందుకు చెప్పాడు అని ప్రధాన మంత్రి జార్జియా మెలోనీ కూడా తన విస్మయాన్ని వ్యక్తం చేసింది.

పాశ్చాత్య జోక్యం లేకుండా ఆఫ్రికా విభేదాలను పరిష్కరించుకోవాలి : దక్షిణాఫ్రికా రాజకీయవేత్త



పాశ్చాత్య శక్తులు వెనక్కి తగ్గాలని, ఆఫ్రికన్ దేశాలు తమ స్వంత వ్యవహారాలను నియంత్రించుకోవడానికి అనుమతించాలని దక్షిణాఫ్రికా ఎకనామిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ (ఇఎఫ్ఎఫ్) పార్టీ మాజీ సెక్రెటరీ-జనరల్, గాడ్రిచ్ గార్డీ కోరాడు. 2011లో లిబియాలో నాటో జోక్యం ప్రారంభంలో పౌరులను రక్షించడం, దేశాన్ని అణచివేత నుంచి విముక్తి చేయడం లక్ష్యంగా మానవతా మిషన్‌గా ప్రదర్శించబడింది. ఇది దేశాన్ని గందరగోళంలో పడేసింది. పశ్చిమ దేశాలు మాత్రమే లిబియా నుండి బయటకు వెళ్లి లిబియా సమస్యను ఆఫ్రికా, ఆఫ్రికన్ యూనియన్ (ఏయు) ప్రజలకు ప్రత్యేకంగా వదిలివేయగలిగితే లిబియాలో శాంతి, స్థిరమైన అభివద్ధి సాధ్యమవుతుంది అని గార్డీ మీడియాకు ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పాడు. నాటో జోక్యంతో లిబియాలో పరిస్థితి మరింత దిగజారిందని, ఇది దేశాన్ని అస్థిరపరిచిందని ఆయన పేర్కొన్నాడు. ఆఫ్రికా సమస్యలు ముఖ్యంగా ఖండంలోని గొప్ప ఖనిజ, సహజ వనరుల కోసం పోటీలో భాగంగా బాహ్య ప్రయోజనాల ద్వారా నడపబడుతున్నాయని గార్డీ చెప్పాడు. ఆఫ్రికాలో కనిపించే ప్రతి సంఘర్షణలో, ఇది ఖనిజ వనరులు మరియు అన్ని ఇతర వనరుల కోసం యుద్ధం చమురు, గ్యాస్, బొగ్గు, బంగారం, యురేనియం ఏదైనా పశ్చిమ దేశాలకు చాలా అవసరం. తద్వారా వారు ప్రయోజనం పొందవచ్చు. అందుకోసం ఆ దేశాలు చేసే అరాచకాలు అనంతం"అని అతను చెప్పాడు. ఆఫ్రికా ఛిన్నాభిన్నంగా ఉన్నంత వరకు ఈ సమస్యలు కొనసాగుతాయని ఆఫ్రికన్ సంఘర్షణలలో పశ్చిమ దేశాలు పదేపదే జోక్యం చేసుకోవటాన్ని విమర్శిస్తూ పాన్-ఆఫ్రికనిస్ట్ ఇఎఫ్ఎఫ్ పార్టీ మాజీ సెక్రటరీ జనరల్ హెచ్చరించాడు.

ప్రాంతీయ సంస్థలు, ఖండాలు ఏకం కానంత కాలం, అవి కేవలం దేశాల గ్రామాలుగా ఉన్నంత వరకు పశ్చిమ దేశాలు అలానే కొనసాగిస్తాయి. మనకు ఒక ఆఫ్రికా, ఒక ఆఫ్రికన్ దేశం కాకుండా ఆఫ్రికాలో 54 దేశాలు ఉన్నాయని గాడ్రిచ్ గార్డీ అన్నాడు. ఒకే కరెన్సీ, సైన్యం, ఆర్థిక వ్యవస్థతో ఖండాన్ని ఒకే ప్రభుత్వం కింద ఏకం చేసే దిశగా నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని గార్డీ ఆఫ్రికన్ యూనియన్‌కి పిలుపునిచ్చాడు. ఆఫ్రికన్ యూనియన్ దీని గురించి ఏదైనా చేయాలి, ఆఫ్రికన్ దేశాలను ఒక సంస్థగా, ఒక ద్రవ్య కరెన్సీగా, ఒక సైన్యంగా , ఒకే ఆర్థిక వ్యవస్థతో ఆఫ్రికా ప్రజల కోసం ఒక ప్రభుత్వంగా ఏకం చేయాలి అని ఆయన ముగించాడు. ఇటువంటి ఆవశ్యకతకు ఉదాహరణగా గార్డీ లిబియాలో ఐరోపా దేశాలు చేసిన ఘోరాలను ఉదాహరించాడు. 2011 జనవరిలో ట్యునీషియా అధ్యక్షుడు జైన్ అల్-అబిదీన్ బెన్ అలీ తన దేశం నుండి పారిపోయాడని వార్తలు వచ్చిన కొద్దిసేపటికే లిబియాలో అశాంతి మొదలైంది. బెంఘాజీ, డెర్నా మరియు అల్-బైదా వంటి లిబియా నగరాల్లో మొదట నిరసనలు చెలరేగాయి. 2011 ఫిబ్రవరి 17న ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి 1973 తీర్మానాన్ని ఆమోదించింది. లిబియాపై నో-ఫ్లై జోన్‌ను విధించింది. పౌరులను రక్షించడానికి బలప్రయోగానికి అధికారం ఇచ్చింది. ఈ తీర్మానం మార్చి 19న నాటో జోక్యానికి అనుమతించింది. దాని తర్వాత లిబియా సుదీర్ఘమైన, రక్తసిక్తమైన అంతర్యుద్ధంలోకి దిగడం, దేశం ఛిన్నాభిన్నం అవటం జరిగింది.

అత్యుత్తమ ఆటగాళ్లుగా రోహిత్, కోహ్లి

- ద్రావిడ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు
- సియేట్ క్రికెట్ అవార్డుల ప్రదానోత్సవం

ముంబయి: టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, మహ్మద్ షమీలకు అవార్డులు వరించాయి. 26వ సియేట్ క్రికెట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ముంబయిలో బుధవారం అట్టహాసంగా జరిగింది. 2023 ఏడాదికి టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు ఇంటర్నేషనల్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వరించగా.. కోచ్ రాహుల్ ద్రావిడ్‌కు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు, విరాట్ కోహ్లికి ఉత్తమ వన్డే బ్యాటర్ ఆఫ్ ది ఇయర్, పేసర్ మహ్మద్ షమీకి 2023 ఏడాదికి ఉత్తమ వన్డే బౌలర్‌గా అవార్డులు దక్కాయి. 2023లో రోహిత్ శర్మ 1,800 అంతర్జాతీయ పరుగులు కొట్టాడు. అందులో వన్డేల్లో 52.59 సగటుతో 1,255పరుగులు చేయగా.. ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో 597 పరుగులు కొట్టిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రోహిత్ శర్మ మాట్లాడుతూ.. భారతజట్టు టి20 ప్రపంచకప్ గెలుచుకోవడంలో ఆ ముగ్గురి పాత్ర కీలకమని పేర్కొన్నాడు. కోచ్ రాహుల్ ద్రవిడ్, సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్‌తోపాటు బోర్డు కార్యదర్శి జై షా ముగ్గురు మూడు పిల్లర్ల వల్లే సాధ్యమైందని పేర్కొన్నాడు. ఈ ముగ్గురి వల్లనే ఐసిసి ట్రోఫీ కల సాకారమైందన్నాడు. టోర్నమెంట్ మొత్తం ఫలితాల గురించి పెద్దగా ఆలోచించలేదని, ఎవరి పాత్ర వారు సమర్థవంతంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకున్నామన్నారు. ఇందుకు జై షా, ద్రవిడ్, అగార్కర్ నుంచి తనకు పూర్తి సహకారం లభించిందన్నాడు. దీనికి తోడు ప్లేయర్లందరూ సమిష్టిగా రాణించడం కలిసివచ్చింది. దీంతో దశాబ్ద కాలంగా అందని ద్రాక్షలా ఉన్న ఐసిసి ట్రోఫీని చేజిక్కించుకోవడం జరిగిందని గుర్తుచేసుకున్నాడు. అలాగే ప్రపంచకప్ గెలిచిన తర్వాత ప్రతీ సందర్భాన్ని ఆస్వాదించాలనుకున్నాం. అందుకు తగ్గట్లు దేశం మొత్తం సంబరాల్లో భాగం కావడం జీవితంలో మరిచిపోలేనిది. అది మాటల్లో వర్ణించలేమన్నాడు. రానున్న రోజుల్లో కీలకమైన సిరీస్‌ల్లో ఆడాల్సి ఉంది' అని అన్నాడు.





అవార్డులు దక్కించుకున్న ఇతర క్రికెటర్లు..

టెస్ట్ బ్యాటర్ ఆఫ్ ది ఇయర్	: యశస్వి జైస్వాల్
టెస్ట్ బౌలర్ ఆఫ్ ది ఇయర్	: రవిచంద్రన్ అశ్విన్
టి20 బ్యాటర్ ఆఫ్ ది ఇయర్	: ఫిల్ సాల్ట్
స్టార్ స్పోర్ట్స్ టి20 లీడర్ షిప్	: శ్రేయస్ అయ్యర్(కోల్‌కతా నైట్‌రైడర్స్)
స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్ ఎక్సలెన్స్	: జై షా
అత్యధిక టి20లకు మహిళా కెప్టెన్	: హర్మన్ ప్రీత్ కౌర్
భారత ఉత్తమ మహిళా బౌలర్ ఆఫ్ ది ఇయర్	: దీప్తి శర్మ
వేగంగా డబుల్ సెంచరీ కొట్టిన మహిళా క్రికెటర్	: షెఫాలీ వర్మ

వన్డే బ్యాటర్ ఆఫ్ ది ఇయర్‌గా విరాట్..

'వన్డే బ్యాటర్ ఆఫ్ ది ఇయర్' టీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లికి లభించింది. 2023లో విరాట్ కోహ్లి అద్భుత ఫామ్‌తో బ్యాట్‌నుంచి పరుగుల వరద పారింది. ఈ క్రమంలో ఆ ఏడాది ఆరు సెంచరీలతో సహా 1,377పరుగులు చేసాడు. 2023 ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో కోహ్లి ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. ఈ టోర్నమెంట్‌లో భాగంగా 11 మ్యాచుల్లో 95.62సగటుతో 765పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో అత్యధిక సెంచరీలు కొట్టిన సచిన్ టెండూల్కర్(6సెంచరీ) రికార్డును సమం చేశాడు.

ద్రావిడ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు..

టీమిండియా మాజీ కోచ్ రాహుల్ ద్రావిడ్‌కు ప్రతిష్టాత్మక లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించారు. అమెరికా-వెస్టిండీస్ వేదికగా జరిగిన టి20 ప్రపంచకప్‌లో భారతజట్టు ట్రోఫీని కైవసం చేసుకోవడంలో ద్రావిడ్ కీలకపాత్ర పోషించాడు. కోచ్‌గా భారత క్రికెట్‌జట్టుకు గణనీయమైన సేవలు చేసినందుకు ద్రావిడ్‌కు ప్రశంసలు దక్కాయి.

ఉత్తమ బౌలర్‌గా షమీ...

టీమిండియా పేసర్ మహ్మద్ షమీకి 2023 ఏడాదికి అత్యుత్తమ వన్డే బౌలర్‌గా అవార్డు అందుకున్నాడు. 2023 ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో మహ్మద్ షమీ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. ఆ టోర్నమెంట్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరడంలో షమీ కీలకపాత్ర పోషించాడు. కేవలం 7మ్యాచుల్లో 24వికెట్లు పడగొట్టాడు. దీంతో ఆ టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా షమీ నిలిచాడు.

ఆటలు

2025లో ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్..



ముంబయి: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య 2025లో ఐదు టెస్టుల సిరీస్ షెడ్యూల్‌ను బిసిసిఐ, ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు ప్రకటించాయి. భారత జట్టు వచ్చే ఏడాది జూన్‌లో ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఇరుజట్ల మధ్య చివరిసారిగా 2021లో ఐదు టెస్టుల సిరీస్ జరిగింది. ఈ సిరీస్ 2-2తో డ్రా అయ్యింది. ఇప్పుడీ సిరీస్‌తో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సైకిల్ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్‌కూ కెప్టెన్‌గా రోహిత్ శర్మ వ్యవహరించనున్నాడు. జూన్-జులై 2025 మధ్య భారత మహిళల జట్టు కూడా ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. మూడు వన్డేలు, ఐదు టి20లను ఆడనుంది.

షెడ్యూల్...

తొలి టెస్ట్	: జూన్ 20-24(లీడ్స్)
రెండో టెస్ట్	: జులై 2-6(బర్మింగ్‌హామ్)
మూడో టెస్ట్	: జులై 10-14(లండన్)
నాలుగో టెస్ట్	: జులై 23-27(మాంచెస్టర్)
ఐదో టెస్ట్	: జులై 31-ఆగస్ట్ 4(లండన్)

ప్రి క్వార్టర్స్‌లో ఓడిన కరుణాకరన్

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



టోక్యో: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ప్రి క్వార్టర్స్‌కు చేరిన ఏకైక షట్లర్ సతీశ్ కరుణాకరన్ పోరాడి ఓటమిపాలయ్యాడు. గురువారం జరిగిన ప్రి క్వార్టర్స్ పోటీలో కరుణాకరన్ 21-18, 18-21, 8-21తో వాంగ్‌ఛరణ్(థాయ్‌లాండ్) చేతిలో పరాజయాన్ని చవిచూసాడు. రెండోరౌండ్‌లో ఆంటోన్సెన్(డెన్మార్క్) గాయంతో నిష్క్రమించడంతో ప్రి క్వార్టర్స్‌కు చేరిన కరుణాకరణ్ పోరాడినా ప్రయోజనం లేకపోయింది. అంతకుముందు కిరణ్ జార్జి 19-21, 14-21తో సునేయమా(జపాన్) చేతిలో ఓడాడు.

శ్రీలంక 236ఆలౌట్

ఇంగ్లండ్‌తో తొలిటెస్ట్

మాంచెస్టర్: ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన శ్రీలంక జట్టు తొలిటెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 236పరుగులకే ఆలౌటైంది. రత్నాయకే(72), ధనుంజయ(74) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లు వోక్స్, బషీర్ మూడేసి వికెట్లతో, అట్కిన్సన్ రెండు వికెట్లు పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్ 8వికెట్ల నష్టానికి 178పరుగులతో గురువారం తొలిరోజు ఆటను కొనసాగించిన శ్రీలంక మరో 58 పరుగులు జతచేసి చివరి రెండు వికెట్లు కోల్పోయింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు 47ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 208పరుగులు చేసింది. రూట్(42)కి తోడు బ్రూక్(56) అర్ధసెంచరీతో మెరిసాడు. ఆ సమయానికి వికెట్ కీపర్ స్మిత్(46), వోక్స్(7) క్రీజ్‌లో ఉన్నారు.

షకీల్, రిజ్వాన్ భారీ శతకాలు

పాకిస్తాన్ 448/6డిక్లేర్డ్

రావల్పిండి: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో పాకిస్తాన్ జట్టు పట్టు బిగించింది. మిడిలార్డర్ బ్యాటర్లు షౌద్ షకీల్(141), వికెట్ కీపర్ రిజ్వాన్(171నాటౌట్) భారీ సెంచరీలతో చెలరేగారు. దీంతో రెండోరోజు పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 113 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 448పరుగులు చేసి డిక్లేర్డ్ చేసింది. తొలిరోజు 16పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ పాకిస్తాన్‌ను ఆయుబ్, షకీల్ కలిసి ఆదుకున్న సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్ బౌలర్లు షోరిఫుల్ ఇస్లామ్, హసన్ మహ్మద్‌కు రెండేసి, మిరాజ్, షకీబ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.